సిటీ◆

ప్రజాశక్తి


ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 37 సంచిక : 47 | విజయవాడ, శనివారం 17 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

తమిళనాడుకు కావేరీ జలాల్లో 'కోత'

- 177.25 టిఎంసీలు కేటాయిస్తూ సుప్రీం తీర్పు
- కర్ణాటకకు అదనపు మిగులు జలాలు



8



జెఎఫ్‌సి సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు, తెలుగు రాష్ట్రాల మేధావులు, విద్యావేత్తలు

నిజాలు చెప్పడం లేదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై జెఎఫ్‌సి విమర్శ

- ముగ్గురు సభ్యులతో సబ్‌కమిటీ ఏర్పాటు
- ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకే : పవన్‌కళ్యాణ్
- హామీలపై మార్చి 5లోపు స్పష్టత ఇవ్వాలి : మధు
- కేంద్ర రాష్ట్రాల నిర్లక్ష్యం : రామకృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విభజన హామీల అమలు, నిధుల విడుదల, వాటి ఖర్చు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాస్తవాలు చెప్పడం లేదని జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జెఎఫ్‌సి) విమర్శించింది. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చొరవతో ఏర్పాటైన ఈ కమిటీ తొలి సమావేశం హైదరాబాద్‌లో శుక్రవారం జరిగింది. పత్యేక హోదా తో పాటు విభజన హామీలు, నిధులు విడుదల తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సమావేశం తీర్మానం చేసింది. విభజన హామీల అమలు, నిధుల విడుదల, ఖర్చు తదితర అంశాలపై వివరాలు సేకరించేందుకు ముగ్గురు సభ్యులతో సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది.ఈ కమిటీలో మాజీ సిఎస్ ఐవైఆర్ కృష్ణారావు, కేంద్ర హోంశాఖ మాజీ సెక్రటరీ, సలహాదారు పద్మనాభయ్య, మహారాష్ట్ర కేడర్ మాజీ ఐఎఎస్ అధికారి చంద్రశేఖర్‌లు ఉన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ సమావేశానికి అధ్యతన వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కాంగ్రెస్ నుంచి జంగా గౌతమ్, గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ పాలకులు చేసిన తప్పులకు ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. విభజన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పరస్పర విరుద్ధ ప్రకటనలతో ప్రజలను అయోమయ పరిస్థితుల్లోకి నెట్టేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటరీ వ్యవస్థలో మాట ఇచ్చి వెనక్కి వెళ్లిపోతే ప్రతీ ఒక్కరిలో తిరుగుబాటు మిగతా2లో



మృతదేహాలు

విలపిస్తున్న కుటుంబీకులు

సజీవ సమాధి

- వ్యర్థాల ట్యాంక్‌లో ఊపిరాడక ఏడుగురు కార్మికుల దుర్మరణం
- రూ.25 లక్షల పరిహారానికి సిఐటియు డిమాండ్
- తలొగ్గిన యాజమాన్యం, ప్రభుత్వం

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

హేచరీస్ వ్యర్థాల ట్యాంక్ తమ పాలిట మృత్యువవుతుందని ఆ కార్మికులకు తెలియదు.. యాజమాన్యం ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయమే ట్యాంక్ శుభ్రం చేయడానికి ఓ కార్మికుడు దిగారు.. తమ సహచర కార్మికుడు పైకి రాకపోవడంతో ఏమయ్యాడోనని ఒకరి వెంట మరొకరు తొమ్మిదిమందీ దిగారు. ఏడుగురు ఊపిరాడక స్పృహ తప్పి పడిపోయారు. మరో ఇద్దరు ఊపిరాడక పైకొచ్చేశారు.. వారి ద్వారా విషయం తెలుసుకొని.. జెసిబితో ట్యాంక్ పైభాగాన్ని పగలగొట్టి చూడగా కార్మికులు విగత జీవులై కనిపించారు. ఈ మృతదేహాలను పైకి తీశారు. ట్యాంక్‌లో కార్బన్ మోనాక్సైడ్, టాక్సిజన్ వంటి విషవాయువుల వల్లే కార్మికులు చనిపోయారని పలమనేరులోని ప్రభుత్వ వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన చిత్తూరు జిల్లా పలమనేరు రూరల్ మండలం మొరం గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరా హేచరీస్‌లో శుక్రవారం జరిగింది. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు యాజమాన్యం రూ.15 లక్షల చొప్పున సాయం, ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తామని మిగతా9లో

నో క్యాష్.. నాట్ వర్కింగ్..

రాష్ట్రంలో 90 శాతం ఏటిఎంల మూత



ప్రజాశక్తి యంత్రాంగం

రాష్ట్రంలో 90 శాతం ఎటిఎంలు మూతపడ్డాయి. నగరాల్లో అయితే 75 శాతం పనిచేయడం లేదు. బ్యాంకుల్లో తీసుకుందామన్నా రెగ్యులర్‌గా జరిగే లావాదేవీల్లో సగం కూడా జరగడం లేదు. రిజర్వు బ్యాంకుల నుంచి బ్యాంకు బ్రాంచీలకు రావాల్సిన నగదులో సగం కూడా రావడం లేదు. దీనికితోడు పెద్ద నోట్ల రద్దుతో విసిగి వేసారిపోయిన ప్రజలను.. భయాందోళనల చెందేలా ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లు ప్రతిపాదన తీసుకురావడం మూలంగానూ ఈ సమస్య ఏర్పడిందని ప్రచారం జరుగుతోంది. ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లు ప్రభావంతో ప్రజలు బ్యాంకుల్లో డబ్బు డిపాజిట్లు చేసేందుకు ఇష్టపడడం లేదనీ, ఉన్న నిల్వలను ఉపసంహరించుకుంటున్నారని సర్వత్రా వినవస్తోంది. మరోవైపు మిగతా9లో

నా స్నేహితుని తండ్రిని ఆస్పత్రిలో చేర్పించాం. అతనికి చికిత్సకు డబ్బు అవసరమై నన్నడిగాడు. ఇద్దామని ఎటిఎంకు వెళితే ఎక్కడా అవి పని చేయలేదు. అందుబాటులో ఉన్న ఎనిమిది ఎటిఎంలు తిరిగాను. చివరికి జైలు రోడ్డులోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ దగ్గర ఎటిఎంలో డబ్బులు వస్తున్నాయని తెలిసి వెళ్లాను. అక్కడ కూడా పెద్ద లైను ఉంది. వీలుగాక బ్యాంక్‌కు పాసుబుక్ పట్టుకుని వెళ్లి విత్‌డ్రా చేసి నా స్నేహితునికి డబ్బిచ్చాను.

– ప్రణీత్, విశాఖపట్నం


లారీ కిరాయికి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా ఆయిల్ నింపడానికి, డ్రైవర్‌కు బేటాలు, టోల్‌గేట్, ఎగుమతి దిగుమతి ఛార్జీల చెల్లింపు అవసరాలకు ప్రత్యేక ఖాతాలో నగదు వేస్తాం. ఆ ఖాతా ఎటిఎం కార్డును డ్రైవర్‌కు ఇస్తాం. ఎటిఎంలు పని చేయకపోవడంతో వెళ్లిన చోట డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఖాతాలోని నగదు తీసి అవసరాలకు ఇద్దామని రామవరప్పాడు, బెంజిసర్కిల్ తదితర ప్రాంతాల్లో తిరిగినా ఎక్కడా ఆంధ్రాబ్యాంకు, స్టేట్ బ్యాంకు ఎటిఎంలు పనిచేయడం లేదు. నగరంలో ఏ ఎటిఎంలో డబ్బుందో అన్వేషణ చేయాల్సి వస్తోంది.

– సుంకర రమేష్, లారీ ఆపరేటర్, విజయవాడ

బాబుకు ఢిల్లీ పిలుపు?

- కింకర్తవ్యంపై మంతనాలు
- తెగతెంపులే మేలంటున్న మంత్రులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఢిల్లీ నుండి పిలుపువచ్చినట్లు తెలిసింది. 'అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు సాధ్యమైనంత త్వరగా ఢిల్లీకి రావాలి' అని ఈ ఆహ్వానసారాంశం. ఈ పిలుపు కేంద్ర ప్రభుత్వ నుండి వచ్చిందా, బిజెపి నాయకత్వం నుండి వచ్చిందా అన్న విషయమై స్పష్టత లేదు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా దీనిని అధికారికంగా ధృవీకరించలేదు. అయితే విశ్వసనీయ వర్గాల నుండి అందిన సమాచారం మేరకు శుక్రవారం ఉదయం ఢిల్లీ పెద్దలు కొందరు ముఖమంత్రితో మాట్లాడారు. ముఖాముఖీ చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనవచ్చుని, ఢిల్లీకి రావాలని కోరారు. అయితే, ఈ ఆహ్వానంపై ముఖ్యమంత్రి ఎలా స్పందించారన్నది తెలియరాలేదు. అయితే, కొందరు ముఖ్యనేతల వద్ద చంద్రబాబు ఈ విషయాన్ని ప్రస్తావించి వారి అభిప్రాయాలను మిగతా9లో

వాస్తవాలు మాట్లాడితే మీకే ఇబ్బంది

టిడిపికి బిజెపి హెచ్చరిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి నిజాలు చెప్పడం మొదలు పెడితే.. అధికార టిడిపికి ఇబ్బందులు తప్పవని బిజెపి అధికార ప్రతినిధి జివిఎల్ నరసింహారావు హెచ్చరించారు. ఏపికి కేంద్ర సాయంపై మరో 18 పేజీల నోట్ శుక్రవారం నాడిక్కడ విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏపికివ్వాల్సిన ఆర్థిక నిధులన్నింటినీ కేటాయించిందని, భవిష్యత్తులో కేటాయిస్తుందని అన్నారు. "ఏపి విభజన చట్టాన్ని తూచా తప్పకుండా కేంద్రం అమలు చేస్తోంది. విభజన చట్టం అమలులో కేంద్రం చిత్తశుద్ధితో ఉంది. ఏపి అభివద్ధి విషయంలో కేంద్రం కట్టుబడి ఉంది. 14వ ఆర్థిక సంఘం ఆదేశాలతో కేంద్రం ప్రత్యేక హోదా బదులు ఏపి అభివద్ధికి ఆర్థికంగా మద్దతు ఇచ్చింది. ఏపికి ప్రత్యేక హోదా సంజీవనేమీ కాదు. ప్రత్యేక హోదా ఇచ్చిన ఏ రాష్ట్రం అభివృద్ధి చెందలేదు. హోదా పేరుతో ప్రజలను మభ్య పెట్టొద్దు. హోదాను రాజకీయ అస్త్రంగా వాడుకుంటున్నారు. తమ పబ్బం గడుపుకోవడం కోసం రాజకీయ పార్టీలు హోదా అంశాన్ని లేవనెత్తుతున్నాయి. ప్రత్యేక ప్యాకేజీతో హోదాకు సమానంగా ఏపికి సహకారం అందుతుంది. ఏపి ప్రజలకు అబద్ధాలు చెప్పకండని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. రాష్ట్రంలోని టిడిపి, వైసిపిలను ప్రశ్నిస్తున్నాం. వెనుకబడిన జిల్లాలకు రాయితీలు కేంద్రం ఇస్తే మీరు మీ జిల్లాలకు పెట్టుబడులు ఏమి తెచ్చారు? రాష్ట్ర రాజకీయ పార్టీలు తాము చేసిన తప్పిదాలను కప్పి పుచ్చుకునేందుకు మిగతా9లో

పరీక్ష పై పరీక్షలు..!

- ప్రిపరేషన్‌కు లేని సమయం
- ఒత్తిడికి గురవుతున్న టెన్త్ విద్యార్థులు
- మార్చి 10 వరకు ప్రీ ఫైనల్
- మార్చి 15 నుంచి ఫైనల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



పదో తరగతి విద్యార్థులకు పరీక్షల భయం పట్టుకుంది. విద్యాశాఖ చేసిన తప్పిదాల వల్ల విద్యార్థులు బలవుతున్నారు. ఎస్‌సిఇఆర్‌టి క్యాలెండర్‌ను పక్కగా అమలు చేయడంలో విద్యా శాఖ విఫలమయింది. జనవరిలో నిర్వహించాల్సిన పరీక్షలను ఇప్పటికీ జరపకపోవడంతో విద్యార్థులు వెంట వెంటనే పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యా సంవత్సరం చివరి పరీక్షలకు 25 రోజులు మాత్రమే ఉన్నాయి. ఈ లోపే విద్యార్థులకు రెండు పరీక్షల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ పూనుకుంది. పరీక్షకు పరీక్షకు గ్యాప్ ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించాలనుకోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఒత్తిడికి గురవుతున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలలు పదో తరగతి విద్యార్థుల ప్రిపరేషన్‌కు కీలకం. విద్యార్థుల దృష్టంతా సిలబస్ రివిజన్ పైనే ఉంటుంది. వెనుకబడిన సబ్జెక్టులకు ప్రిపరేషన్ సెలవుల్లో ఎక్కువ సమయం కేటాయిస్తారు. ఈ వెసులుబాటు లేకుండా విద్యాశాఖ పరీక్షలు నిర్వహిస్తోంది. నవంబర్‌లో ఫార్మెటివ్-3 పరీక్షలను, డిసెంబర్‌లో సమ్మెటివ్-1 పరీక్షలను నిర్వహించింది. సమ్మెటివ్-1 తరువాత తరువాత విద్యాశాఖ ఏలాంటి పరీక్షలు నిర్వహించలేదు. జనవరిలో ఫార్మెటివ్-4 పరీక్షలను నిర్వహించాలి. ఫిబ్రవరి రెండో వారం వరకు ఈ పరీక్షలు నిర్వహించలేదు. మార్చి 15 నుంచి పదో తరగతి విద్యార్థులకు విద్యాసంవత్సరం చివరి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జనవరిలో నిర్వహించాల్సిన ఫార్మెటివ్-4 పరీక్షలను ఫిబ్రవరి నెలలో నిర్వహిస్తోంది. ఏ పాఠశాలలకు ఆ పాఠశాల నిర్వహించుకోవాలని ఈ నెల ప్రారంభంలో ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో మాత్రమే ముగిశాయి. కృష్ణా జిల్లాలో 90 శాతం ముగియగా, గుంటూరు జిల్లాల్లో 50 శాతం పూర్తయ్యాయి. మిగిలిన జిల్లాల్లో కూడా దాదాపు ఇదే పరిస్థితి. కొన్ని పాఠశాలల్లో ఇప్పటికీ ఆ పరీక్షలు జరుగుతుండగా, కొన్ని పాఠశాలలు ఇంకా నిర్వహించాల్సి ఉంది. ఈ నెల 24 నుంచి ప్రీఫైనల్ పరీక్షలుంటాయని పేర్కొంటూ పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. ముందుగా ఈ నెల 26 నుంచి ప్రీ ఫైనల్ ప్రారంభమవుతాయని షెడ్యూల్ విడుదల చేసి, వీటిని 24 నుంచి నిర్వహిస్తోంది. ఈ పరీక్షలు మార్చి 10న ముగుస్తాయి. మార్చి 15 నుంచి విద్యాసంవత్సరం చివరి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. చివరి పరీక్షలకు ప్రీ ఫైనల్ పరీక్షలకు మధ్య తేడా కేవలం నాలుగు రోజులు మాత్రమే వ్యవధి ఉంది. చివరి పరీక్షలకు 25 రోజులే సమయం ఉండగా, వీటిల్లో 19 రోజులు పరీక్షలు రాయడానికే సరిపోతుంది. ప్రీ ఫైనల్‌కు ఫైనల్ పరీక్షలకు కనీసం వారం రోజుల సమయం కూడా లేకుండా పోయింది. జనవరిలో ఫార్మెటివ్-4 పరీక్షలు నిర్వహించి, ఫిబ్రవరి మధ్యలో నుంచి ప్రీ ఫైనల్ నిర్వహిస్తే విద్యార్థులకు సమయం ఉండేదని ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం పరీక్షలు రాయాలో, ప్రిపరేషన్ అవ్వాలో తెలియక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

బిజెపిది పాత పాటే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి సాయంపై కేంద్ర ప్రభుత్వం, బిజెపి నాయకులు పాత పాటే పాడుతున్నారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు కుటుంబ రావు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి ఎంపి హరిబాబు పాత లెక్కలనే మరో సారి చదివి వినిపించారన్నారు. గతంలో 27 పేజీల డాక్యుమెంట్‌ను ప్రస్తుతం 17 పేజీలకు కుదించారన్నారు. ఆయన ప్రకటన స్క్రిప్ట్‌ను తలపించేదిగా ఉందన్నారు. ఇందులో ప్రత్యేక ప్యాకేజీ, ప్రత్యేక హోదా ప్రస్తావన లేదన్నారు. పేరు ఏదైనా రాష్ట్రానికి మేలు కలగాలన్నదే తమ లక్ష్యమన్నారు. సిఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం అనేక మార్లు కేంద్రాన్ని కలిశారన్నారు.

చెవిలో పువ్వు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించకుండా ప్రజల చెవిలో పువ్వులు పెట్టిందంటూ టిడిపి ఎంపి శివప్రసాద్ శుక్రవారం తిరుపతిలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు.



సహనం నశిస్తే యుద్ధం తప్పదు : ఎంపి శివప్రసాద్

టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన

ప్రజాశక్తి - తిరుపతి (క్యాంపస్)

తిరుపతి వెంకన్న సాక్షిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన హామీలతో పాటు అన్ని రకాలుగా ఆదుకుంటామని ఎన్నికల ముందు ప్రధాని నరేంద్రమోడీ హామీ ఇచ్చారని టిడిపి ఎంపి శివప్రసాద్ అన్నారు. తెలుగునాడు విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్వీయూ తారకరామ క్రీడా మైదానంలో చెవిలో పూలు పెట్టుకుని వినూత్నరీతిలో నిరసన తెలియజేశారు. రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ మోడీ చెవిలో పూలు పెట్టారన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా ప్రదాని ఇదే తారకరామ క్రీడా మైదానంలో ఇచ్చిన హామీని మరచిపోయారన్నారు. చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని చూడటం కేంద్రానికి తగదని సూచించారు. తిరుమల వెంకన్న ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేవుడని, ఆయన సాక్షిగా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేయాలని చూస్తే కష్టాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జాతీయ సమన్వయకర్త ఎ.రవినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి దళవాయి లోకనాథం తదితరుల పాల్గొన్నారు.



అరేబియాలో అల్పపీడన ద్రోణి

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

ఆగ్నేయ అరేబియా సముద్రం నుంచి దక్షిణ మహారాష్ట్ర తీరానికి ఆనుకుని ఉన్న తూర్పు మధ్య సముద్రం వరకు అల్పపీడన ద్రోణి ఏర్పడినట్లు భారత వాతావరణ శాఖ శుక్రవారం ప్రకటించింది. దక్షిణ కర్నాటక, దాని పరిసరాల్లో 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం నెలకొన్నట్లు తెలిపింది. రాయల సీమలో పగటి ఉష్ణోగ్రతలు 32 నుంచి 33 డిగ్రీలు, ఒంగోలు, జంగమహేశ్వరంలో 34 డిగ్రీల చొప్పున నమోద వుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో 31 నుంచి 32 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. కోస్తాలో రాత్రిపూట 16 నుంచి 21, సీమలోనూ అదే స్థాయిలో ఉంటున్నాయి. కోస్తా, సీమల్లో మూడు రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

కాలం చెల్లిన చట్టాలను రద్దు చేద్దాం..

పాత పద్ధతులకు స్వస్తి చెప్పండి..

బడ్జెట్ సన్నాహక సమావేశంలో సిఎం చంద్రబాబు సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాత ముతక పద్ధతులు కాకుండా కొత్త విధానాలతోనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని లక్ష్యాలకు తగినట్లు పని చేయాలని సూచించారు. సచివాలయంలో శాఖాధిపతులు, మంత్రులతో ఆయన బడ్జెట్ సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కాలం చెల్లిన చట్టాలను రద్దు చేసి, కాలానుగుణంగా కొత్త విధానాలు రూపొందించాలని ఈ సందర్భంగా సిఎం అధికారులకు సూచించారు. అవసరాల మేరకు ఆయా శాఖలు నిధులపై అంచనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. తమ శాఖల అభివృద్ధిపై స్వీయ విశ్లేషణ చేసుకోవాలన్నారు. కొన్ని ప్రభుత్వ శాఖలలో సంస్కరణలు తీసుకొస్తున్నా ఆశించిన పురోగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్, వ్యవసాయం, జలవనరుల శాఖలలో తీసుకున్న నిర్ణయాలు సానుకూల ఫలితాలిచ్చా యన్నారు. సిఐఐ భాగస్వామ్య సదస్సులో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ప్రత్యేకంగా ఒక సెషన్ నిర్వహించి కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. విభజన హామీలపై కేంద్రం నుంచి సహాయం అందడంలేదన్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వనరులున్నా సరైన దృక్పథం, సమగ్ర దృష్టి లేకపోవడం వల్ల వెనుక బడ్డాయని చెప్పారు. ఆ జిల్లాల్లో అత్యుత్తమ విధానాలు అనుసరిస్తూ అభివృద్ధిలో ముందు వరుసలో నిలపవచ్చన్నారు. మార్చి 5న బడ్జెట్ సమావేశాలు ప్రారంభం రోజు గవర్నర్ ప్రసంగం, 8న వార్షిక బడ్జెట్ ప్రవేశపెడుతున్నామని సిఎం తెలిపారు.

ఉడా ఆస్తులను పెంచాలి : సిఎం

అభివృద్ధి పనులు చేపట్టి ఆస్తులను పెంచాలని ముఖ్యమంత్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఉడా) చైర్మన్లకు సూచించారు. శుక్రవారం సచివాలయంలో అథారిటీ చైర్మన్లు శుక్రవారం సచివాలయంలో సిఎంతో సమావేశమయ్యారు. ప్రతి అథారిటీ ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేయాలన్నారు. అందుకు నెల రోజుల్లోగా సమగ్ర కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేసుకురావాలని సిఎం అథారిటీ చైర్మన్లను ఆదేశించారు. ఇటీవల నవీ ముంబై, అహ్మదాబాద్, హర్యానా, గ్రేటర్ నోయిడా, జైపూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలలో జరిపిన స్టడీ టూర్ వివరాలను చైర్మన్లు ముఖ్యమంత్రికి వివరించారు.



చివరి త్రైమాసికంలోనే అదనపు బడ్జెట్ : యనమల

ఆయా శాఖలకు అదనపు బడ్జెట్ కావాలంటే చివరి త్రైమాసికంలోనే ఇస్తామని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అధికారులకు స్పష్టం చేశారు. ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో అదనపు బడ్జెట్ అడగవద్దని ముఖ్యమైన ప్రాజెక్టు లేమైనా ఉంటే బడ్జెట్‌లోనే పెట్టుకోవాలన్నారు. శుక్రవారం సచివాలయంలో వివిధ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలను ఆయన సమీక్షించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో స్థిరాస్తి ఖర్చులు పెంచుతామని చెప్పారు. కేటాయించిన నిధులన్నీ ఖర్చు చేసిన తర్వాతే అదనపు నిధులు అడగాలని యనమల అధికారులకు సూచించారు. ఆయా శాఖలకు కేటాయించిన నిధులను అవసరాన్ని బట్టి ఇతర పథకాలు, ప్రాజెక్టులకు వినియోగించుకునే వెసులుబాటు ఇచ్చామన్నారు. పెరుగుతున్న జనాభాకు పాత పథకాలు సరిపోవని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్త పథకాలను చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే పథకాలకు ఎంత ఖర్చయినా నిధులు విడుదల చేస్తామన్నారు. గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. వైద్యుల పోస్టులను త్వరగా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆశాఖ అధికారులకు సూచించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, జల వనరులు, ఐటి శాఖల పురోగతి, బడ్జెట్ ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం వద్దు : మంత్రి కాలవ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు జాప్యం లేకుండా వెంటనే బిల్లులు చెల్లించాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులతో ఫోటోలు తీసి జియో ట్యాగింగ్ చేసి, ఆన్‌లైన్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్లతో సచివాలయంలో శుక్రవారం మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే జూన్‌కు 5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. వ్యవసాయ పనులు పూర్తవడంతో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. 2016-17లో మంజూరు చేసి ఇళ్లను ఏప్రిల్, 2017-18లో మంజూరు చేసిన ఇళ్లను జూన్‌లోగా పూర్తి చేయాలన్నారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకానికి ముందు నిర్మాణం చేపట్టిన ఇళ్లన్నింటినీ నాలుగు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పరిష్కార వేదిక, జన్మభూమి కార్యక్రమాల్లో సుమారు 25 లక్షల దరఖాస్తులు వచ్చాయని సర్వే నిర్వహించి అర్హులను గుర్తించాలన్నారు.

కేంద్ర నిధులపై శ్వేతపత్రమిచ్చే ఆలోచన

మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


ఇప్పటి వరకూ రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిని నిధులపై శ్వేతపత్రమిచ్చే ఆలోచన ప్రభుత్వానికి ఉందని విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రమిచ్చిన నిధులపై బిజెపి నేతలతో ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్నికల ముందు తిరుపతిలో నిర్వహించిన బహిరంగ సభలో సిఎంతో కలిసి పాల్గొన్న ప్రధాని మోడీ ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీకి ప్రధాని కట్టుబడి ఉండాలని కోరారు. ఏడు జాతీయ విశ్వ విద్యాలయాలకు గాను ఐదు మాత్రమే ఇప్పటికి ప్రారంభ మయ్యాయని, వాటి తరగతులు కూడా సొంత భవనాల్లో జరగడం లేదని, కర్నూలు ఐఐఐటి తరగతులు తమిళ నాడులోని కాంచీపురంలో నిర్వహిస్తున్నామని అన్నారు. గిరిజన విశ్వవిద్యాలయం, సెంట్రల్ యూనివర్సిటీకి ఇంత వరకూ కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలపలేదన్నారు. ఏడు సంస్థలకు కేంద్రం 2015-16లో రూ.103 కోట్లు, 2016-17లో రూ.158 కోట్లు, 2017-18లో రూ.260 కోట్లు, 2018-19లో రూ.245 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఈ విద్యా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల విలువ చేసే 2,401 ఎకరాలు కేటాయించిందని, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.72 కోట్ల వరకూ వెచ్చించిందని తెలిపారు.

ఎపికి ఎయిర్‌పోర్టు, దూరదర్శన్, పాస్‌పోర్టు కేంద్రాలు ఇచ్చామని బిజెపి నేతలు చెబుతున్నారని, ఏ రాష్ట్రానికయినా దూరదర్శన్, పాస్‌పోర్ట్ కార్యాలయాలు మంజూరు చేయడం సాధారణ విషయమేనన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్న మిత్రపక్షంగా గుర్తించి సాయం చేయాలని కోరారు. తామేమీ అదనంగా కోరడం లేదని, పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు.

పర్యాటక ప్రాజెక్టుల్లో స్థానికులకు ఉద్యోగాలివ్వాలి

'వారసత్వ' బోర్డు సమావేశంలో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఎక్కడ పర్యాటక ప్రాజెక్టులు ఏర్పాటయినా స్థానికులకు ఉద్యోగావకాశాల కల్పనలో ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎపి పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ బోర్డు సంచాలకులు, మంత్రి అఖిలప్రియతో కలిసి సచివాలయంలో శుక్రవారం రాత్రి ఆయన సమావేశం నిర్వహించారు. భారత చరిత్ర, సంస్కృతిని అధ్యయనం చేసి స్థానిక అంశాలను ఇతివృత్తాలుగా తీసుకుని భవానీ ద్వీపాన్ని అభివృద్ధి చేయాలని సిఎం తెలిపారు. పర్యాటక ప్రదేశాలను మరింత ఆకర్షణీయంగా విభిన్న పర్యాటక హంగులను ఏర్పాటు చేయాలన్నారు. మధురవాడ కొండలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దా లని, వచ్చే ఐదేళ్లలో విశాఖ అభివృద్ధికి తగినట్లుగా 25వేల హోటల్ గదులు కావాలని, ప్రస్తుతం 2500 కూడా లేవని సిఎం పేర్కొన్నారు.

వివిధ ప్రాజెక్టుకు ఆమోదం

మధురవాడలో రూ.200 కోట్ల పెట్టుబడితో 250 గదులతో రాడిసన్ హోటల్, రిసార్ట్ ఏర్పాటుకు బోర్డు సమావేశం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మూడు దశల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించింది. రూ.105 కోట్ల పెట్టుబడితో 225 గదులను అందుబాటులోకి తెచ్చేలా తొట్లకొండలో ఫైవ్ స్టార్ హోటల్, రిసార్ట్ నిర్మాణానికి వైశాలి హైడ్రో ప్రాజెక్ట్‌కు అనుమతిస్తూ బోర్డు నిర్ణయించింది. విశాఖలో టియూ మ్యూజియం తరహాలో రూ.20 కోట్లతో సబ్ మెరైన్ మ్యూజియం ఏర్పాటు చేయడానికి సిద్ధమని నేవీ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నేవీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఈ మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు వివరిం చారు. సమావేశంలో పర్యాటక శాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ఎపిటిడిసి ఎండి హిమాన్షు శుక్లా, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నిజాలు చెప్పడం లేదు

మొదటి పేజీ తరువాయి

ధోరణి వస్తుందని, దీని వల్ల వేర్పాటువాద ఉద్యమాలు ఊపిరిపోసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విభజన హామీల అమలు, నిధుల విడుదలపై వాస్తవాలను ప్రజలకు వెల్లడించేందుకు జెఎఫ్‌సిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కేంద్రం స్పందించాలి : మధు

విభజన హామీల అమలుపై మార్చి 5లోగా స్పష్టమైన హామీ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. చేయని నేరానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు శిక్షకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, విభజన హామీలు, హోదాపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చామని చెబుతున్న నిధులకు, రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు పొంతన లేకుండా పోయిందన్నారు.

జెఎఫ్‌సితో నిదులపై స్పష్టత : రామకృష్ణ

విభజన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ముందుకు వెళుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. విభజన హామీలతో పాటు పార్లమెంటులో ప్రధాని చేసిన ప్రకటనలను అమలు చేయడం లేదన్నారు. జెఎఫ్‌సి చేపట్టిన చర్చలు ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడతాయన్నారు. నిధుల విడుదల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అబద్ధాలు చెబుతున్నాయని, జెఎఫ్‌సి ద్వారా స్పష్టత వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా హక్కులు కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని జయప్రకాశ్ నారాయణ పిలుపునిచ్చారు. చట్ట ప్రకారం రావాల్సిన నిధుల కోసం రాజ్యాంగబద్దంగానే పోరాటం చేద్దామన్నారు. ప్రధాని హామీకి చట్టబద్ధత లేకుంటే ప్రజాస్వామ్యంపై నమ్మకం పోతుందన్నారు. విభజన హామీల అమలు, ప్రధాని మాటకు విలువ...అనే రెండు అంశాల ప్రాతిపదికగా తమ కమిటీ పని చేస్తుందన్నారు. అన్ని వివరాలు సేకరించడానికి ముగ్గురు సభ్యులతో ప్రత్యేకంగా సబ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పష్టమైన సమాచారాన్ని సేకరించి జెఎఫ్‌సికి అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో న్యాయమూర్తి గోపాల గౌడ, మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు, కేంద్ర హోంశాఖ మాజీ సెక్రటరీ, సలహాదారు పద్మనాభయ్య, మహారాష్ట్ర కేడర్ మాజీ ఐఎఎస్ అధికారి చంద్రశేఖర్, తెలంగాణ నుంచి మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, ప్రముఖ న్యాయవాది ప్రమోద్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

45 రోజుల్లో 13 లక్షల పనిదినాలు

అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి 45 రోజుల్లో కూలీలకు 13 లక్షల పని దినాలు కల్పించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది లక్ష్యం 24 కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యం నిర్దేశించగా 18.40 కోట్ల పనిదినాలు మాత్రమే కల్పించినట్లు తెలిపారు. ఆ శాఖ అధికారులతో ఉపాధి, భూగర్భ మురుగు కాల్వలు, ఎల్ఈడి వీధి దీపాలు, గ్రామీణ నీటి సరఫరా అంశాలపై సమీక్షా సమావేశాన్ని సచివాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీల సగటు వేతనం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు పనితీరు మెగురు పరుచుకోవాల్సి ఉందన్నారు. నిలిచిపోయిన ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాన్ని వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. మరో వారంలో వేతన, మెరీటియల్ బకాయిలు విడుదల చేస్తామని కేంద్ర మంత్రి తెలిపినట్లు చెప్పారు. పంట కుంటలు, వర్మి కంపోస్టు కేంద్రాల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు. భూగర్భ మురుగు కాల్వల నిర్మాణం పనులు అన్ని గ్రామాల్లో ప్రారంభించాలన్నారు.

ప్రత్యేకం

పశువులకు వసతి గృహాలు

మూడు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు

దేశీయ దూడల ఉత్పత్తే ధ్యేయం

రూ.19.83 కోట్లతో పథకం అమలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం కొత్త పథకాన్ని చేపట్టనుంది. ఇందులో భాగంగా పశువులకు వసతి గృహాలు కల్పించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వాతావరణ మార్పుల కోసం జాతీయ అనువర్తిత నిధి (ఎన్ఎఎఫ్‌సిసి-నేషనల్ అడాప్షన్ ఫండ్ ఫర్ క్లైమేట్ ఛేంజ్) ప్రాజెక్టును వచ్చే ఏప్రిల్ నుంచి ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎంపిక చేసిన మూడు జిల్లాల నుంచి ఆరు మండలాల్లోని ఆరు గ్రామాల్లో ఈ పథకం తొలుత ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. ఒక్కో వసతి గృహంలో 200 పశువులకు వసతి కల్పించనున్నారు. గుజరాత్, కర్నాటకలో ఈ తరహాలో గేదెలు, ఆవులకు ప్రత్యేకంగా హాస్టల్స్‌ను నిర్వహిస్తున్నారు. వాతావారణంలో మార్పుల ఫలితంగా పాల దిగుబడి తగ్గటం, గడ్డి కొరత, పశువుల్లో వ్యాధులు తలెత్తి మృత్యువాత పడుతున్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన వాతావరణం ఉండటంతో ఈ పరిస్థితులు తలెత్తుతున్నట్లు పశుసంవర్ధశాఖ గుర్తించింది.



ఎన్ఎఎఫ్‌సిసి నిధులు

ఆ పథకం అమలుకు ఎన్ఎఎఫ్‌సిసి కింద రూ.19.83 కోట్లను కేటాయించారు. నాబార్డు రూ.12.71 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2.97 కోట్లు సమకూరుస్తుండగా రైతులు రూ.4.15 కోట్లను తమ వాటాగా భరించాల్సి ఉంటుంది. తొలి దశలో ఈ ప్రాజెక్టును ఉత్తరాంధ్రలో విజయనగరం, రాయలసీమలోని అనంతపురం, కోస్తాలో నెల్లూరు జిల్లాల్లో చేపట్టనున్నారు. మూడు ప్రాంతాల్లోనూ భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉన్నందున ఆయా ప్రాంతాలకు తగ్గట్టుగా ప్రణాళికలను రూపొందించారు. పశుసంపదను కనీసం ఐదు శాతం మేర వృద్ధి చేయాలనేది లక్ష్యం. పశువులను ఒకే చోట ఉంచి వాటికి అవసరమైన గడ్డి, దాణాను సరఫరా చేస్తారు. వాతావారణ మార్పులకు అనుగుణంగా పశువుల యాజమాన్య విధానాలపై రైతులలో నైపుణ్యాభివృద్ధి మెరుగుపరుస్తారు. ఆయా గ్రామాల్లో 25 మంది నిరుద్యోగులకు ఇందులో ఉపాధి కల్పిస్తారు. పశువుల కోసం ప్రత్యేకంగా గడ్డి క్షేత్రాల నిర్వహణ సహా సోలార్ ఆధారిత పంపు సెట్లు ఏర్పాటు చేస్తారు. పశువ్యర్థాలతో బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, అక్కడే శీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి పాలను చిల్లింగ్ చేస్తారు. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం గొట్లూరు, పామిడి మండలం అనుంపల్లి, నెల్లూరు జిల్లా అల్లూరు మండలం అల్లూరును గుర్తించగా, మరో మండలంలో గ్రామాన్ని ఇంకా గుర్తించాల్సి ఉంది. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పెరిపి, బాడంగి మండలం వీరసాగరం గ్రామాల్లో వాతావారణ మార్పులకు అనుగుణంగా పథకాన్ని అమలు చేయనున్నారు. ఆయా గ్రామాల్లో సుమారు ఐదు వేల మంది రైతుల పశువులకు పథకాన్ని వర్తింప చేస్తారు. దేశీయ ఆవు పాలను సరఫరా చేయటంతోపాటు దేశీయ దూడల ఉత్పత్తికి చర్యలు చేపట్టనున్నారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేసేందుకు పశు వైద్యులు కూడా అందుబాటులో ఉంటారు.

కడుపు మండిన కంది రైతులు

గిట్టుబాటు ధర కల్పించాలని రాస్తారోకో

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను పెట్టి క్వింటా రూ.5450 చొప్పున కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ముఖం చాటేసింది. దీంతో కడుపు మండిన కంది రైతులు ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం రోడ్డెక్కారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలోని సుందరయ్య సర్కిల్‌లో రాస్తారోకో చేశారు. కందికి ప్రభుత్వం కనీస మద్దతు ధరను నిర్ణయించడంతో శుక్రవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు పెద్ద సంఖ్యలో కంది రైతులు తమ ఉత్పత్తులను తెచ్చారు. మార్క్‌ఫెడ్ అధికారులు తాము 11 వేల క్వింటాళ్లు మాత్రమే అధికారికంగా కొనుగోలు చేస్తామని, మా కోటా అయిపోయిందని చేతులెత్తేశారు. మార్కెట్‌కు ఉత్పత్తులను తెచ్చాక కొనుగోలు చేయకపోవడాన్ని నిరసిస్తూ రైతులు ఆగ్రహించారు. తమకు మద్దతు ధర వచ్చేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం చొరవ తీసుకోని రైతులకు న్యాయం చేయాలని దాదాపు వెయ్యి మంది రైతులతో సుందరయ్య సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి, జిల్లా నాయకులు రంగారెడ్డి, సోమన్న, వెంకటేశ్వర్లు రైతుల ఆందోళనకు మద్దతు తెలిపారు. రైతులు రోడ్డుపై బైఠాయించడంతో దాదాపుగా రెండు గంటల పాటు కొత్తబస్టాండ్ వద్ద రవాణా స్తంభించిపోయింది. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం నాయకులు పెద్దిరెడ్డి, వెంకటేశ్వర్లు, సోమన్న, రంగారెడ్డి మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన కందికి ప్రభుత్వమే కొనాలన్నారు.

అధికంగా పండించారు కొనుగోలు చేయమంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను స్తంభింపచేస్తామన్నారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రైతుల నుంచి మరింత కొనుగోలు చేసేందుకు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఇప్పటిదాకా మాకు 11 వేల టన్నులు మాత్రమే కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చారన్నారు. పంట దిగుబడులు ఎక్కువ ఉండడంతో ఇంకో 20 వేల టన్నులకు అవకాశం కల్పించాలని కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. దీనికి నాలుగు రోజులు గడువు ఇవ్వాలని రైతులకు విన్నవించడంతో వారు నిరసనలను విరమించుకున్నారు.



కర్నూలు కొత్తబస్టాండు రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

అలిపిరి వద్ద తుపాకీ కలకలం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

అలిపిరి చెక్‌పోస్టు వద్ద లైసెన్స్ లేని తుపాకీతో ఓ వ్యక్తి పట్టుబడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. టిటిడి ఏవిఎస్‌వో గంగరాజు కథనం మేరకు... భువనేశ్వర్‌కు చెందిన రమన్‌సంగ్రేయ్ శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తిరుమలకు వెళ్లేందుకు కారులో అలిపిరి చెక్‌పోస్టు వద్దకు చేరుకున్నారు. చెక్‌పోస్టు వద్ద సాధారణ తనిఖీల్లో భాగంగా కారును తనిఖీ చేశారు. తనిఖీల్లో కారు స్టీరింగ్ కింద 7.65 ఎంఎం పిస్తల్, రెండు రౌండ్ల బుల్లెట్లు లభ్యమయ్యాయి. విజిలెన్స్ తనిఖీలో అతని వద్ద తుపాకీ ఉండడంతో అతనిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ తుపాకీకి లైసెన్స్ లేకపోవడంతో దాన్ని సీజ్ చేశారని, విజిలెన్స్ విచారణలో అతనిపై ఒడిస్సా రాష్ట్రంలో పలు కేసులు ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు అతనిని అదుపులోకి తీసుకుని విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు.



నిలదీత

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పోర్టు నిర్మాణంపై అధికారులను నిలదీస్తున్న భావనపాడు సర్పంచ్ గురువులు

భావనపాడు పోర్టు నిర్మాణం ఆగదు

ఊరు వదలిపోతేనే ప్యాకేజీ - మత్స్యకారులను బెదిరించిన అధికారులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా)

'ఎవరు కాదన్నా భావనపాడు పోర్టు నిర్మాణం ఆగదు. ఊరుని వదలిపోతేనే ప్యాకేజీ వస్తుంది. పోర్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తే నష్టపోతారు' అంటూ కాకినాడ పోర్టు డైరెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ మత్స్యకారులను హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడులో పోర్టు నిర్మాణంపై మత్స్యకారులు, గ్రామస్తులతో రెవెన్యూ అధికారులు శుక్రవారం ఆ గ్రామంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోనే ఉంటామంటే ప్యాకేజీ రాదని, పోర్టు పనులతో గ్రామం మూడు వైపులా మూసుకుపోతుందన్నారు. బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయని హెచ్చరించారు. పోర్టుకు సంబంధించిన పాత నోటిఫికేషన్ రద్దు అయ్యిందని, 2,100 ఎకరాల భూమికి కొత్త నోటిఫికేషన్ జారీ అవుతుందని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం అమల్లోకి రావడంతో 'మీరు వేసిన కేసులు వీగిపోతాయి' అని పేర్కొన్నారు.

విషమిచ్చి చంపేయండి : మత్స్యకారుని ఆవేదన

ఈ సమావేశంలో మత్స్యకారుడు అడ్ల రాజేష్ మాట్లాడుతూ తమకు చేపల వేటే జీవనాధారమన్నారు. తమను ఊరు విడిచివెళ్లమని చెప్పే బదులు విషమిచ్చి చంపేయండి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌డిఒ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆశించిన స్థాయిలో ప్యాకేజీ ఇస్తామన్నారు.

మన్యంలో రహ'దారు(ణా)లు'

కాలినడకకూ అనువుగా లేని దుస్థితి
ఆందోళనలో గిరిజనం



అస్తవ్యస్తంగా ఉన్న కురుపాం మండలంలోని నాగరిగూడ రహదారి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా పార్వతీపురం ఏజెన్సీలో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఏజెన్సీ గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఆచరణలో ముందుకు సాగడం లేదు. రోడ్ల సదుపాయం లేక కిలోమీటర్ల మేర నడవలేక అత్యవసర పరిస్థితుల్లో వైద్యమందక గిరిజనులు మృత్యువాత పడిన సందర్భాలూ ఉన్నాయి. జిల్లాలో 2,35,556 మంది గిరిజనులు జీవిస్తున్నారు. వీరిలో పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 1,87,829 మంది నివసిస్తున్నారు. వందలాది గిరిజన గ్రామాలకు రహదారులు లేవు. ద్విచక్ర వాహనం సైతం వెళ్లేందుకు అనువుగా లేనివిధంగా కొన్ని రోడ్లు ఉన్నాయి. కాలినడకన సైతం వెళ్లలేని అధ్వానస్థితితో కొన్ని గ్రామాల్లో గిరిజనులు అవస్థలు పడుతున్నారు.

కురుపాం మండలం మరిపల్లి పంచాయతీ నాగరిగూడలో 350 జనాభా నివసిస్తోంది. ఆ గ్రామస్తులు అనారోగ్యానికి గురైతే ఐదు కిలోమీటర్ల దూరంలోని మొండెంకెళ్లు పిహెచ్‌సికి కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. అంబులెన్సు వెళ్లేందుకు రోడ్లు అనువుగా లేకపోవడంతో అత్యవసర పరిస్థితిల్లో రోగులకు డోలీ మోతే దిక్కవుతోంది. ఇదే పంచాయతీలో వంతగూడ, ఇప్పమానుగూడ, నిమ్మమానుగూడతోపాటు మండలంలో చాపరాయిగుడ, గుమ్మడిగుడ, బరుసింగుతోపాటు మరో 15 గ్రామాలకు సరైన రహదారులు లేవు. గుమ్మలక్ష్మీపురం మండలం గోయపాకలో 150 గిరిజన కుటుంబాలున్నాయి. వీరికి దుడ్డుకల్లు పిహెచ్‌సి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి చెందిన బిడ్డిక దుక్కు కుమారుడు రాజు అనారోగ్యానికి గురయ్యాడు. వైద్యం కోసం డోలీపై ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో చనిపోయారు. ఇది జరిగి రెండేళ్లవుతున్నా రోడ్ల పరిస్థితిలో ఏ మాత్రమూ మార్పు లేదు. గర్భిణులు, వృద్ధులు ఆస్పత్రికి వెళ్లడానికి నేటికీ డోలీ మోతే శరణ్యంగా ఉంది. శిఖబాయి, దేరుకొండ, ఓండ్రు బంగి గ్రామాలతోపాటు మరో 22 గ్రామాలకు ఏళ్లుగా రహదారులు లేకపోవడంతో ఆయా గ్రామాల గిరిజనులకు తీవ్ర అవస్థలు తప్పడం లేదు. ఏజెన్సీలో జియ్యమ్మ వలస, సాలూరు, పాచిపెంట, పార్వతీపురం, కొమరాడ మండలాల్లో రహదారులు నిర్మించాలని గిరిజనులు అనేకమార్లు వినతులు ఇచ్చినా పాలకుల్లో స్పందన లేదు.

నరకయాతన అనుభవిస్తున్నాం

గ్రామానికి రోడ్డు లేకపోవడంతో రోగులను ఆస్పత్రికి డోలీ ల్లోనే మోసుకెళ్తున్నాం. గర్భిణుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఐటిడిఎ అధికారు లకు ఎన్నో దఫాలు మొరపెట్టుకున్నా రోడ్లు నిర్మించ లేదు. రోడ్లు మంజూరైనా పనులు జరగడం లేదు.

- ఆరికి సుక్కు, సర్పంచ్, మరిపల్లి పంచాయతీ కురుపాం మండలం

రోడ్ల నిర్మాణానికి కృషి

గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించేందుకు కృషి చేస్తున్నాం. ఉపాధి నిధులతో ఇప్పటికే కొన్ని రోడ్లు నిర్మిస్తున్నాం. తాజాగా మంజూరైన పంచాయతీరాజ్ నిధులు రూ.150 కోట్లతో 318 కిలోమీటర్ల మేర రోడ్లు వేస్తాం. మక్కువ మండలంలో ఆరు రోడ్లు, పార్వతీపురం మండలంలో తొమ్మిది, గుమ్మలక్ష్మీపురంలో రెండు, కొమరాడలో ఒకటి, కురుపాంలో ఒకటి చొప్పున నిర్మిస్తాం.

-లక్ష్మీ, పార్వతీపురం ఐటిడిఎ పిఒ

నత్తనడకన నిర్మాణాలు

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 450 రహదారుల పనులకు రూ.219 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 772 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం జరగాల్సి ఉంది. కానీ 124 రహదారులకు అటవీ శాఖ అభ్యంతరాలు పెట్టింది. రహదారులకు ప్రతిపాదించిన భూములు రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉన్నాయని కొర్రీ వేసింది. అనుమతులున్న చోట కూడా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ఆగని ఆక్వా తవ్వకాలు

అమలు కాని కలెక్టర్ ఆదేశాలు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా అమలాపురం రూరల్ మండలంలో ఆక్వా తవ్వకాలు చేయవద్దని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా ఆయన ఆర్డరును పక్కన పెట్టి యథేచ్ఛగా తవ్వుతున్నారు. అయినా మత్స్య రెవెన్యూశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ ధర్మారావు ఇటీవల రొయ్యల చెరువుల తవ్వకాలపై హైకోర్టుకు ఫిర్యాదు చేశారు. దీన్ని ప్రభుత్వం రిట్‌గా పరిగణించింది. తూర్పుగోదావరితోపాటు నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఫిషరీష్, రెవెన్యూ అధికారులను ప్రతివాదులుగా చేర్చి విచారణ ప్రారంభించారు. నాలుగు నెలల గడువుతో వాయిదా వేశారు. ఇన్ని జరుగుతున్నా అటు కోనసీమలోనూ, ఇటు సెంట్రల్ డెల్టా ప్రాంతంలోనూ ఎటువంటి అనుమతులు లేకుండానే రొయ్యల చెరువుల తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పచ్చని పొలాలను రొయ్యల చెరువులుగా మార్చేసి వరి సాగు లేకుండా చేస్తున్నారు.



కోనసీమలో తవ్వుతున్న చెరువులను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగవుతున్నాయి. వీటిలో 40 వేల ఎకరాల వరకూ ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికంగా సాగు చేస్తున్నారు. కోనసీమలోని అమలాపురం రూరల్, కాట్రేనికోన, ముమ్మిడివరం, అల్లవరం, అయినవిల్లి మండలాల్లో యథేచ్ఛగా రొయ్యల చెరువులు తవ్వుతున్నారు. ఈ మండలాల్లో చేపల చెరువులకు దరఖాస్తు పెట్టుకుని అధికారుల నుంచి అనుమతులు రాకుండానే రాజకీయ నాయకుల అండతో తవ్వకాలు చేపడుతున్నారు. దీనికితోడు ముడుపులు కూడా అందడంతో అధికారులు అటువైపు చూడడానికి కూడా ఇష్టపడటం లేదు. అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడిలో దేవాదాయశాఖ పరిధిలోని మంత్రి ప్రగడ వారి సత్రంకు చెందిన సుమారు ఏడు ఎకరాలను ఆక్వా చెరువుల కోసం తవ్వేస్తున్నారు.

రాజకీయ నాయకులే ప్రోత్సహించడంతో అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ మండలంలో ఆక్వా చెరువులుసహా ఎటువంటి తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దని కలెక్టర్ ఆదేశించినా బేఖాతరు చేస్తున్నారు. యు.కొత్తపల్లి మండలంలో సుమారు 20 ఎకరాల్లో కాకినాడకు చెందిన ఓ రాజకీయ నాయకుడు ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే తవ్వకాలు చేపట్టారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండతో తవ్వకాలు చేస్తున్నారు. జిల్లాలోని సెంట్రల్ డెల్టా కరప, పెదపూడి, తాళ్లరేవు, సామర్లకోట మండలాల్లో సైతం ఆక్వా తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. దీంతో చుట్టుపక్కల వరిసాగు నాశనమౌతున్నా పట్టించుకోవడం లేదు. కరప మండలంలోని జి.భావవరం గ్రామంలో అక్రమంగా ఆక్వా సాగుకు కొందరు సిద్ధమయ్యారు. యంత్రాలను పొలాల్లోకి తరలించి తవ్వకాలు చేపడుతుండగా, స్థానిక రైతులు, వామపక్ష నాయకులు ఆందోళన చేసి, తవ్వకాలను నిలుపు చేశారు. తాజాగా ఆ భూముల్లోనూ తవ్వకాలు చేపట్టారు. ఇలా జిల్లావ్యాప్తంగా ఆక్వా తవ్వకాలు చేస్తున్నా మత్స్య, రెవెన్యూశాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

సమాజ అభ్యున్నతికి బాలల పెంపకం

- సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాస్
- 'అమరావతి బాలోత్సవం' సావనీర్ ఆవిష్కరణ



'అమరావతి బాలోత్సవం' సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న జి.శ్రీనివాస్, తదితరులు

ప్రజాశక్తి-సత్యనారాయణపురం(విజయవాడ)

సమాజ అభ్యున్నతికి బాలల పెంపకం, నేటి విద్యా విధానంపైనా, పిల్లల ఆలోచనల్లోనూ పలు మార్పులు తీసుకురావాల్సిన అవసరముందని సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. అమరావతి బాలోత్సవ కమిటీ రూపొందించిన సావనీర్‌ను విజయవాడలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు సంబంధించిన అనేక అంశాలను పొందుపర్చి పుస్తక రూపంలో తీసుకొచ్చిన అమరావతి బాలోత్సవం కమిటీకి అభినందనలు తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలల్లో ప్రతిభ, సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా ధృక్పథం, ప్రశ్నించేతత్వం వంటి అనే విషయాలను వ్యక్తీకరించేందుకు బాలోత్సవం వేదికగా ఉందన్నారు. ప్రతి పాఠశాల గ్రంథాలయంలోనూ ఈ సావనీర్ ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన అమరావతి బాలోత్సవ కమిటీ అధ్యక్షులు ఎస్.పి.రామరాజు మాట్లాడుతూ పిల్లల పండుగలో పొందిన ఆనందాన్ని శాశ్వతంగా గుర్తుంచుకోవటానికి సావనీర్‌ను తయారు చేసినట్లు తెలిపారు. గౌరవాధ్యక్షుడు చలువాది మల్లికార్జునరావు మాట్లాడుతూ అమరావతి బాలోత్సవం విజయవాడ నగరానికి ఒక గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం సావనీర్ సంపాదకులు సి.వి.కృష్ణయ్య, బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, కాకినాడ క్రియ పిల్లల పండుగ కార్యదర్శి ఎస్ఎస్ఆర్.జగన్నాధరావు మాట్లాడారు. అంతకుముందు సావనీర్ కమిటీ కన్వీనర్ కె.శశికుమార్ సభకు విచ్చేసిన అతిథులకు స్వాగతం పలికారు. అమరావతి బాలోత్సవం కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ట్యూషన్ పాయింట్‌ల బాధ్యులు నరసింహారావు, తరుణీతరంగాలు కమిటీ అధ్యక్షురాలు రావి శారద, సభ్యులు గుళ్లపల్లి జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

కిలో చింతపండు రూ.18

గతేడాది ధరనే ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
ఏ మాత్రమూ గిట్టుబాటు కాదంటున్న గిరిజనులు



అమ్మకానికి ఉంచిన చింతపండు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

చింతపండుకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు మద్దతు ధర ప్రకటించింది. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఒక కిలోకు రూ.18లే ఇవ్వాలని నిర్ణయించింది. ఈ ధర ఏ మాత్రమూ గిట్టుబాటు కాదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో జనవరి నుంచే చింతపండు సీజన్ ప్రారంభమైంది. ఈ ఏడాది ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల వరకూ చింతపండు ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేశారు. గిరిజన ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ప్రయివేటు వ్యాపారుల దోపిడీని అరికట్టే ఉద్దేశంతో ప్రభుత్వం గిరిజన సహకార సంస్థను (జిసిసిని) ఏర్పాటు చేసింది. గిరిజన ఉత్పత్తుల ధరను నిర్ణయించే అధికారం జిసిసికి ఇవ్వడం లేదు. ప్రభుత్వమే నేరుగా ధరను ప్రకటిస్తోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కిలో చింతపండు ధర రూ.90 నుంచి రూ.100 వరకూ ఉంది. ప్రభుత్వం ప్రకటించిన ధర ఇందులో ఐదో వంతు కూడా లేకపోవడంతో గిరిజనులు చింతపండును జిసిసికి విక్రయించేందుకు ఇష్టపడటం లేదు. అంతకంటే ఎక్కువ ధర ఇస్తున్న ప్రయివేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. కొందరు వ్యాపారులు కేజీకి ప్రస్తుతం రూ.35 వరకూ ఇస్తున్నా తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. గతేడాది కేవలం 120 క్వింటాళ్ల చింతపండును మాత్రమే జిసిసి కొనుగోలు చేయగలిగింది. కొన్ని బ్రాంచుల్లో ఒక్క కేజీ కూడా కొనలేదు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొననుంది.

మనస్తాపంతో మహిళా రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పీలేరు

తన భూమిని ప్రభుత్వ భూమిగా తహశీల్దారు ప్రకటిస్తూ బోర్డు పెట్టడంతో మనస్తాపానికి గురై మహిళా రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పుంగనూరు నియోజకవర్గంలోని పులిచెర్ల మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పులిచెర్ల మండలం వగళ్లవారిపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ(58)కి సర్వే నంబర్ 277/2బిలో 7 ఎకరాల పొలం ఉంది. ఈ పొలాన్ని తనతో పాటు తన సోదరి ఇరువురూ సాగుచేసుకునే వారు. అయితే తన భూమిలో రెండెకరాలను అక్కడి స్థానికులకు కేటాయించేందుకు రెవెన్యూ అధికారులు మహిళపై ఒత్తిడి తెచ్చారని తెలిసింది. చివరికి తన భూమిలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం అంటూ బోర్డు పెట్టడంతో మనస్థాపానికి గురైంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోవడంతో పురుగులమందు తాగి తన స్వగ్రామంలోనే ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి శ్రీనివాసులు, శివకుమార్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు.

నేడు కోటప్పకొండకు సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- నరసరావుపేట (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా నరసరావుపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వివరాలను వెల్లడించారు. శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సిఎం పర్యటన ఉంటుందన్నారు. తొలుత ప్రత్యేక హెలికాప్టర్‌లో కోటప్పకొండకు వస్తారని, అక్కడ రూ.7 కోట్లతో నిర్మించే రోప్‌వేకు శంకుస్థాపన చేస్తారన్నారు. అక్కడే థియేటర్, ఫుడ్‌కోర్టు, గార్డెన్, సరస్సు పనులను ప్రారంభిస్తారన్నారు. కొండపైన పర్యాటక క్షేత్రాన్ని పరిశీలించినానంతరం త్రిముఖలింగాలను ప్రారంభిస్తారన్నారు. పెట్లూరివారిపాలెం వద్ద జెఎన్‌టియు కళాశాలకు రూ.100 కోట్లతో నిర్మించే గదుల నిర్మాణానికి సిఎం చంద్రబాబు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. నరసరావుపేటలోని స్టేడియం వద్ద, సేఫ్ (ఫార్మసీ మందుల కంపెనీ) వద్ద రూ.12 కోట్లతో చేపట్టే బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. బాలికల ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు.

ప్రత్యేకం

రహదారుల విస్తరణకు ఇపిసిలోనే టెండర్లకు ఆహ్వానం

- మార్చి నెలాఖరున టెండర్లు
- గుండుగొలను-కలపర్రు ప్యాకేజీకి రూ.648.80 కోట్లు
- కలపర్రు - చినఅవుటపల్లి ప్యాకేజీకి రూ.707.80 కోట్లు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి

జాతీయ రహదారి-16 (పూర్వపు-5)ని విజయవాడ - గుండుగొలను మధ్య ఆరు వరుసలుగా విస్తరించేందుకు లైన్ క్లియరైంది. మొత్తం 103 కిలోమీటర్ల ఈ రహదారి విస్తరణ పనులను జాతీయ రహదారి సంస్థ (ఎన్‌హెచ్ఎఐ) నాలుగు ప్యాకేజీలుగా చేపట్టనుంది. దీనిలో భాగంగా ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కాంట్రాక్టు(ఇపిసి)పద్ధతిలో తాజాగా రెండు ప్యాకేజీలను టెండర్లు ఆహ్వానించింది. తొలిదశలో గుండుగొలను - కలపర్రు మధ్య 27 కిలోమీటర్ల విస్తరణకు రూ.648.80 కోట్లతో టెండర్లు ఆహ్వానించింది. కలపర్రు-చినవుటపల్లి వరకు 27 కిలోమీటర్ల రహదారి విస్తరణ, హనుమాన్ జంక్షన్ వద్ద ఆరు కిలోమీటర్ల బైపాస్ రోడ్డు ఏర్పాటుకు రూ.707.80 కోట్ల అంచనాతో టెండర్లను పిలిచింది. వీటిని మార్చి నెలాఖరున ఎన్‌హెచ్ఎఐ పిలవనుంది. టెండర్లు స్క్రూటినీ పూర్తి చేసి మేలోపుగానే ఖరారు చేసేందుకు ఎన్‌హెచ్ఎఐ కసరత్తు చేస్తోంది. కాంట్రాక్టు సంస్థ పనులను నిర్వహించేందుకు వీలుగా జూన్‌లో అపాయిం టెడ్‌డేట్ ఇవ్వాలని ఎన్‌హెచ్ఎఐ నిర్ణయించింది.

త్వరలో డిపిఆర్ కన్సల్టెన్సీకి టెండర్లు

ఈ ప్రాజెక్టులో భాగంగా 48.489 కిలోమీటర్ల విజయవాడ బైపాస్ (ఔటర్ రింగ్‌రోడ్డు) రోడ్డును నిర్మించాల్సి ఉంది. చినఅవుటపల్లి నుంచి నున్న మీదుగా హైదరాబాద్ - మచిలీపట్నం జాతీయ రహదారిని కలుపుతూ ఇబ్రహీంపట్నం మీదుగా రాజధాని ప్రాంతంలో ఈ రింగ్‌రోడ్డు కలుస్తుంది. 2014లో ఈ రింగ్‌రోడ్డును నాలుగు వరుసల్లో విస్తరించాలని నిర్ణయించారు. రాజధాని ప్రాంత అవసరాల దృష్ట్యా తాజాగా ఈ రింగ్ రోడ్డును ఆరు వరుసల్లో విస్తరించనున్నారు. దీనిలో భాగంగా ఇబ్రహీంపట్నం వద్ద ఐకానిక్ బ్రిడ్జిని నిర్మించాలి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన సమగ్ర నివేదిక (డిపిఆర్) రూపొందించేందుకుగాను కన్సల్టెన్సీ కోసం రెండు ప్యాకేజీలుగా టెండర్లు ఆహ్వానించేందుకు ఎన్‌హెచ్ఎఐ రంగం సిద్ధం చేస్తోంది.

వీడిన గామన్ గ్రహణం..

ఈ ప్రాజెక్టును తొలుత బిల్డ్ ఆపరేట్ కాంట్రాక్టు (బిఒటి)లో రూ.1,680 కోట్లతో విస్తరించేందుకు కాంట్రాక్టు సంస్థ గామన్‌తో ఎన్‌హెచ్ఎఐ 2014లో ఒప్పందం కుదుర్చుకుంది. గామన్ మూడున్నరేళ్లుగా ఈ ప్రాజెక్టు పనులను నిర్వహించలేదు. ఆ సంస్థ కోరిన విధంగా మూడుసార్లు గడువు పొడిగించినా జాప్యం జరగడం మినహా ఎటువంటి పనులూ చేపట్టలేదు. దీంతో డిజైన్లలో మార్పులతో మొత్తం ప్రాజెక్టు వ్యయం అనూహ్యంగా పెరిగిపోయిందని ఎన్‌హెచ్ఎఐ అధికారులు పేర్కొంటున్నారు. దీని వ్యయం రూ.2,500 కోట్ల వరకు అవుతుందని అంచనా. తాజాగా ఇపిసి పద్ధతిలో టెండర్లు ఆహ్వానించడంతో రహదారి విస్తరణ ప్రాజెక్టుకు పట్టిన గామన్ గ్రహణం వీడినట్లయింది. ప్రైవేటు సంస్థలకు లాభదాయకం కాని ఈ ప్రాజెక్టు నిర్మాణం బిఒటి పద్ధతిలో సాధ్యపడదనే అంచనాతో ప్రాజెక్టుకు ఎన్‌హెచ్ఎఐ ఇపిసి పద్ధతిలో టెండర్లను ఆహ్వానించింది.

సంక్షిప్తం

480 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- డెంకాడ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా డెంకాడ మండలం పెదతాడివాడ జంక్షన్ వద్ద రవాణా అవుతున్న 480 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గురువారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా విజయనగరం నుంచి నాతవలసవైపు లారీలో తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.20 లక్షల వరకు ఉంటుందని శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి ఎ.వి.రమణ తెలియజేశారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో గంజాయి వ్యాపారం ఎక్కువగా జరుగుతోందని, జిల్లాలోని ఎస్.కోట, రామభద్రపురం జంక్షన్ల మీదుగా జిల్లాలోకి గంజాయి ప్రవేశిస్తోందని తెలిపారు.

హోంగార్డుకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి ఏలూరు:

వాహన తనిఖీల సమయంలో లారీని ఆపే క్రమంలో హోంగార్డుకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం ఏలూరుకు చెందిన పి సత్యనారాయణ స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో హోం గార్డ్ (371) గా పనిచేస్తున్నాడు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కాశీ ఈశ్వరరావు నేతృత్వంలో వాహన తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కాశీ ఈశ్వరరావుతో కలిసి సత్యనారాయణ సోమవరప్పాడు జాతీయ రహదారిలో వాహన తనిఖీలు చేపట్టారు. విజయవాడ నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న లారీని సత్యనారాయణ తనిఖీ చేసే క్రమంలో లారీని డ్రైవర్ అతివేగంగా నడిపి హోంగార్డును ఢీకొట్టాడు ఈ ఘటనలో హోంగార్డ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే అతన్ని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

గృహ నిర్మాణంలో విజయనగరం మూడో స్థానం

ప్రథమ స్థానంలో విశాఖ - ఆఖరులో కడప

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఎన్‌టిఆర్ గృహనిర్మాణంలో విశాఖ జిల్లా ప్రథమ, పశ్చిమగోదావరి జిల్లా రెండో స్థానంలో నిలవగా విజయనగరం జిల్లాకు మూడో స్థానం దక్కింది. 2019 ఎన్నికల నాటికి రాష్ట్రంలో 2.50 లక్షల ఇళ్లు నిర్మిస్తామని ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకూ ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించి పనితీరు ఆధారంగా జిల్లాలకు గ్రేడింగులు ప్రకటించింది. రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం పూర్తయిన వాటిలో విశాఖ, పశ్చిమగోదావరి, విజయనగరానికి మొదటి మూడు స్థానాలు దక్కాయి. ఆ తర్వాత స్థానంలో నెల్లూరు నిలిచింది. నిర్మాణంలో కడప జిల్లా రాష్ట్రంలోనే వెనుకబడింది. టిడిపి అధికారం చేపట్టాక ప్రభుత్వం మూడేళ్ల పాటు గృహనిర్మాణాల జోలికి వెళ్లలేదు. పైగా కాంగ్రెస్ హయాంలో ఇళ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న నెపంతో కొత్తగా ఒక్క ఇంటినీ మంజూరు చేయలేదు. ఎన్నికలు దగ్గర పడడంతో గతేడాది నుంచి రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. రాబోయే ఎన్నికల నాటికి లక్ష్యం మేరకు ఇళ్లల్లో గృహ ప్రవేశాలు చేయాలని నిర్ణయించుకుంది. ప్రతి రోజూ జిల్లాల్లో జరుగుతున్న గృహనిర్మాణశాఖ పనితీరును ఉన్నతాధికారులు సమీక్షించి వెనుకబడిన వాటిపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

రాష్ట్రంలోనే ముందుండేందుకు కృషి

వెనుకబడిన విజయనగరం జిల్లాలో శత శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి రాష్ట్రంలోనే ముందుండేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం గ్రేడింగుల ప్రకారం 86 పాయింట్లు సాధించి, ఎ-గ్రేడ్‌లో అభివృద్ధి చెందిన జిల్లాల సరసన నిలిచాం.

మార్గరేట్, హౌసింగ్ పీడీ, విజయనగరం

సంపాదకీయం

మరో కుంభకోణం

పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి)కి ఎకాఎకిన రూ.11 వేల కోట్లకు పైన టోకరా వేసి ఎంచక్కా కుటుంబంతో సహా విదేశాలకు ఉడాయించిన సూరత్‌కు చెందిన నగల వ్యాపారి నీరవ్ మోడీ ఉదంతం ఎన్‌డిఎ ప్రభుత్వంలో బయల్పడిన కుంభకోణాల్లో అతి పెద్దది. సరిగ్గా రెండేళ్ల క్రితం బిజెపి ఏలుబడిలోనే మద్యం వ్యాపారి విజయ్ మాల్యా అచ్చం ఇలాగే రూ.తొమ్మిది వేల కోట్లకు పైన బ్యాంకులకు ఎగనామంపెట్టి విదేశాలకు చెక్కేశాడు. మాల్యా బ్యాంకుల్లో అప్పులు తీసుకొని ఎగ్గొట్టగా నీరవ్ కేవలం కాగితాల ప్రాతిపదికన రూ.వందలు వేల కోట్ల వ్యాపార లావాదేవీలను నిరాటంకంగా నిర్వహించి బ్యాంకులను మోసగించాడు. పిఎన్‌బి అధికారులు ఆలస్యంగా నీరవ్ మోసాన్ని గుర్తించి ఈ ఏడాది జనవరి 29న కేంద్ర పరిశోధనా సంస్థ (సిబిఐ)కు ఫిర్యాదు చేయగా తేలిందేమంటే అంతకంటే ముందుగానే నీరవ్ దేశ సరిహద్దులు దాటారు. ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నీరవ్ డెన్లు, కార్యక్షేత్రాలపై నిర్వహిస్తున్న దాడుల్లో బయట పడుతున్న ఆర్థిక అరాచకాలు యావత్ దేశ ప్రజలనూ నివ్వెరపరుస్తున్నాయి. రూ.5 వేల కోట్ల విలువైన ఆభరణాలు, ఆస్తులను ఇడి జప్తు చేసింది. ఏదో అలవోకగా జరిపిన సోదాల్లోనే ఇంత పెద్ద మొత్తంలో ఆస్తులను గుర్తించారంటే నీరవ్‌ను దేశానికి రప్పించి నేరుగా విచారిస్తే ఇంకెన్ని అక్రమ ఆస్తులు, నల్లధనం వెలుగు చూస్తాయో ఊహకందదు. కుంభకోణానికి ఒడిగట్టిన నీరవ్ 2013లో దేశంలో అత్యంత సంపన్నుల్లో ఒకరుగా లోకానికి పరిచయమమ్యారు. ప్రసిద్ధ ఫోర్బ్స్ పత్రిక వెల్లడించిన ధనవంతుల జాబితాలో చోటు దక్కడంతో అతని పేరు ఖండాంతరాలకు వ్యాప్తి చెందింది. లండన్, న్యూయార్క్, ముంబయి నగరాల్లోని అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో నీరవ్ నగల దుకాణాలు వెలిశాయి. దేశంలో బాగా డబ్బున్నవారు, పలువురు సెలబ్రిటీలు, రాజకీయనాయకులు, వ్యాపారవేత్తలు నీరవ్‌కు కస్టమర్లంటే అతని వ్యాపార సామ్రాజ్యం పరిధి ఏమిటో సులభంగానే అర్థమవుతుంది.

ఆర్థిక నేరగాడైన నీరవ్ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ అండ లేకుండా దేశం విడిచి పారిపోవడం అసాధ్యం. నీరవ్, అతని భార్య, సోదరుడు, వ్యాపార భాగస్వామి అందరూ కట్టకట్టుకొని విదేశాలకు విమానాల్లో ఎగిపోవడం పాలకుల అండలేకుండా ఎలా సాధ్యమవుతుంది? పైగా నీరవ్ మోసంపై 2016లోనే ప్రధాన మంత్రి కార్యాలయానికి ఫిర్యాదు అందినట్లు చెపుతున్నారు. నిజంగా కేంద్రానికి ఆర్థిక కేటుగాళ్లను కట్టడి చేయాలన్న చిత్తశుద్ధి ఉండి ఉంటే తన కార్యాలయానికి అందిన ఫిర్యాదుపై ప్రధాని స్పందించి అప్పుడే దర్యాప్తునకు ఆదేశించి ఉండేవారు. అంతా సర్దుకున్నాక నేరస్తులు విదేశాలకు తప్పించుకుపోయాక తీరిగ్గా ఇప్పుడు కేసులని, దాడులని హడావిడి చేయడం ప్రజల కళ్లుకప్పడానికే. సర్కారు తన వైఫల్యాన్ని అంగీకరించాల్సింది పోయి సాకులు వెదకడం ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేయడం దారుణం. కాంగ్రెస్ హయాంలో 2011లోనే నీరవ్ స్కామ్‌కు బీజాలు పడ్డాయంటూ బిజెపి కేంద్ర మంత్రులు వల్లించడం అసలు విషయాన్ని తప్పుదారి పట్టించడానికి వేసిన ఎత్తు మాత్రమే. గతంలో మాల్యా ఉదంతం జరిగినప్పుడు, అంతకు ముందు ఐపిఎల్ స్కాంలో నిందితుడు లలిత్ మోడీకి కేంద్ర విదేశాంగ మంత్రి హోదాలో సుష్మా స్వరాజ్ పాస్‌పోర్టునకు సిఫారసు చేసినప్పుడు ఇలాగే మోడీ సర్కారు పొంతనలేని వాదనలు వినిపించి మసిపూసేందుకు నానా పాట్లూ పడింది. తాజాగా నీరవ్ విషయంలోనూ అదే బాట పట్టింది.

ఒక సామాన్యుడు రూ.లక్ష రుణం తీసుకోవాలంటే బ్యాంకులకు ఎన్నో భద్రతా పత్రాలు చూపించాలి. ఆస్తులు కుదవ పెట్టాలి. అలాంటిది మాల్యాలకు, నీరవ్‌లకు ఇన్నేసి వేల కోట్లను ఎలాంటి ష్యూరిటీలు, తనఖాలు లేకుండా బ్యాంకులు ఉదారంగా ఎలా ఇస్తున్నాయన్న ప్రశ్నకు సమాధానం లేదు. పిఎన్‌బి జారీ చేసిన 'లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్' అనే పత్రాలతో విదేశాల్లోని భారతీయ బ్యాంకులు నీరవ్ తరఫున రూ.వందలు వేల కోట్లు ముందూ వెనుక చూడకుండా చెల్లించిపడేశాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు కుంభకోణం బయటపడ్డాక కంప్యూటర్ తప్పులని, ఒకరిద్దరు ఉద్యోగులు చేసిన తప్పిదంగా బ్యాంకులు పేర్కొంటున్నాయి. ప్రభుత్వ సంస్కరణల వల్లనే స్కాం బయట పడిందని కేంద్రం రాగాలాపన చేస్తోంది. నయా-ఉదార విధానాలొచ్చాక ఆర్థిక కుంభకోణాలు పెచ్చుమీరాయన్నది యథార్థం. బ్యాంకుల్లో పదోపరకో అప్పు చేసి అది చెల్లించలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుండగా వారి రుణాలను మాఫీ చేస్తే ఆర్థిక అరాకత్వం ప్రబలుతుందని గావు కేకలు పెట్టే కేంద్రం, కార్పొరేట్లకు చెందిన రూ.లక్షలాది కోట్ల రుణాలను రద్దు చేస్తోంది. ఇప్పటికే మాల్యా అప్పుల్లో రూ.ఏడెనిమిది వేల కోట్లను బ్యాంకులు మాఫీ చేశాయి. రేపొద్దున నీరవ్ స్కామ్ సొమ్మునూ అలాగే రద్దు చేసినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఎన్‌డిఎ సర్కారు ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లు తెచ్చి ఇలాంటి నేరస్తులు చేసిన కుంభకోణాల సొమ్మును ప్రజల డిపాజిట్లతో పూరిస్తామంటోంది. ఇప్పటికైనా బిజెపి సర్కారు మాల్యా, లలిత్‌మోడీ, నీరవ్ మోడీలను దేశానికి రప్పించి వారి ఆస్తులను జప్తు చేసి డబ్బు వసూలు చేయాలి. ఆ పని చేయకపోతే ప్రజల్లో బ్యాంకులపైనా, ప్రభుత్వంపైనా విశ్వాసం నశిస్తుంది.

ఇదీ విషయం



రాజు ధనిక ప్రజలు పేద
ఇదేమిటో విడ్డూరం...
కడుపు మండదా మరి
జనం నోట నిష్ఠూరం!

యథా ప్రజా తథా రాజ
ఎక్కడుంది చరిత్రలో...
ప్రభువుల ప్రాభవమే
నడుస్తోంది ధరిత్రిలో!

- కొల్లూరు వెంకట్

విశ్లేషణ

ప్రత్యేక హోదాతోనే పారిశ్రామికాభివృద్ధి

ప్రత్యేక హోదా ద్వారా ఒక రాష్ట్రం త్వరితగతిన పారిశ్రామికాభివృద్ధి సాధించడానికి అవకాశం ఏర్పడుతుంది. కేంద్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక గ్రాంట్లు, సహాయం పొందటమేకాక, అనేక రకాల పన్నుల్లో రాయితీలు లభిస్తాయి. ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లుపై పార్లమెంటులో చర్చ జరుగుతున్న సమయంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఏపికి ఐదేళ్లపాటు ప్రత్యేక హోదా కల్పిస్తామని చెప్పారు. అయితే ప్రతిపక్ష నేత వెంకయ్య నాయుడు కొత్త పరిశ్రమలు రావడానికి, ఉత్పత్తి ప్రారంభించడానికి ఐదేళ్ల సమయం చాలదు, పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారు. తీరా ఎన్నికల సమయం దగ్గరకొచ్చేసరికి తిరుపతి బహిరంగ సభలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు 15 ఏళ్ల పాటు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.

అధికారంలోకొచ్చిన ఈ నాలుగేళ్లలో కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రత్యేక హోదా విషయంలో ఐదు కోట్ల ఆంధ్రులను మోసం చేశాయి. ప్రత్యేక హోదాపై రకరకాల వాదనలతో, ప్రత్యేక ప్యాకేజీని ముందుకు తెచ్చాయి. 2016 సెప్టెంబర్ 7న ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఏపికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. కేంద్ర మంత్రులు సన్మానాలూ చేయించుకున్నారు. ప్రత్యేక ప్యాకేజీకి చట్టబద్ధత లేకపోగా, ఏపికి ఎటువంటి ఉపయోగం జరగలేదు.




కె ఎస్ లక్ష్మణరావు

భారత రాజ్యాంగం 370వ నిబంధన ప్రకారం ప్రత్యేక హోదాను జమ్ము, కాశ్మీర్ రాష్ట్రానికి ఇచ్చింది. ఒక రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. కానీ ఆంధ్రప్రదేశ్ కోరుతున్నది ప్రత్యేక తరగతి హోదా (స్పెషల్ కేటగిరి స్టేటస్). ఇది ఇవ్వటానికి అవకాశముంటుంది. గతంలో 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదాను ఈ విధంగానే ఇచ్చారు. రాజ్యాంగ సవరణగానీ, ప్రత్యేక చట్టంలోగానీ హోదా చేర్చి ఇవ్వలేదు. 2003లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా ఒక్క సంతకంతోనే ఉత్తరాఖండ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించారు. ఈ విషయాన్ని నేడు బిజెపి పాలకులు పూర్తిగా విస్మరించారు.

ప్రత్యేక తరగతి హోదా ఉంటే కేంద్రం అందించే ఆర్థిక సహాయం మొత్తంలో 90 శాతం గ్రాంట్‌గాను, 10 శాతం రుణంగాను వుంటుంది. అవసరమైతే ఆ 10 శాతం కూడా కేంద్రమే రుణమిస్తుంది. ఎక్సైజ్ సుంకం, కస్టమ్స్ సుంకాలు, కార్పొరేట్ ఇన్‌కంటాక్స్‌లలో పూర్తి మినహాయింపు వుంటుంది. వర్కింగ్ కేపిటల్‌పై 3 శాతం, విద్యుత్ చార్జీల్లో 50 శాతం రాయితీ 20 ఏళ్ల వరకూ వుంటుంది. రవాణా, సబ్సిడీ, బీమా ప్రీమియం, రీఎంబర్స్‌మెంట్ వస్తాయి. ప్రత్యేక వర్గ హోదా పొందిన రాష్ట్రాలకు గిరిజన ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు లభిస్తాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఐఐటి, ఐఐఎంలు నెలకొల్పబడతాయి. ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండానే ఇక్కడే ఉన్నత విద్యను చదువుకునే వీలుంటుంది. ప్రత్యేక హోదా వల్ల కలిగే ఈ ప్రయోజనాల వల్లనే అనేక పరిశ్రమలు నెలకొల్పబడతాయి. పెట్టుబడులు కూడా విరివిగా వస్తాయి. పరిశ్రమల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. నిరుద్యోగ సమస్య కొంత పరిష్కారమౌతుంది. ప్రత్యేక హోదా వల్లనే ఉత్తరాఖండ్‌లో 2,45,000 ఉద్యోగాలు, హిమాచల్ ప్రదేశ్‌లో 1,29,000 ఉద్యోగాలు వచ్చాయన్న సంగతి మరువరాదు. కోటి జనాభా కన్నా తక్కువగా ఉన్న ఈ చిన్న రాష్ట్రాల్లోనే ఇన్ని ఉద్యోగాలు వస్తే, పరిశ్రమలు పెట్టడానికి అపార సౌకర్యాలు ఉన్న ఏపిలో ఉద్యోగాలు రావా? అని ప్రశ్నించాలి. చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల్లో జాబు కావాలంటే బాబు రావాలని ప్రచారం చేసి నేడు నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపించింది. రూ.2 వేల నిరుద్యోగ భృతి హామీ ఊసే లేదు. ఏపిలో నవంబర్‌లో జరిగిన 4,548 కానిస్టేబుల్ ఉద్యోగాలకు 4 లక్షల మందికి పైగా పోటీ పడ్డారు. ఇంటర్ అర్హత గల ఈ కానిస్టేబుల్ ఉద్యోగాలకు బిటెక్ విద్యార్హత గలవారు 24 వేల మంది, ఎంటెక్ వెయ్యి మంది, ఎంబిఎ ఎనిమిది వేల మంది, బికాం, బిఎస్‌సి విద్యార్థులు 43 వేల మంది, బిఎ 22 వేల మంది, పిహెచ్‌డిలు 15 మంది పోటీ పడ్డారంటే నిరుద్యోగ తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థమౌతోంది. అలాగే ప్రస్తుతం ఏపిలో 366 ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయి. వీటి నుండి ప్రతి సంవత్సరం 4 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసుకొని నిరుద్యోగ సైన్యంలో కలుస్తున్నారు. హోదా వల్ల ఉద్యోగాలు వస్తాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. కానీ పాలకులు మాత్రం నిరుద్యోగ యువతకు ద్రోహం చేశారు.

నీతి ఆయోగ్ ద్వారా సిఫార్స్ చేసి జాతీయ అభివృద్ధి మండలి ద్వారా ఏపికి హోదా ఇవ్వవచ్చు. ఈ రెండింటికీ ప్రధాని మోడీనే అధ్యక్షుడిగా ఉంటారన్న విషయం విదితమే. ఏపి పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ సందర్భంలో ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీ చట్ట బద్ధమైనదే అయినా, నేడు బిజెపి ఇవ్వకుండా నిరాకరించింది. మోడీ, బాబు లోపాయికారీ ఒప్పందమే హోదా రాకపోవడానికి కారణం.




ప్రణాళికా సంఘం 2014 డిసెంబర్ 31తో రద్దు అయ్యింది. 2015 జనవరి 1 నుండి నీతి ఆయోగ్ ఏర్పడింది. ప్రత్యేక హోదా 14 వ ఆర్థిక సంఘం పరిధిలోనిది కాదని, ఒక వేళ హోదా ఇస్తే బీహార్, ఒరిస్సా, గోవా, కర్ణాటక వంటి రాష్ట్రాలకు కూడా ఇవ్వాల్సి వస్తోందని బిజెపి పాలకులు గారడీ చేస్తున్నారు. అయితే, ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా గురించి ఎటువంటి ప్రస్తావన చేయలేదని, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వద్దని ఆర్థిక సంఘం సిఫార్సు చేసిందని చెప్పటం ఆంధ్రులను వంచించడమేనని 14 వ ఆర్థిక సంఘ సభ్యులు అభిజిత్‌సేన్ అన్నారు. నీతి ఆయోగ్ ద్వారా సిఫార్స్ చేసి జాతీయ అభివృద్ధి మండలి ద్వారా ఏపికి హోదా ఇవ్వవచ్చు. ఈ రెండింటికీ ప్రధాని మోడీనే అధ్యక్షుడిగా ఉంటారన్న విషయం విదితమే. ఏపి పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ సందర్భంలో ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీ చట్ట బద్ధమైనదే అయినా, నేడు బిజెపి ఇవ్వకుండా నిరాకరించింది. మోడీ, బాబు లోపాయికారీ ఒప్పందమే హోదా రాకపోవడానికి కారణం. హోదా లేకపోతే ఏపికి ప్రతి సంవత్సరం రూ.60 వేల కోట్లు నష్టమని ఓ అంచనా. హోదా అవసరం లేదన్న కేంద్ర మంత్రి సుజనాచౌదరి, గల్లా జయదేవ్, సిఎం రమేష్ లాంటి వాళ్లు ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాల్లో పరిశ్రమలు పెట్టి లాభాలు పొందటం గమనార్హం. హోదా కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు పాలకుల విధానాలు అడియాశనే మిగిల్చాయి. మరో పక్క చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక హోదా కోసం పోరాడే వారిపై పి.డి యాక్టు, ఇతర సెక్షన్లు పెట్టి నిర్బంధాన్ని ప్రయోగించడానికి సిద్ధమైంది. ప్రజా ఉద్యమాలను నిర్బంధాలతో అణగదొక్కాలని చూస్తే గతంలో ఏం జరిగిందో ఈ ప్రభుత్వాలకు తెలియంది కాదు. హిట్లర్ లాంటి నియంతలే ప్రజల ముందు కాలగర్భంలో కలిసిపోయారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు. ఈ హక్కును హరించే అధికారం ఈ ప్రభుత్వాలకెక్కడిది? అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి... అన్ని వర్గాల ప్రజలు ప్రత్యేక హోదాకై సమరశీలంగా పోరాడి సాధించుకోవాలి. మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలి. పోరాటాలతోనే హోదా సాధ్యం.

(రచయిత శాసనమండలి మాజీ సభ్యులు)

చర్చ

అభద్రతలో ఆమె



బాల్యంలో ఎన్నో ఘటనలు జరుగుతుంటాయి. అన్నింటినీ గుర్తుంచుకోలేం. కానీ అనుకోని సంఘటన జరిగితే! అప్పుడు మనకు జరిగిందేమిటో కూడా తెలియని వయస్సు అయితే! కొన్నేళ్ల తర్వాత కూడా పదే పదే ఆ సంఘటన మనలను వెంటాడుతూనే వుంటే! అప్పుడేం చేయాలి? సరిగ్గా అటువంటి ఘటనే ఎంతో మంది స్త్రీలకు జరిగే వుంటుంది, వారి బాల్యంలో! కాని ఎవ్వరూ నోరు మెదపరు! అసలు జరిగినదానిని బయటకు చెప్పడానికి కూడా ఇష్టపడరు. అయితే కెనడాలో వుంటున్న భారత సంతతికి చెందిన ఎకాలజిస్టు పూర్ణిమా గోవిందరాజులు అందుకు భిన్నంగా ఆలోచించారు.

53 ఏళ్ల పూర్ణిమ ఇటీవల మన కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి మేనకా గాంధీని కలిశారు. లైంగిక నేరాల నుండి బాలల రక్షణ చట్టం (పిఒసిఎస్ఒ) గురించి తెలుసుకొని ఆమె కెనడా నుండి ఇండియాకు వచ్చారు. ఈ చట్టం ప్రకారం ఏ వయస్సులో లైంగిక దాడి జరిగినా బాధిత మహిళ ఎప్పుడైనా ఆ నిందితునిపై ఫిర్యాదు చేయవచ్చు. దీంతో బాల్యంలో తనపై అత్యాచారం జరిగిందనీ, ఆ నిందితునిపై తక్షణం చర్యలు తీసుకోవాలనీ పూర్ణిమ ఫిర్యాదు చేసింది. తన కుటుంబం పేదరికంలో ఉన్నప్పుడు తల్లిదండ్రీ తనను వారి బంధువుల ఇంట్లో విడిచివెళ్లేవారని, ఆ సమయంలో ఎవరూ లేనప్పుడు తన తండ్రి వయస్సు ఉన్న ఆ ఇంటి యజమాని తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆమె పేర్కొంది. ఎప్పుడైతే తనకు జరిగిన అన్యాయాన్ని బయటపెట్టిందో అప్పుడే తన సోదరి కూడా ఆ నిందితుని బాధితురాలేనన్న నిజం తెలిసి పూర్ణిమ తట్టుకోలేక పోయింది. ఇటీవల ఢిల్లీలో 8 నెలల పసికందుపై ఒక మృగాడు చేసిన వికృత క్రీడ కూడా ఇటువంటిదే. ఈ పాపకు కనీసం తనకు ఏం జరిగిందో కూడా తెలియదు. కొంత వయస్సు వచ్చిన తరువాత పూర్ణిమ లాగా స్పందించడానికైనా!

ఇటువంటి ఘటనలు మన దేశంలో కోకొల్లలు. లైంగిక వేధింపులకు గురయ్యేవారు యుక్తవయస్సు వారే కాదు. పసి పిల్లల నుండి వృద్ధుల వరకు బాధితులే. అసలు ఆడపిల్లలకు రక్షణ ఎక్కడుంటుంది? ఏ వయస్సులో వుంటుంది? ఎందుకంటే ఈ మృగాళ్లు మనింట్లో వుండవచ్చు. మన పక్కింట్లో వుండవచ్చు, మన అన్నో, తమ్ముడో కావచ్చు కాబట్టి. వాస్తవానికి బాల్యంలోనే లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న వారిలో పాఠశాల స్థాయిలోని వారే ఎక్కువగా వుంటున్నారంటే నమ్మగలమా! పాఠశాల సిబ్బంది, వాచ్‌మెన్ అంతెందుకు విద్య నేర్పించే గురువులే ఇటువంటి దాడులకు పాల్పడుతున్న ఘటనలు చూస్తున్నాం. మన దేశంలో అత్యాచారం, ర్యాగింగ్, లైంగిక వేధింపుల కేసులు ప్రతి రోజూ నమోదయ్యే ఇతర కేసులకంటే 90 శాతం అధికంగా వుంటున్నాయని గణాంకాలు తెలియజేస్తున్నాయి.

యునిసెఫ్ గణాంకాల ప్రకారం బాల్యంలో పిల్లలపై జరిగే శారీరక, మానసిక దాడులు, వారి పట్ల చూపే అలసత్వం, నిర్లక్ష్యం, లైంగిక వేధింపులు వంటివన్నీ ముఖ్యంగా వారి ఇళ్లల్లోనూ, పాఠశాలల్లోనూ, సంరక్షణ కేంద్రాల్లోనే జరుగుతుంటాయి. ఇంకా వీధుల్లోనూ, పని ప్రదేశాల్లోనూ చోటుచేసుకుంటాయని నివేదిక తెలిపింది. ఈ దాడుల ప్రభావం వారి పెరుగుదల మీద, శారీరక, మానసిక అభివృద్ధి మీద చూపుతుంది. సామాజిక బలహీనతకూ దారితీస్తుంది. దాడుల తీవ్రత వల్ల కొన్ని సందర్భాల్లో మరణాలూ సంభవిస్తాయి. డబ్ల్యుహెచ్ఓ పరిశోధనల్లోనూ, ఈ వేధింపులు ముఖ్యంగా వారి ఆరోగ్యం పై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయనీ, ఇంకా వారి మనుగడకు, గౌరవానికి, అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారతాయనీ తేలింది. ఈ పరిశోధనలే దాడుల తీవ్రతను తెలియచేస్తున్నాయి. ఎన్ని చట్టాలు వున్నా వాటి అమలులో ప్రదర్శిస్తున్న తీవ్ర నిర్లక్ష్యం కారణంగా ఈ తరహా నేరాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. బాధిత మహిళ మాత్రం జీవితాంతం, మానసికంగా, శారీరకంగా వేదనకు గురౌతూనే వుంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే చట్టాలను పటిష్టంగా అమలు జరపడం కీలకం.

అభినవ్,
రెడ్డిగూడెం మండలం, కృష్ణాజిల్లా.

జన వాక్యం

తల్లి భాష

మన తల్లి భాష తెలుగు, అది మన రాష్ట్ర రాజ భాష కూడా. తెలుగు భాషలో మాట్లాడే వారి సంఖ్య ప్రపంచంలో పది కోట్లుగా వుంది. అంటే ప్రపంచ భాషలలో తెలుగు భాష మూడవ స్థానాన్ని ఆక్రమించింది. కానీ మన రాష్ట్రంలో తెలుగుకు ఇచ్చే ప్రాధాన్యత అంతంత



మాత్రమే. విదేశాల్లో సైతం తెలుగు భాషాభివృద్ధి కోసం పలు సంస్థలు ఎంతో పాటుపడుతున్నాయి. కానీ మన రాష్ట్రంలో రాను రాను పరిస్థితి దిగజారిపోతోంది. అందుకు ఉదాహరణ ప్రభుత్వ సర్వీసు పరీక్షలో తెలుగు ప్రశ్నాపత్రంలో తప్పులు దొర్లితే ఇంగ్లీషునే అంతిమంగా పరిగణనలోకి తీసుకుంటా మని సర్వీసు కమిషను ప్రకటించింది. అభివృద్ధి అంటే ఇంగ్లీష్ ఒక్కటే కాదు. జర్మనీ, ఫ్రాన్స్, చైనా, రష్యాలు వారి మాతృభాషకు ప్రాధాన్యత ఇస్తూనే అభివృద్ధి చెందాయి. మన దేశంలోనే తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ మొదలగు రాష్ట్రాలు వారి వారి మాతృభాషకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. మరి మన తెలుగు భాషకు ఆ హోదా, అధికారం లేదా? ఇకనైనా పాలకులు స్పందించాలి. తెలుగు భాష అభివృద్ధికై తగిన నిధులు కేటాయించాలి. మన మాతృభాష తెలుగుకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

ఎన్. కలీల్,
తాడేపల్లి, గుంటూరు జిల్లా.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

చర్చ

'అణు' కుంపటికై ఆరాటం!

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొవ్వాడలో అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై చర్చల కోసం అమెరికా నుండి వెస్టింగ్‌హౌస్ కంపెనీ ప్రతినిధులు ఈ వారంలో మన దేశానికి రానున్నారు. అమెరికాలో దివాళా తీసిన కంపెనీకి భారత్‌లో పెద్ద పీట వేసి మోడీ-బాబు ద్వయం అమెరికా పాలకుల పాదాలకు మడుగులొత్తడం ఆక్షేపణీయం. కొవ్వాడలో ఏర్పాటు చేస్తామంటున్న ఏపి 1000 రియాక్టర్లు ఇప్పటి వరకు ప్రపంచంలో ఎక్కడా పని చేయడం లేదు. అంతేగాక వాటి నిర్మాణం ప్రారంభించిన ప్రాజెక్టుల వ్యయం భారీగా పెరగడం, తీవ్ర జాప్యం కావడం మాత్రమేగాక కొన్ని చోట్ల బోర్డులు తిప్పేశాయి. సురక్షితమైన సౌర, పవన విద్యుత్ చాలా చౌకగా లభిస్తుండగా ప్రమాదభరితమైన, అత్యంత వ్యయపూరితమైన అణు విద్యుత్ కోసం వెంపర్లాడడం ఎందుకు? ఇప్పటికైనా పాలకులు పునరాలోచించడం అవసరం.



ప్రపంచ స్థాయి రాజధాని, సింగపూర్ తరహా అభివృద్ధి... వగైరా ఉపన్యాసాలు చెప్పే రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రపంచ విద్యుత్ రంగ అనుభవం తెలియదా? తెలిసినా 'ప్రమాదకరమైన అణు విద్యుత్ కేంద్రం మాకొద్దు మొర్రో' అని ఉత్తరాంధ్ర ప్రజలు మొత్తుకుంటుంటే విదేశీ అణు విద్యుత్ కంపెనీలకు ఎందుకు ఎర్ర తివాచీ పరుస్తున్నారు? మోడీ ఒత్తిడిని తట్టుకోలేకనా? లేక ఇద్దరూ కూడబలుక్కొనే అమెరికాకు మడుగులొత్తుతున్నారా?

చైనాలో బ్రేక్

అణు విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంలో దూకుడుగా వెళ్తున్న చైనా సైతం ఏపి 1000 రియాక్టర్ విషయంలో బ్రేక్ వేసింది. గత మంగళవారం (ఫిబ్రవరి 6న) అణు రియాక్టర్‌లో ఇంధనం నింపాలని నిర్ణయించినా, భద్రతా కారణాల రీత్యా వాయిదా వేసినట్లు ఆ దేశ అధికార పత్రిక చైనా డైలీ ప్రకటించింది. వెస్టింగ్‌హౌస్‌తో 2007లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం సాన్‌మెన్‌లో నిర్మించే ఆ ఏపి 1000 రియాక్టర్ 2014లోనే విద్యుదుత్పత్తి ప్రారంభించాలి. కానీ ఇప్పటికీ ఇంధనం నింపనే లేదు. ట్రయల్‌రన్ నిర్వహించి లోపాలను సరిచేయడంతోపాటు భద్రతకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తారు. అవన్నీ సంతృప్తికరంగా పూర్తయితేనే అసలు ఉత్పత్తి జరుగుతుంది. అంతా సజావుగా జరిగితే వీటన్నింటికీ కనీసం ఆరు నెలలు వ్యవధి పడుతుంది. కానీ ఇప్పటి వరకు ఉన్న అనుభవాన్ని పరిశీలిస్తే అందుకు అవకాశమే లేదు. మరిన్ని నెలలు లేక సంవత్సరాలు పట్టినా ఆశ్చర్యం లేదు. 'గరిష్ట స్థాయి భద్రతా ప్రమాణాలను నిర్ధారించుకోవడం కోసమే ఇంధనం నింపే కార్యక్రమాన్ని వాయిదా వేశాం' అని చైనా నేషనల్ న్యూక్లియర్ కార్పొరేషన్ ప్రతినిధి తెలిపినట్లు చైనా డైలీ పేర్కొంది. కాబట్టి తొలి ఏపి 1000 రియాక్టర్ పని ప్రారంభించడం ఇప్పట్లో లేనట్టే! చైనాలోని హయాంగ్‌లో నిర్మాణంలో వున్న మరో ఏపి 1000 రియాక్టర్‌కు ప్రకటించిన గడువు 2020 సంవత్సరం.



బి తులసీదాస్

అమెరికా-బ్రిటన్‌లోనూ చుక్కెదురు

వెస్టింగ్‌హౌస్ కంపెనీ ప్రధాన కార్యాలయం ఉన్న అమెరికాలోనే ఏపి 1000 రియాక్టర్ల నిర్మాణం నిలిచిపోయింది. ఇప్పటికే 900 కోట్ల డాలర్లు (దాదాపు రు.60,000 కోట్లు) ఖర్చు చేసిన దక్షిణ కరోలినా ప్రాజెక్టు ఆగిపోయింది. అక్కడి ప్రజలకు (మదుపర్లకు) టోకరా కొట్టింది. జార్జియాలో నిర్మిస్తున్న మరో ప్రాజెక్టు అంచనా వ్యయం 1400 కోట్ల డాలర్లతో ప్రారంభమై 2700 కోట్ల డాలర్లకు పెరిగింది. ఇప్పటికే నిర్ణయించుకున్న గడువు కంటే ఐదేళ్ళు ఆలస్యంగా పని జరుగుతోంది. నిర్మాణంలో తీవ్ర జాప్యం, భారీ వ్యయం కారణంగా ఆ భారాలను ఎవరు మోయాలని స్థానికులు ఆందోళన చేస్తున్నారు. అంత ఖరీదు పెట్టి విద్యుత్ ఎవరు కొంటారని ప్రశ్నిస్తున్నారు. దాంతో అది డోలాయమాన పరిస్థితిలో పడింది. ప్రతిపాదించిన మిగిలిన ప్రాజెక్టులు నిర్మాణ దశకు వెళ్ళకముందో, ప్రారంభ దశలోనో ఆగిపోయాయి.

అమెరికా సంగతి అలా ఉంటే బ్రిటన్‌లోనూ అందుకు భిన్నంగా లేదు. మూర్‌సైడ్ ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతి మంజూరుకే చాలా ఏళ్ళు పట్టింది. భూసేకరణ 2009లో జరగగా యు.కె. ప్రభుత్వానికి చెందిన న్యూక్లియర్ డీ కమిషనింగ్ అథారిటీ అనేక షరతులతో 2014లో అనుమతి మంజూరు చేసింది. ఇప్పటికీ ఆ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించలేదు. ఏపి 1000 ప్రాజెక్టుపై అనుమానాలు కలగడంతో ఇప్పుడు ఏపిఆర్ 1400 రియాక్టర్లు నిర్మిస్తామని చెబుతున్నారు. దానికి గడువు 2030 సంవత్సరంగా ప్రకటించారు. ఏపి 1000 అణు రియాక్టర్లకు సంబంధించి అభివృద్ధి చెందిన దేశాల అనుభవమిదీ!

నిర్లక్ష్యం.. దోబూచులాట ..

భారత్, అమెరికా అణు ఒప్పందం జరిగిన అనంతరం దేశంలో ఏర్పాటు చేయాలని భావించిన ఆరు కేంద్రాల్లో ఒకటైన కొవ్వాడలో జనరల్ ఎలక్ట్రిక్ - హిటాచి కంపెనీ 6000 మెగావాట్ల సామర్థ్యంతో అణు విద్యుత్ కేంద్రం నిర్మిస్తుందన్నారు. కేంద్ర అటవీ పర్యావరణ శాఖ పర్యావరణ అనుమతి (ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్-ఇ.సి.)కి సంబంధించిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టి.ఒ.ఆర్.)ను కూడా 2011 జులై 8న జారీ చేసింది. మరోవైపు గుజరాత్ లోని మితివిర్దిలో వెస్టింగ్‌హౌస్ కంపెనీ 6600 మెగావాట్ల సామర్థ్యంతో అణు విద్యుత్ కేంద్రం నిర్మిస్తుందన్నారు. అందుకు సంబంధించి కేవలం టి.ఒ.ఆర్. 2014 మార్చి 11న జారీ చేయగా భారత అణు విద్యుత్ కార్పొరేషన్ ఎన్‌పిసిఐఎల్ పర్యావరణ ప్రభావ నివేదిక (ఇ.ఐ.ఎ.)ను కూడా సమర్పించింది. అయినా గుజరాత్ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెస్టింగ్‌హౌస్ ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్‌కు మళ్ళించారు. 'ఆంధ్రుల ఆత్మగౌరవం' ప్రాతిపదికగా ఏర్పడిన తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగానే ఈ 'బదిలీ' జరగడం గమనార్హం. ఇటీవల గుజరాత్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో మితివిర్ది కలిగిఉన్న గరియాధర్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి గెలుపొందారు. అక్కడే అణు ప్రాజెక్టు నిర్మిస్తామని మోడీ సర్కారు చెప్పివుంటే ఆ ఫలితం తారుమారు అయ్యేదేమో!

కొవ్వాడకు సంబంధించిన పాత టి.ఒ.ఆర్.ను బుట్టదాఖలా చేసి 7,248 మెగావాట్ల సామర్థ్యంతో ఆరు ఏపి 1000 రియాక్టర్ల ఏర్పాటుకు మరో టి.ఒ.ఆర్.ను 2017 మే 22న కేంద్రం జారీ చేసింది. దాదాపు ఏడాది కిందట జారీ అయినా ఇప్పటికీ ఇ.ఐ.ఎ. ప్రాథమిక రూపంలో కూడా తయారైన దాఖలా లేదు. దేశంలో ఎక్కడైనా అణు విద్యుత్ కేంద్రం అనుమతించాలంటే ప్రపంచంలో ఏదో ఒక చోట ఆ నమూనా రియాక్టర్ విజయవంతంగా నడుస్తుండాలన్నది భారత అణు నియంత్రణ బోర్డు (ఎ.ఇ.ఆర్.బి) కీలక నిబంధన. ప్రపంచంలో ఎక్కడా అలాంటి రియాక్టర్ విద్యుదుత్పత్తి చేయడం లేదు కాబట్టి ఏపి 1000 రియాక్టరు నిర్మాణానికి అర్హత లేదు. ప్రజల వైద్యానికి ఉపయోగించే ఎం.ఆర్.ఐ. యంత్రం ఏర్పాటు చేయాలన్నా ఎ.ఇ.ఆర్.బి. అనుమతి తప్పనిసరి. అలాంటిది అంత భారీ అణు రియాక్టర్లకు సంబంధించి ప్రాథమిక అర్హత కూడా లేని కొవ్వాడ అణు విద్యుత్ పార్కు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టడం చట్టవిరుద్ధమే అవుతుంది. సాక్షాత్తూ రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గంలోనే ఇలా జరగడం అన్యాయం.

కొనలేనంత ఖరీదు!

దేశంలోను, ప్రపంచంలోను సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి రోజురోజుకూ అధికమవుతోంది. బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ వాటా నానాటికీ తరుగుతుండగా కొత్త అణువిద్యుత్ ప్రాజెక్టులు గత రెండు, మూడేళ్లుగా ప్రపంచంలో ఎక్కడా ప్రారంభించడం లేదు. జనవరి 18,19 తేదీలలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సు వివరాల ప్రకారం గుజరాత్‌లో పవన విద్యుత్ యూనిట్ రు.2.43కు, రాజస్థాన్‌లో సౌర విద్యుత్ యూనిట్ రు. 2.44కు లభిస్తున్నది. అదే అణు విద్యుత్ ఖరీదు అంతకు మూడు రెట్లు పైగా అవుతుంది. మహారాష్ట్రలోని జైతాపూర్‌లో ఏర్పాటు చేయాలని భావిస్తున్న ఎరీవా కంపెనీ (ఫ్రాన్స్)తో జరిగిన చర్చల్లో యూనిట్ ఖరీదు రు.6.50కి మించకుండా ఉండాలని కేంద్ర ప్రభుత్వం అడిగితే ఆ కంపెనీ అందుకు అంగీకరించలేదని భారత అణు ఇంధన శాఖ అధికార్లు 2013లో చెప్పారు. మరి ఈ ఐదేళ్ళలో అది ఇంకా పెరిగే ఉంటుంది. కాబట్టి సౌర, పవన విద్యుత్‌తో పోలిస్తే అణు విద్యుత్ ఖరీదు నాలుగు రెట్లు అధికంగా ఉండడం ఖాయం. విదేశీ అణు విద్యుత్ రియాక్టర్ కంపెనీలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు భారీ కుంభకోణాలవుతాయని హెచ్చరిస్తూ భారత కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కు రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. అధికారి డా॥ ఇ.ఎ.ఎస్. శర్మ గత మే 6న, జూన్ 24న రెండు లేఖలు రాశారు. అయినా కేంద్ర ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

విద్యుత్ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2016 సంవత్సరంలో సౌర విద్యుత్ 30 శాతం , పవన విద్యుత్ 16 శాతం పెరగగా అణు విద్యుత్ కేవలం 1.4 శాతం మాత్రమే పెరిగింది. సురక్షిత విద్యుత్ చౌకగా లభించడమే అందుకు ప్రధాన కారణం. ప్రపంచ స్థాయి రాజధాని, సింగపూర్ తరహా అభివృద్ధి... వగైరా ఉపన్యాసాలు చెప్పే రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రపంచ విద్యుత్ రంగ అనుభవం తెలియదా? తెలిసినా 'ప్రమాదకరమైన అణు విద్యుత్ కేంద్రం మాకొద్దు మొర్రో' అని ఉత్తరాంధ్ర ప్రజలు మొత్తుకుంటుంటే విదేశీ అణు విద్యుత్ కంపెనీలకు ఎందుకు ఎర్ర తివాచీ పరుస్తున్నారు? మోడీ ఒత్తిడిని తట్టుకోలేకనా? లేక ఇద్దరూ కూడబలుక్కొనే అమెరికాకు మడుగులొత్తుతున్నారా? ప్రజలు ఈ ప్రశ్నలకు సమాధానాలు కోరుతున్నారు.

jeevanapageps@gmail.com



వాళ్లిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పెద్దలు ముందు అంగీకరించకపోయినా.. తర్వాత ఒప్పుకున్నారు. ఆమె కూడా అతని కుటుంబ బాధ్యతలు పంచుకుంది. అంతవరకూ బాగున్న వారి జీవితంలో హఠాత్తుగా తుపాను వచ్చింది. అతడు.. తన అతి తెలివితోచేసిన పనే అందుకు ప్రధాన కారణం. ఆ విషయంపై ఆమె అతన్ని నిలదీయడంతో తప్పించుకు తిరగసాగాడు. ఆమె పోలీసులను ఆశ్రయించింది. అతడిని అరెస్టు చేశారు. అతని కుటుంబం మొత్తం ఆమెకు చెప్పకుండా వేరే ఊరు వెళ్లిపోయారు. ఐద్వా సహకారంతో ఆమె పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ సరైన న్యాయం జరగలేదని ఆమె 'ఐద్వా అదాలత్'కు వచ్చింది. చివరకు ఆమె అతన్ని చేరిందా? లేదా? తెలుసుకోవాలంటే ఈ వారం 'ఫ్యామిలీ కౌన్సెలింగ్'లోని 'కేస్‌స్టడీ' చదవండి.

అతి తెలివే కొంపముంచింది

ఫ్యామిలీ కౌన్సెలింగ్

ఆమె పేరు స్రవంతి. తెలిసీ తెలియని వయస్సులోనే పెద్దలు ఆమెకు పెళ్లి చేసేశారు. కానీ, తర్వాత అతని దురలవాట్లు తెలుసుకుని, ఆమెని కాపురానికే పంపలేదు. అలా ఆమె పుట్టింట్లోనే ఉండిపోయింది. అయితే స్రవంతి ఖాళీగా ఉండిపోకుండా చక్కగా చదువుకుంది. ఆ చదువుతో ప్రయివేటు సంస్థలో ఉద్యోగం చేస్తుంది. అక్కడే స్రవంతికి శ్రీధర్ పరిచయమయ్యాడు. ఆమెను ప్రేమిస్తున్నానంటూ కొన్నిరోజులు వెంటపడ్డాడు. చాలారోజుల తర్వాత స్రవంతి తన గతాన్ని అతని ముందుంచుంది. 'ఇప్పటికీ నన్ను పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నావా?' అని శ్రీధర్‌ను అడిగిందామె. "నీ గతంతో నాకేం పనిలేదు. నువ్వు నాకు కావాలి. నువ్వంటే నాకు ఇష్టం" అన్నాడు శ్రీధర్. స్రవంతి హృదయం ఉప్పొంగింది. అతని పట్ల ఆరాధనాభావం కలిగింది. ఇక అప్పటి నుంచి ఇద్దరూ ఎక్కడికైనా కలిసే వెళ్లేవారు. కొన్నిరోజులయ్యాక ఇరువైపుల పెద్దల ముందు తమ పెళ్లి ప్రస్తావన తెచ్చారు. శ్రీధర్ తల్లిదండ్రులు అతని ప్రతిపాదనను తిరస్కరించారు. పైగా ఆ అమ్మాయిని చేసుకున్నావంటే తమతో బంధం తెంచుకోవడమేనంటూ హెచ్చరించారు. స్రవంతి తల్లిదండ్రులు మాత్రం అయిష్టంగానే ఒప్పుకున్నారు. దాంతో ఇద్దరూ పెళ్లి చేసుకుని, అందరికీ దూరంగా కాపురం ఉంటున్నారు. "ఇలా ఎన్నాళ్లు? నా గురించి, నీ కుటుంబానికి దూరంగా నువ్వు ఉండటం సరికాదు.. నేనే మీ అమ్మానాన్న కాళ్లపై పడి వేడుకుంటాను. మనం వాళ్ల దగ్గరికి వెళ్లిపోదాం!" అంది స్రవంతి. అందుకు ఎంతో ఆనందించాడు శ్రీధర్. కానీ రానిస్తారో రానివ్వరో అని భయపడుతూనే భార్యతో తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లాడు. వాళ్ల ముందు అనుమతించమని పంతం పట్టినా, స్రవంతి వాళ్లను బతిమిలాడటంతో కరిగిపోయారు. ఇక అప్పటి నుంచి వాళ్లంతా కలిసిమెలిసి ఉంటున్నారు. స్రవంతి వారందరితో చక్కగా కలిసిపోయింది. మరిది పెళ్లి చేయడంలో వీరిద్దరూ ఎంతో బాధ్యతగా వ్యవహరించడంతో కుటుంబసభ్యులు మరింత ఆనందించారు. ఇలా హాయిగా సాగిపోతున్న వారి జీవితంలో తుపాను చెలరేగింది.

శ్రీధర్ వేరొక అమ్మాయిని పెళ్లికి ముందు ప్రేమించినట్లు తన గతం ఆమెతో పంచుకున్నాడు. అయితే స్రవంతి ముందు దాన్ని అంగీకరిస్తూనే తన మనసులో శ్రీధర్ దూరమవుతాడేమోననే అభద్రతా భావాన్ని పెంచుకోసాగింది. అప్పటి నుంచీ, అతను ఇంటికి రావడం కాస్త ఆలస్యమైనా, ఫోన్ ఎంగేజ్ వచ్చినా అనుమానపడేది. శ్రీధర్ ఆమె అనుమానాన్ని నివృత్తి చేసేందుకు ప్రయత్నించకుండా సరదాగా స్రవంతిని మరింత ఏడిపించాలని అనుకున్నాడు. అందులో భాగంగా శ్రీధర్ తన తెలివితేటలన్నీ ఉపయోగించి, సాంకేతికత సహకారంతో మార్ఫింగ్ చేసి, తనకు మరో అమ్మాయితో పెళ్లయినట్లు, ఆమెతో కలిసి బయటకు వెళుతున్నట్లు.. ఫొటోలు ఆమెకు చూపించేవాడు. దీంతో స్రవంతి తల్లడిల్లిపోయింది.. అతను అది కేవలం కల్పితమేననీ, అది తను ఎలా చేసిందీ వివరించే ప్రయత్నం చేయకుండా..ఆమెను మరింత బాధపెట్టేందుకే ప్రయత్నించాడు. దీంతో ఈ విషయంపై వీరిద్దరి మధ్య స్పర్థలు తారాస్థాయికి చేరాయి. ఈ క్రమంలో ఆమెకి ఏమి చేయాలో పాలుపోక అతనిపై నిఘా వేసేందుకు ఒక ప్రైవేటు సంస్థని ఆశ్రయించింది. వాళ్లు ఆమె వద్ద డబ్బు తీసుకుని, అతని గురించి ఎంక్వయిరీ చేశామన్నారు. అతనికి వేరొకామెతో సంబంధం ఉందని తమ ఎంక్వయిరీలో తేలిందన్నారు. అయితే శ్రీధర్‌తో కూడా ఆ టీమ్ సంప్రదింపులు జరిపిన విషయం స్రవంతికి తెలియదు. అతను సదరు అమ్మాయిని వదిలేయాలంటే మూడు లక్షలు డిమాండ్ చేస్తున్నట్లు టీమ్ స్రవంతితో చెప్పింది. అందుకు స్రవంతి తండ్రితో విషయం చెప్పింది. వాళ్లు అతను తిరిగి వస్తే మూడు లక్షలు ఇవ్వడానికీ అంగీకరించారు. అయితే అతను అందుకు అంగీకరించక పోవడం.. మళ్లీ విషయం మొదటికి రావడం.. టీమ్ సభ్యులు మరింత డబ్బును ఆమె నుంచి డిమాండ్ చేశారు. దాంతో ఆమె స్థానిక ఐద్వా వారి సహకారం కోరింది.

ఐద్వా నాయకుల సహకారంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, లోక్‌అదాలత్‌కు కేసును రిఫర్ చేశారు. అక్కడ ఇద్దరికీ ఐదుసార్లు కౌన్సెలింగ్ చేశారు. ఐదు కౌన్సెలింగుల తర్వాత అతనిలో మార్పు రాకపోగా, మళ్లీ మొదటికొచ్చింది. ఆమెను వద్దంటే వద్దనేశాడు. పైగా అతను ఊరు వదిలి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఈ గొడవలవల్ల అతని కుటుంబ సభ్యులు ఆమెతో మాట్లాడటం మానేశారు. వాళ్లూ ఊరు వదిలి వేరే ఊరు వెళ్లిపోయారు. దీంతో ఆమె 'ఐద్వా అదాలత్'కు వచ్చింది.

అడ్రస్
కుటుంబ న్యాయ సలహా కేంద్రం
మోటూరు ఉదయం ట్రస్టు
ఎంబి భవన్ హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఫోన్ 9494383220

స్రవంతి : అతను నాకు కావాలి. అతనికి వేరొక అమ్మాయితో సంబంధం ఉందని ఎంక్వయిరీలో తేలింది. అతన్ని వదిలి నేను ఉండలేను. మా అమ్మావాళ్లు కూడా అంతగా సహకరించడం లేదు.

బాధ్యులు పంపిన లేఖకు శ్రీధర్‌గానీ, అతని కుటుంబ సభ్యులుగానీ స్పందించలేదు. చివరకు స్రవంతి ఇచ్చిన ఫోన్ నెంబర్ సాయంతో అతని తరపు వాదిస్తున్న లాయర్‌కు ఫోన్ చేశారు. ఆయనేమంటా రంటే.. 'వీళ్లిద్దరూ ఒకరిపై ఒకరు అపనమ్మకంతో ఉన్నారు. ఆమె క్యారెక్టర్‌ను అతను అనుమానిస్తున్నాడు. అతని క్యారెక్టర్‌ను ఆమె అనుమానిస్తుంది. వీళ్లద్దరికీ అసలు పొసగదు. ఆమె బతుకేదో ఆమె బతకడం మంచిది. అందుకు అతని వద్ద నుంచి నష్టపరిహారం కోరితే.. కొంత సాయం అందవచ్చు' అని ముగించారు.

శ్రీధర్ అతి తెలివే అసలు కొంప ముంచింది. నీ అనుమానం నివృత్తి చేసేందుకు అందులో ఒక్కశాతమైనా శ్రీధర్ కృషి చేసినా మీరిద్దరూ బాగుండేవారేమో?!

'ఆమె తన భర్త తనకు కావాలంటే, ఆమె బతుకు ఆమెను బతకమంటారేంటి? శ్రీధర్‌ని మా వద్దకు పంపండి.. మేము అతనితో మాట్లాడతాం' అన్నారు బాధ్యులు. అయితే సదరు లాయరు 'శ్రీధర్ ఫోన్ నెంబరు నా దగ్గర లేదు. వాళ్ల తమ్ముడి నెంబరు ఉంది. ఆయనకు చెప్పి, మీ దగ్గరకు రమ్మని చెప్తాను' అన్నారు. అయితే అతను రాలేదు. శ్రీధర్ తమ్ముడికి బాధ్యులే ఫోన్ చేశారు. 'మాకు అతను ఎక్కడున్నాడో తెలియదు. అన్నయ్య విసిగిపోయాను అంటున్నాడు. చట్టపరంగానే ఎదుర్కొంటాం' అన్నారు.

బాధ్యులు ఏమన్నారంటే!?

చూడు స్రవంతి.. ఇక్కడ పొరపాటు ఇరువైపుల నుంచీ జరిగింది. భార్యాభర్తల మధ్య దాపరికం ఉండకూడదనే అతను నీకు తన గతం గురించి చెప్పాడు. నీ గతం తెలుసుకునే పెళ్లి చేసుకున్నాడు. ఇక వాటిని మీ మధ్య ఎప్పుడూ ఎవరూ ప్రస్తావనకు తీసుకురాకూడదు. కానీ మీరు ఆ విషయం తప్ప వేరే విషయాలు మాట్లాడుకున్నట్లు అనిపించడంలేదు. దానిచుట్టూనే మీరున్నప్పుడు సమస్య తప్ప మీ మధ్య అనుబంధం ఎక్కడ ఏర్పడుతుంది? ఇద్దరికీ ఒకరంటే ఒకరికి చెప్పలేనంత ప్రేమ ఉందంటు న్నారు. ఏం లాభం? మీ ఇద్దరూ ఈ విషయం పైనే నిత్యం గొడవలాడుకోవడం, అందులోనూ శ్రీధర్ అతి తెలివే అసలు కొంప ముంచింది. నీ అనుమానం నివృత్తి చేసేందుకు అందులో ఒక్కశాతమైనా శ్రీధర్ కృషి చేసినా మీరిద్దరూ బాగుండేవారేమో?! ఏమైనా ఈ విషయంలో ఇప్పటికే చాలా గొడవలు జరిగాయి. మా దగ్గరకు రావడం కూడా చాలా ఆలస్యమైంది. అయినా మా స్థానిక ఐద్వా సహకారంతో నిన్ను మీ అత్తగారింటికి పంపిస్తాం. మీ మామగారు మీపట్ల సానుకూలంగా ఉన్నారని చెప్తున్నారు. మీరు అక్కడే ఉండండి. అతనే ఎప్పటికైనా తిరిగి వస్తాడు. నువ్వు మాత్రం ఉద్యోగం చేయి. మానేయవద్దు.'

బాధ్యుల మాటల్ని స్రవంతి అంగీకరించింది. ఆరోజే అత్తగారింటికి వెళ్లడానికి సిద్ధమైంది. ఆమేరకు రిజిష్టర్‌లో రాసిన ఒప్పందం అంగీకరిస్తూ సంతకం పెట్టింది. అయితే ఆమె తల్లిదండ్రులు సహకరించకపోవడంతో స్రవంతి అత్తగారింటికి వెళ్లకుండా పుట్టింట్లోనే ఉండిపోయింది. అయితే తన ఉద్యోగం మాత్రం మానుకోననీ, అతను వచ్చినప్పుడే వస్తాడు అంటోంది. తనిలాగే అతని కోసం ఎదురుచూస్తూ ఉండిపోతానంటోంది స్రవంతి.

'నీకు భవిష్యత్తులో ఎలాంటి అవసరమైన మేమున్నామని మరిచిపోకు. నీవు ఎలాగో అతని నుంచి విడిపోవాలని కోరుకోవడం లేదు. ఇప్పటికైనా నీలో అనుమానం తీసేయి. మా సలహా మేరకు నీవు మీ అత్తగారింటికి వెళ్లి ఉండడమే ఉత్తమం. నీకు ఎప్పుడు వెళ్లాలన్నా మేము నీకున్నామని మరిచిపోకు. ధైర్యంగా ఉండు' అని బాధ్యులు భరోసా ఇచ్చారు.

- శాంతిశ్రీ

అలా చేస్తే.. ఆమెకే నష్టం!

సైకాలజీ

నా స్నేహితురాలు చాలా మంచిది. కానీ తనకొక చెడ్డ అలవాటు ఉంది. ప్రేమ పేరుతో మా క్లాసులోని అబ్బాయిలకు ఫోన్‌చేసి, గంటలు గంటలు మాట్లాడుతుంది. ఒకరితో మాట్లాడే విషయం ఇంకొకరికి తెలియకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఆమె ప్రేమ నిజమనుకుని.. ఆ అబ్బాయిలు ఆమెను ప్రేమిస్తున్నారు. ఆమె చేసేది చాలా తప్పని ఒకరోజు నేను చెప్పాను. అప్పుడు నాకు ఒక నిజం తెలిసింది. తను అలా డిస్టబ్ చేస్తే వాళ్లు చదువుకు దూరమవుతారని, తానే ఎప్పుడూ క్లాసు ఫస్ట్ రావచ్చనేది ఆమె ఆలోచన. నేను వాళ్లకు చెప్పాస్తానంటే 'నీ పేరుమీద లెటరు రాసి చచ్చిపోతా!' అని నన్ను బెదిరిస్తోంది. తననెలా మార్చాలి?

- ఓ సోదరి



మీ స్నేహితురాలి వ్యక్తిత్వంలో స్పష్టమైన సమస్యలు కనబడుతున్నాయి. ఇక్కడ విషయాన్ని రెండు కోణాలలో చూడవచ్చు. తను మాత్రమే ఉన్నత స్థానానికి ఎగబాకాలి అనేది. ఆ క్రమంలో మిగతావారిని లాగి కిందపడేయాలి అనే విపరీత ధోరణి. దానికి ఇతరుల బలహీనతలను ఉపయోగించుకుని తననే వారి బలహీనతగా మారుస్తూ.. తాను పైకి ఎగబాకాలి అనే మరో ధోరణి. ఒకటి ఆమెలోని ఆలోచనలను స్పష్టంగా చూపిస్తుంది. పదిమందిలో తానే ప్రత్యేకంగా కనిపించాలని ఆమెలో ఉన్న తీవ్రమైన ఆరాటమే అందుకు కారణం.. ఉద్దేశ పూర్వకంగా ఒకరికి తెలియకుండా ఒకరిని ప్రేమిస్తున్నానని చెప్పటం ద్వారా తనలోని విశ్వసనీయతలేమిని తెలియజేస్తుంది. అయితే మిగతావారికి ఈ విషయం ఒకరి తర్వాత ఒకరికి తెలియకుండా ఉండదు. అయితే తెలిసినపుడు ఆమె విషయం బయటపడకుండానూ ఉండదు. ఈ క్రమంలో మిమ్మల్ని ఆమె అపరాధ బావానికి గురిచేయడానికి ప్రయత్నం చేస్తుంది. మిమ్మల్ని బాధ్యురాలిని చేసేపనైతే సున్నితంగా ఆలోచించే మీరు తట్టుకోగలరో లేదో తెలియదు. కాబట్టి సాధ్యమైనంత వరకు క్రమక్రమంగా ఆమెలో మీకు నచ్చని వ్యక్తిత్వధోరణి నుంచి దూరంగా వెళ్లే ప్రయత్నం చేయండి. అలాగే ఆమె పన్నేటువంటి ఆలోచనలు ఏమైతే ఉన్నాయో.. ఆ సాలెగూటిలో మీరు చిక్కుకోకుండా జాగ్రత్తలు తీసుకుని, మిమ్మల్ని మీరు కాపాడుకోండి. ఇకపోతే ఒకే వ్యక్తి ఇన్ని రకాలుగా ఇంత మందితో మాట్లాడటం అనేది, వాళ్లను కిందకులాగి తాను పైకి ఎగబాకటానికి ప్రయత్నిస్తున్నాను అనుకుంటుందే కానీ.. ఇంతమందిని ఉద్దేశపూర్వకంగా తనవైపుకు తిప్పుకునే క్రమంలో తను చేయాల్సిన పని కాకుండా అనవసరంగా ఇతర విషయాలమీద ఎక్కువ శక్తి సామర్థ్యాలను, తన సమయాన్ని కేటాయించి తానూ ఊబిలో కూరుకుపోతోంది. అంతేకాక తన చుట్టూ ఉన్న చిన్న ప్రపంచంలో ఎవరికీ విశ్వసనీయమైన వ్యక్తిగా కనబడదు అనే విషయాన్ని కూడా ఆమె అర్థంచేసుకోలేకపోతుంది. ఒకవిధంగా తనను తానే మోసం చేసుకుంటుంది. మీరు మీ దృష్టిని చదువుమీద పెట్టి, మీ ఉన్నతి గురించి ఆలోచించుకోండి. ఆమెకు మాటలు చెప్పడం ద్వారా మీరు సహాయపడటమేమోగానీ మీకు నష్టం కలుగుతుంది. సాధ్యమైనంతవరకు ఆమెకు దూరంగా ఉండటం మంచిది. ★



డా. పద్మజ, సైకాలజిస్టు

విగ్రహం లాంటి మనిషి !



కదలక మెదలక నిల్చొని ఉండేవాడిని చూస్తే ...బెల్లం కొట్టిన రాయిలా నిల్చుని ఉన్నాడంటారు. కానీ విగ్రహంలా నిల్చోవడమే ఒకాయనకు జీవనాధారమని తెలిస్తే ఆశ్చర్యపోతాం. కదలకుండా, మెదలకుండా ఎవరేమన్నా మాట్లాడకుండా, దిక్కులు చూడకుండా, ఏమాత్రం చలనం లేకుండా... ఒక్క ముక్కలో చెప్పాలంటే విగ్రహంలా 32 ఏళ్ళుగా, రోజుకు ఆరు గంటల పాటు నిలబడుతున్నాడు. అదే మనమైతే రోజుకు ఆరు గంటల పాటు నిలుచోగలమా? లేదా.. మూడు గంటలు... పోనీ కనీసం ఓ గంట నిశ్చలంగా నిల్చోగలమా? ఉహూ.. సాధ్యమయ్యే పనే కాదు. ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు అబ్దుల్ హఫీజ్.

విగ్రహంలా నిల్చొనే హఫీజ్‌ని చూడాలంటే చెన్నై వెళ్లాల్సిందే. చెన్నై నగరంలోని వీజీపీ గోల్డెన్ బీచ్‌కు వెళ్తే అతన్ని కలవొచ్చు. అక్కడే అబ్దుల్ హఫీజ్ నిత్యం ఆరు గంటల పాటు విగ్రహంలా నిలబడతాడు. అదీ ఓ ప్రత్యేకమైన వేషధారణతో. అలా నిలబడేందుకుగాను సదరు రిసార్ట్ మేనేజ్‌మెంట్ అతనికి జీతం కూడా చెల్లిస్తోంది. అలా అతను గత 32 ఏళ్లుగా ఆ పని చేస్తున్నాడు. నిత్యం ఆ రిసార్ట్‌కు రావడం, ఆరు గంటల పాటు విగ్రహంలా నిలబడడం, సమయం కాగానే వెళ్లిపోవడం... ఇదీ అతని డ్యూటీ. అతని విధుల్లో భాగంగా నిత్యం ఎన్నో వందల మందిని అతను చూస్తుంటాడు. ఎంతో మంది అతనితో సెల్ఫీల కోసం, అతన్ని వీడియోలు తీసుకునేందుకు పోటీ పడుతుంటారు. అయినా తన విధి నిర్వహణలో హఫీజ్ మాత్రం ఎప్పుడూ ఒక అంగుళం కూడా కదల్లేదు.

అబ్దుల్ హఫీజ్‌ను ఇంచ్ కదిలించినా చాలు... అలాచేసిన వారికి రూ.10వేల నగదు బహుమతి ఇస్తామని ఆ రిసార్ట్ మేనేజ్‌మెంట్ ఎప్పుడో ప్రకటించింది. కానీ ఇప్పటివరకు ఆ పని ఎవరూ చేయలేకపోయారు. అతన్ని ఇంచ్ కాదు కదా కనీసం ఒక సెంటీమీటర్ కూడా ఎవరూ కదిలించలేదు. అతని దిక్కును తిప్పలేదు. చూపును మరల్చనూ లేదు. అది ఎవరికీ ఇప్పటికీ సాధ్యం కాలేదు. అంతటి ఏకాగ్రత అతని సొంతం. మనమైతే చిన్న డిస్టర్బెన్స్ అయితే చాలు.. వెంటనే తల పక్కకి తిప్పి చూస్తాం. కానీ అతను మాత్రం ఎలాంటి డిస్టర్బెన్స్ కాదు కదా, సముద్రాలు ఉప్పొంగినా, ప్రళయం లాంటిది వచ్చినా కదలనటువంటి మనోనిబ్బరం సాధించాడు. నిత్యం అతను ధ్యానంతోపాటు పలు వ్యాయామాలు చేస్తాడు. అందుకే అంతటి ఏకాగ్రతను అతను సాధించగలిగాడు. ఈ క్రమంలో 'స్టాచ్యూ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా కూడా పేరొందిన హఫీజ్ చెక్కుచెదరని మనో నిబ్బరానికి, ఏకాగ్రతకు ఓ సంకేతం. ★



పాలపళ్ళ సమస్యలొస్తే?



పిల్లల్లో పాలపళ్ళు ఊడిపోయి దంతాలు రావడమనేది ఒక్కొక్కరికి ఒక్కో వయసులో జరుగుతుంది. వారికి అందే క్యాల్షియం వంటి ఎన్నో అంశాలు దంతాలు వచ్చే ప్రక్రియలో ప్రధానపాత్ర పోషిస్తాయి. అయితే పిల్లలకు పళ్లు రావడం మొదలయ్యేటప్పుడు బరువు తగ్గుతారా? అనే ప్రశ్న చాలామంది తల్లిదండ్రులను వేధిస్తుంటుంది. ఇది సాధారణమే. పాలపళ్ళు ఊడిపోయినప్పుడు ఆకలి మందగిస్తుంది. దానివల్ల పిల్లలు బరువు తగ్గుతారు. పళ్ళు వచ్చే సమయంలో ఉండే అసౌకర్యంవల్ల పిల్లలు సరిగ్గా తినరు, తాగరు. దీనివల్ల పిల్లలు డీహైడ్రేషన్‌కు గురవుతారు. అందువల్ల తరచూ వారికి ద్రవాలను అందివ్వాలి. డీహైడ్రేషన్ మరీ తీవ్రస్థాయికి చేరినప్పుడు పీడియాట్రిక్ ఎలక్ట్రోలైట్ రీప్లేస్‌మెంట్ సొల్యూషన్స్‌పై దృష్టి పెట్టాలి. పిల్లలకు సోడియం శాతాన్ని తగినంత అందించాలి. వారిని హైడ్రేట్ చేసేందుకు ఈ పద్ధతి తోడ్పడుతుంది. పిల్లలు తినాలనుకున్నపుడు హై కేలరీలుగల డ్రింక్స్‌ను లేదా చిన్న చిన్న మోతాదులలో భోజనాన్ని అందించాలి. అలాచేస్తే వారు ఆకలితో బాధపడరు. చల్లని పదార్థాలు చల్లటి పెరుగు, తాజా పళ్ళు తింటే.. పంటి సమస్యలను అరికడతాయి. పిల్లలకు ఆహారాన్ని ఇచ్చే ముందు ఫ్రిజ్‌లో ఆహారాన్ని కొద్దిసేపు ఉంచాలి. చల్లని పదార్థాలు పిల్లలకి నొప్పిని తగ్గిస్తాయి. సులభంగా నమలగలిగే ఆహార పదార్థాల్నే పాలదంత సమస్యగల పిల్లలకి పెట్టాలి. ఉతికిన వస్త్రం వారికి ఇస్తే దంతనొప్పి వల్ల కలిగే బాధ నుంచి కొంచెం ఉపశమనం కలుగుతుంది. ★

జీవన సౌరభం

భయపడటం ఎప్పుడు మానేస్తామో అప్పుడే మన జీవితం మొదలైనట్టు.

మీ కోసం



నూనె ఒలికిన ప్రదేశంలో మైదాపిండి చల్లితే నూనెను త్వరగా పీల్చేస్తుంది.

సెన్సెక్స్ ↓ 287
34,010

నిఫ్టీ ↓ 93
10,452

రూపాయి ↓ 30 పై॥
అమెరికా డాలరుకు రూ.
64.21



మాక్సీవిజన్‌కు నాభ్ గుర్తింపు..

మాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్‌కు నాభ్ నుంచి ప్రీ అక్రిడేషన్ ఎంట్రీలెవల్ సర్టిఫికేషన్ లభించిందని ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డి తెలిపారు. వైద్య ప్రమాణాలు, ఆరోగ్య సంరక్షణ సంస్థల నాణ్యతకు గాను ఈ గుర్తింపు లభించిందన్నారు.



ప్రతిభావంతుల కోసం..

ఐటి పరిశ్రమ నిపుణులతో ఫిన్‌టెక్, బ్లాక్ చెయిన్ నిపుణులను తయారు చేయడానికి అత్యాధునిక ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టినట్లు టాలెంట్ స్ప్రింట్ సిఇఒ శంతను పాల్ తెలిపారు. ప్రతిభావంతులను సృష్టించే ప్రయత్నంలో భాగంగా రిప్పల్, పేపాల్, పేటియం పేమెంట్స్ బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకుల ప్రతినిధులతో ఆయన భాగస్వామ్యం కుదుర్చుకున్నారు.

భారీ స్కామ్‌కు 2 కోట్ల బీమా..!

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన రూ.11,500 కోట్ల భారీ కుంభకోణానికి కేవలం రూ.2 కోట్ల బీమా మాత్రమే అందనుందని ఇన్సూరెన్స్ వర్గాలు పేర్కొన్నాయి. అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు నష్టపరిహార బీమా పాలసీ కింద వాణిజ్య, బిల్ డిస్కౌంటింగ్, సైబర్ బీమా కింద ప్రత్యేకంగా బీమా సదుపాయాన్ని తీసుకుంటాయి. కాని పిఎన్‌బి అలా చేయలేదని తెలుస్తోంది. పిఎన్‌బి బ్యాంకర్ నష్టపరిహార పాలసీ కింద రూ.5కోట్ల ప్రీమియంను చెల్లిస్తోందని యునైటెడ్ ఇండియా అధికారి తెలిపారు. ఈ పాలసీ మొత్తం బీమాను కల్పించదన్నారు. ఆస్తి నష్టం, అగ్ని ప్రమాదం, దోపిడీ, మోసాల కింద ఈ బీమా నిర్దిష్ట పరిమితులను మాత్రమే కవర్ చేస్తుందన్నారు. ఈ నిబంధనల్లో భాగంగా పిఎన్‌బికి రూ.2కోట్ల బీమా మాత్రమే అందనుందన్నారు. కాగా పిఎన్‌బిలో 2011 నుంచే మోసం జరుగుతుందని ఆ బ్యాంకింగ్ వర్గాలే పేర్కొన్నాయని అన్నారు. తాము ఆ బ్యాంకుకు రెండు సంవత్సరాల నుంచే బీమా అందిస్తున్నామన్నారు.

ఐదేళ్లలో 8,670 రుణ మోసాలు

రూ.61వేల కోట్ల విలువ : ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : పిఎన్‌బిలో భారీ మోసం బయటపడటంతో ఇలాంటి కేసులు ఇంకా చాలనే ఉన్నాయని తెలుస్తోంది. గత ఐదు సంవత్సరాల్లో 8,670 రుణ మోసాల కేసులు చోటు చేసుకున్నాయని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా తాజాగా ఓ రిపోర్టులో వెల్లడించింది. వీటి విలువ రూ.61,260గా ఉంది. 2017 మార్చి 31 నాటికి ఐదు ఆర్థిక సంవత్సరాల్లో ఈ మోసాలు జరిగాయి. వీళ్లంతా ఉద్దేశ్యపూర్వకంగానే బ్యాంకులను ముంచారు. ఇప్పటికే భారీగా పెరిగిపోతున్న మొండి బాకీలు బ్యాంకింగ్ రంగాన్ని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే రూ.17,634 కోట్ల విలువ చేసే మోసాలు చోటు చేసుకున్నాయి. ఇందులో పిఎన్‌బి కుంభకోణం విలువను చేర్చలేదు. అదే 2012-13లో రూ.6357 కోట్ల రుణ మోసాలు జరిగాయి.

రూ.15 వేల కోట్లు తుడుచుకు పోయాయి

- పిఎన్‌బి దెబ్బతో మదుపరి నష్టం
- పడిపోయిన పలు సూచీలు
- గీతాంజలీ సూచీ ధమాల్
- భారీగా నష్టపోయిన ఎల్ఐసి



ముంబయి : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి)లో నెలకొన్న కుంభకోణం వల్ల మదుపర్లు రూ.15,000 కోట్ల పైగా నష్టపోయారు. ఈ స్కాంలో సంబంధమున్న సూచీలు అమాంతం పడిపోవడంతో మదుపరి బోరు మంటున్నాడు. వరుస విక్రయాలతో ఒక్క పిఎన్‌బి మదుపరులే రూ.8,077 కోట్లు నష్టపోయారు. ఫిబ్రవరి 12న రూ.39,209.62 కోట్లుగా ఉన్న పిఎన్‌బి మార్కెట్ విలువ శుక్రవారం ముగింపు నాటికి 31,132 కోట్లకు పడిపోయింది. కాగా ఈ కేసులో ప్రత్యక్ష సంబంధం కలిగిన గీతాంజలీ జెమ్స్ సూచీ మార్కెట్ విలువ రూ.445.50 కోట్లకు క్షీణించింది. నాలుగు సెషన్లలో ఈ సూచీ 40 శాతం మేర నష్టపోయింది. ఈ స్కామ్‌లో మరో మూడు బ్యాంకు లకు సంబంధాలున్నాయని వచ్చిన రిపోర్టులతో వాటి విలువ మరో రూ.5,500 పతనమయ్యింది. వజ్రాల వ్యా పారీ నీరవ్ మోడీ వల్ల పిఎన్‌బి దాదాపు రూ.11,500 కోట్లు నష్టపోయింది. ఈ సొమ్ము జనం దాసుకున్నదే. కాగా మరోవైపు మదుపర్లు రూ.15వేల కోట్లు నష్టపోవడంతో ఒక విధంగా ఈ కుంభకోణం నష్ట విలువ రూ.27 వేల కోట్లు అని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ రెండు నష్టాలను వేరుగా చూడలేమంటున్నారు.

ఆటో, లోహ సూచీల దిగాలు

ఆటో, లోహ, పిఎస్‌యు, రియాల్టీ సూచీల అమ్మకాల ఒత్తిడితో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలనే ఎదుర్కొన్నాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 286.71 పాయింట్లు లేదా 0.84 శాతం పతనమై 34,010.76కు పడిపోయింది.

ఎన్ఎస్ఇ నిఫ్టీ 93.2 పాయింట్లు లేదా 0.88 శాతం తగ్గి 10,452.30 వద్ద ముగిసింది. ఇంట్రా ట్రేడింగ్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ 340 పాయింట్లు పతనమై 33,957.33 కనిష్ట స్థాయికి పడిపోయింది. నిఫ్టీ 106 పాయింట్లు క్షీణించింది. ప్రస్తుత ఏడాది జనవరిలో భారత దిగుమతులు 26 శాతం పెరిగి 40.68 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. దీంతో వాణిజ్య లోటు 16.29 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ పరిణామం మదుపర్లలో విశ్వాసాన్ని దెబ్బతీసింది.

సెన్సెక్స్-30లో ఎస్‌బిఐ 2.55 శాతం, యస్ బ్యాంకు 2.52 శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 2.31 శాతం, మారుతి సుజుకి 2 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 1.94 శాతం, అదానీ పోర్ట్సు 1.70 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు కొటాక్ బ్యాంకు 1.14 శాతం, ఇన్ఫోసిస్ 0.96 శాతం, డాక్టర్ రెడ్డీస్ 0.83 శాతం, ఆసియన్ పెయింట్స్ 0.73 శాతం, టిసిఎస్ 0.18 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.01 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

ఎల్ఐసికి రూ.1,374 కోట్లు ..

పిఎన్‌బి సూచీ పతనంతో గత మూడు రోజుల్లో ఎల్ఐసికి రూ.1,374 కోట్ల నష్టం వాటిల్లింది. పిఎన్‌బిలో 13.74 శాతం వాటాతో ఎల్ఐసి అతిపెద్ద పబ్లిక్ షేర్ హోల్డ ర్‌గా ఉంది. 2011 నుంచి పిఎన్‌బిలో ఎల్ఐసి క్రమంగా తన వాటాను పెంచుకుంటూ వస్తోంది. ఆ సమయంలో 8 శాతంగా ఉన్న వాటా ప్రస్తుతం 14 శాతానికి చేరువలో ఉంది. ఈ లెక్కన ఫిబ్రవరి 14న ఎల్ఐసికి ఇందులో ఉన్న రూ.5,463.72 కోట్ల విలువ శుక్రవారం ముగింపు నాటికి రూ.4,089.76 కోట్లకు పడిపోయింది.

లక్ష్యాన్ని మించి రాణిస్తున్నాం

- ఎల్ఐసి ఛైర్మన్ వికె శర్మ వెల్లడి
- ప్రీమియంలో 12% వృద్ధి

ముంబయి : దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా కంపెనీ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) 2017-18 డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో రూ.2,23,854 కోట్ల ప్రీమియం ఆదాయం సాధించింది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.2,00,818 కోట్ల ప్రీమియం నమోదయ్యింది. దీంతో పోల్చితే గత మూడు త్రైమాసికాల ఆదాయంలో 11.47 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. ఇదే కాలంలో నూతన వ్యాపారం 19.47 శాతం పెరిగి రూ.99,783.33 కోట్లకు చేరిందని ఎల్ఐసి ఛైర్మన్ వికె శర్మ తెలిపారు. 2017-18లో ఏక ప్రీమియంలో పెట్టుకున్న లక్ష్యాన్ని డిసెంబర్ ముగింపు నాటికే చేరుకున్నామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీల్లో రూ.70,000 కోట్ల పెట్టుబడులు పెట్టామన్నారు. తాము 2017-18 ఏడాదికి పెట్టుకున్న రూ.50వేల-60వేల కోట్ల లక్ష్యానికంటే ఈ మొత్తం ఎక్కువన్నారు.

క్రితం డిసెంబర్‌తో ముగిసిన మూడు త్రైమాసికాల్లో పెన్షన్స్, గ్రూపు సుపెరేన్యేషన్ వ్యాపారం 22 శాతం వృద్ధితో రూ.62,385 కోట్లకు చేరిందన్నారు. సోషల్ సెక్యూరిటీ పథకాల్లో భాగంగా 5.96 కోట్ల మందిని కవర్ చేసినట్లు తెలిపారు. మొత్తం ఆస్తులు 16.75 శాతం పెరిగి రూ.28,51,190 కోట్లకు చేరాయని శర్మ తెలిపారు. అంచనాలకు తగ్గట్లుగానే తమ ప్రగతి కొనసాగుతుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 1.30 లక్షల ఏజెంట్లను చేర్చుకోవడం ద్వారా మొత్తం ఏజెంట్ల సంఖ్య 11 లక్షలకు చేరిందన్నారు. వయస్సు పరిమితి పెట్టడం ద్వారా యువకులను తీసుకోగలుగుతున్నామన్నారు.

టెట్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

శరీర బరువు సూచిని ఎలా కొలుస్తారు?

ఓఅ



టి.ఎం.దాస్
ఎపి మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల
మహానంది,
సెల్ : 9000250127

1. మానవాభివృద్ధి సూచిలో యుఎన్‌డిపి వారు సూచించిన ప్రధాన అభివృద్ధి సూచికలు?
ఎ. విద్య బి. అక్షరాస్యత
సి. తలసరి ఆదాయం డి. పైవన్నీ

2. భారత దేశంలో కార్మికవర్గంలో ఎంత శాతానికిపైగా అవ్యవస్థీకృత రంగంలో ఉన్నారు?
ఎ. 80 % బి. 20 %
సి. 90 % డి. 50 %

3. సర్దార్ సరోవర్ ఆనకట్ట నిర్మాణానికి వ్యతిరేకంగా తన అభిప్రాయాలను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రికి వివరించినవారు?
ఎ. బాబాసాహేబ్ బి. బావా మహలియా
సి. మేధాపాట్కర్ డి. గుత్తేదార్లు

4. ఉత్తరాఖండ్‌లోని గడ్వాల్ కొండలలో 1970లో ఆరంభమైన ఉద్యమం?
ఎ. చిప్కో బి. నర్మదాబచావో
సి. సైలెంట్ వ్యాలీ డి. రంపా

5. చిప్కో అనే పదానికి అర్థం?
ఎ. చేతులు కలపడం బి. హత్తుకోవడం
సి. కట్టెలమోపు డి. కలసి ఉండటం

6. సేంద్రీయ వ్యవసాయంలో ముఖ్యలక్షణం?
ఎ. స్థానిక వనరులను వినియోగించుకోవడం
బి. రసాయనిక ఎరువులను వాడటం
సి. రసాయనిక క్రిమిసంహారకాలు వాడటం
డి. ఆధునిక పద్ధతుల వినియోగం

7. 2015 నాటికి మొత్తంగా సేంద్రీయ వ్యవసాయానికి మారాలని నిర్ణయించుకున్న మొదటి రాష్ట్రం?
ఎ. గోవా బి. ఉత్తరాఖండ్
సి. సిక్కిం డి. కేరళ

8. భారతదేశంలో మొత్తం సాగుభూమిలో వర్షాధార భూమి?
ఎ. 9.2 కోట్ల హెక్టార్లు బి. 5.1 హెక్టార్లు
సి. 8.1 హెక్టార్లు డి. 19.2 హెక్టార్లు

9. హరిత విప్లవం వల్ల లాభపడిన, నష్టపోయిన పంటలు?
ఎ. గోధుమ-వరి బి. గోధుమ-పప్పులు
సి. గోధుమ-జొన్న డి. వరి-జొన్న

10. దోమల నియంత్రణ కోసం డిడిటి పిచికారీ చేయడం వల్ల మనుషులపై పక్షులపై పడే ప్రభావాన్ని 1962లో సైలెంట్ స్ప్రింగ్ అనే పుస్తకం ద్వారా తెలిపిన వారు?
ఎ. రాచెల్ బి. రాబర్ట్‌సన్
సి. రాచెల్ కార్సన్ డి. రాక్‌ఫెల్లర్

11. జాతీయ పోషకార సంస్థ సర్వే ప్రకారం 1-15 సంవత్సరాల వయస్సు పిల్లల్లో అల్పబరువు కలిగిన వారి శాతం ?
ఎ. 40 % బి. 42 % సి. 44 % డి. 45 %

12. అల్ప బరువుతో బాధపడుతున్న పిల్లలు అతితక్కువగా గల రాష్ట్రం?
ఎ. బీహార్ బి. గుజరాత్
సి. కేరళ డి. సిక్కిం

13. శరీరబరువు సూచి (బాడీ మాస్ ఇండెక్స్)ని ఎలా కొలుస్తారు?
ఎ. బిఎంఐ - బరువు/ఎత్తు
బి. బిఎంఐ - జనాభా/ఆదాయం
సి. బిఎంఐ - పొడవు/బరువు
డి. ఏదీకాదు

14. స్త్రీ-పురుషులలో పోషకాహార స్థాయిని కొలవడానికి వినియోగించే సూచీ?
ఎ. ఎంబిఐ బి. బిఎంఐ
సి. ఎండిఐ డి. హెచ్‌పిఐ

15. అంత్యోదయ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి నెలకు ఎన్ని కిలోల ఆహారధాన్యాలు అందుతాయి?
ఎ. 30 కిలోలు బి. 35 కిలోలు
సి. 40 కిలోలు డి. 25 కిలోలు

16. భారతదేశంలో తలసరి ఆహారధాన్యాల లభ్యత రోజు రోజుకూ ...
ఎ. పెరుగుతోంది బి. తగ్గుతోంది
సి. బాగా పెరుగుతోంది డి. స్థబ్ధతగా ఉంది

17. పేదరికాన్ని అంచనా వేయడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వరుసగా ఎన్ని కాలరీల ఆహారాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు?
ఎ. 2100-2400 బి. 2400-2100
సి. 2300-2100 డి. 2000-2400

18. సంవత్సరానికి లభ్యతలో ఉన్న ఆహారధాన్యాలు అనగా?
ఎ. సంవత్సర ఆహారధాన్యాల ఉత్పత్తి
బి. నికర దిగుమతులు
సి. ప్రభుత్వ నిల్వలు
డి. సంవత్సర ఆహారధాన్యాల ఉత్పత్తి + నికర దిగుమతులు- ప్రభుత్వ నిల్వలలో తేడా

19. కనీస మద్దతుధరను ప్రకటించేవారు?
ఎ. ప్రభుత్వ ఆహారసంస్థ
బి. విత్తనాభివృద్ధి సంస్థ
సి. వ్యయాల కమిషన్
డి. వ్యవసాయ వ్యయాలు మరియు ధరల కమిషన్

20. ఐడిఏ అనగా...?
ఎ. ఇండియా డెవలప్‌మెంట్ అసోసియేషన్
బి. అంతర్జాతీయ అభివృద్ధి సంఘం
సి. అంతర్జాతీయ దారిద్ర్య సంఘం
డి. అంతర్జాతీయ ద్రవ్య సంఘం


21. 7వ నెంబర్ జాతీయ రహదారి ఈ రాష్ట్రం గుండా ప్రయాణించదు?
ఎ. ఉత్తరప్రదేశ్ బి. తెలంగాణ
సి. పశ్చిమబెంగాల్ డి. తమిళనాడు

22. 7వ నెంబర్ జాతీయ రహదారి యొక్క మరో (నూతన) నెంబర్?
ఎ. 43 బి. 44 సి. 45 డి. 46

23. ఎపిఎస్ ఆర్‌టిసి ఆర్డినరీ బస్సులకు ఉన్న పేరు?
ఎ. గ్రామీణ వెలుగు బి. తెలుగు వెలుగు
సి. ఆంధ్ర వెలుగు డి. ప్రగతి వెలుగు

24. టిఐఎంఎస్ అనగా..?
ఎ. టిక్కెట్ ఇంటరెస్ట్ మెషీన్ సిస్టమ్
బి. టైమ్ ఇంటిగ్రేషన్ మెషీన్ సిస్టమ్
సి. టిక్కెట్ ఇష్యూయింగ్ మెషీన్ సిస్టమ్
డి. టిక్కెట్ ఇంటలెక్చువల్ మెషీన్ సిస్టమ్

25. ఈ కింది వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు సర్వీసు కానిది?
ఎ. గరుడ
బి. ఇంద్ర
సి. సూర్య
డి. తెలుగు వెలుగు



26. ఆంధ్రప్రదేశ్‌లోని రైలు మార్గాలు ఈ జోన్‌కు చెందుతాయి?
ఎ. ఉత్తర రైల్వే
బి. తూర్పు రైల్వే
సి. పశ్చిమ రైల్వే
డి. దక్షిణ మధ్య రైల్వే

27. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే స్టేషన్లు?
ఎ. 550
బి. 650
సి. 750
డి. 850

28. ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద ఓడరేవు?
ఎ. కాకినాడ బి. కృష్ణపట్నం
సి. విశాఖపట్నం డి. గంగవరం

29. ఆంధ్రప్రదేశ్‌లో రోడ్లపై తిరిగే వాహనాలలో అత్యధికం ఈ రకానికి చెందినవి?
ఎ. కార్లు బి. లారీలు
సి. ఆటో రిక్షాలు డి. ద్విచక్ర వాహనాలు

30. రోడ్డు భద్రతా వారోత్సవాలు రవాణా శాఖ ప్రతి సంవత్సరం ఎప్పుడు నిర్వహిస్తుంది?
ఎ. జనవరి మొదటివారం
బి. ఫిబ్రవరి మొదటివారం
సి. మార్చి మొదటివారం
డి. ఏప్రిల్ మొదటివారం

31. ఆంధ్రప్రదేశ్‌లోని సంతల సంఖ్య ?
ఎ. 10,000 బి. 15,000
సి. 20,000 డి. 25,000

32. చిత్తూరు జిల్లా చంద్రగిరిలో సంత జరిగే రోజు?
ఎ. ఆదివారం బి. సోమవారం
సి. మంగళవారం డి. బుధవారం

33. చిత్తూరు జిల్లాలో సంతలు జరిగే రోజులు-ప్రదేశాలకు సంబంధించి తప్పుగా జతను గుర్తించండి?
ఎ. కలికిరి-సోమవారం బి. మదనపల్లి-మంగళవారం
సి. నగరి-శుక్రవారం డి. రేణిగుంట-బుధవారం

34. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తిదారులను నేరుగా వినియోగదారులను కలపడానికి ప్రారంభించినది?
ఎ. రైతుబంధు బి. అప్నా బజార్
సి. రైతుబజార్ డి. రైతుమార్కెట్

35. రైతు బజారులలో రైతులతో దుకాణాలు వీరికి కేటాయిస్తారు?
ఎ. మిల్లర్ బి. స్వయం సహాయక సంఘాలకు
సి. కమీషన్ ఏజెంట్లు డి. వ్యాపారస్తులకు

36. రైతు బజార్‌లో ధర ఈ విధంగా నిర్ణయిస్తారు?
ఎ. టోకు వర్తకుని ధర కంటే 0% అధికం, చిల్లర వర్తకుని ధర కంటే 10 శాతం తక్కువ.
బి. టోకు వర్తకుని ధర కంటే 25 శాతం అధికం, చిల్లర వర్తకుని ధర కంటే 25 శాతం తక్కువ.
సి. టోకు వర్తకుని ధర కంటే 30 శాతం అధికం, చిల్లర వర్తకుని ధర కంటే 30 శాతం తక్కువ.
డి. టోకు వర్తకుని ధర కంటే 40 శాతం అధికం, చిల్లర వర్తకుని ధర కంటే 40 శాతం అధికం.

37. వ్యవసాయ మార్కెట్ యార్డులలో ప్రారంభ కనీసధర దీనితో ప్రారంభమవుతుంది?
ఎ. గిట్టుబాటు ధర బి. మద్దతు ధర
సి. సేకరణ ధర డి. జారీ ధర

38. కనీస మద్దతు ధరలు ప్రకటించేది?
ఎ. రైతులు బి. వ్యవసాయ మార్కెట్ యార్డులు
సి. ప్రభుత్వం డి. కొనుగోలుదారులు

39. కనీస మద్దతు ధర కంటే ధరలు క్షీణించినప్పుడు పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఈ సంస్థ ద్వారా కొనుగోలు చేస్తుంది?
ఎ. ఐసిఎఆర్ డి. ఎఫ్‌సిఐ
సి. ఇక్రిశాట్ డి. భారత గిడ్డంగి సంస్థ

40. వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు చేసిన వర్తకులు చెల్లించాల్సిన రుసుం?
ఎ. నూటికి రూ.1 బి. నూటికి రూ.2
సి. నూటికి రూ.3 డి. నూటికి రూ.4

సమాధానాలు : 1.డి, 2.సి, 3.బి, 4.ఎ, 5.బి, 6.ఎ, 7.సి, 8.ఎ, 9.బి, 10.సి, 11.డి, 12.సి, 13.ఎ, 14.బి, 15.బి, 16.బి, 17.బి, 18.డి, 19.డి, 20.బి, 21.సి, 22.బి, 23.బి, 24.సి, 25.సి, 26.డి, 27.బి, 28.సి, 29.డి, 30.డి, 31.డి, 32.ఎ, 33.డి, 34.సి, 35.బి, 36.బి, 37.బి, 38.సి, 39.బి, 40.ఎ. ★

ఐడీబీఐ బ్యాంకులో 760 ఉద్యోగాలు

ఐడీబీఐ బ్యాంకు 760 ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులు మూడేళ్ల కాంట్రాక్టు వ్యవధిలో పనిచేయాల్సి ఉంటుంది. దీన్ని విజయవంతంగా పూర్తిచేసుకుంటే అభ్యర్థి పనితీరు, ప్రవర్తన ఆధారంగా అసిస్టెంట్ మేనేజర్ (గ్రేడ్ ఏ) హోదాలో నియమిస్తారు.

పోస్టు: ఎగ్జిక్యూటివ్. **మొత్తం ఖాళీలు:** 760 (ఎస్సీ-122+ఎస్టీ-56+ఓబీసీ-202+ అన్‌రిజర్వ్‌డ్-380).

వేతనం: కాంట్రాక్టు వ్యవధిలో మొదటి ఏడాది రూ.17,000, రెండో ఏడాది రూ.18,500, మూడో ఏడాది రూ.20,000. కాంట్రాక్టు వ్యవధి విజయవంతంగా పూర్తిచేస్తే అసిస్టెంట్ మేనేజర్ (గ్రేడ్ ఏ) హోదా వేతనశ్రేణి అందుతుంది.

అర్హతలు: కనీసం 60 శాతం (ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగుల కేటగిరీలకు 55 శాతం) మార్కులు/ తత్సమాన గ్రేడ్‌తో ఏదైనా డిగ్రీ/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత.

వయసు: 2018, జనవరి 1 నాటికి 20-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీలకు నిబంధనల మేర గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ప్రి-రిక్రూట్‌మెంట్ మెడికల్ టెస్ట్.

రాతపరీక్ష విధానం: దీన్ని ఆన్‌లైన్ విధానంలో 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో టెస్ట్ ఆఫ్ రీజనింగ్, టెస్ట్ ఆఫ్ వర్కింగ్ విత్ ఇంగ్లీష్ లాంగ్వేజ్, టెస్ట్ ఆఫ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 50 చొప్పున మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 1/4వ వంతు మార్కు కోత విధిస్తారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. రాతపరీక్షలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థుల మెరిట్ జాబితా నుంచి డాక్యుమెంట్ వెరిఫికేషన్‌కు పిలుస్తారు. అనంతరం ప్రి-రిక్రూట్‌మెంట్ మెడికల్ టెస్ట్ నిర్వహించి తుది ఎంపిక నిర్వహిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ఎస్టీ/వికలాంగులకు-రూ.150 (ఇంటిమేషన్ ఛార్జీ మాత్రమే), మిగిలిన అభ్యర్థులకు రూ.700 (అప్లికేషన్ ఫీ+ఇంటిమేషన్ ఛార్జీ).

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 28, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: www.idbi.com

ఉద్యోగాలు

రైల్వేలో 62,907 గ్రేడ్-4 పోస్టులకు నోటిఫికేషన్

దేశంలోని రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు (ఆర్‌ఆర్‌బీలు) 62,907 గ్రేడ్ -4 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేశాయి.

అర్హత: కొన్నింటికి పదోతరగతి, మిగతా వాటికి పదో తరగతితోపాటు ఐటిఐ ఉత్తీర్ణత.

పోస్టులు: ట్రాక్‌మెన్, గేట్‌మెన్, స్విచ్‌మెన్, ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ సిగ్నల్/ టెలి కమ్యూనికేషన్ విభాగాల్లో హెల్పర్స్, పోర్టర్ .

వయసు: 2018 జులై 1 నాటికి 18 నుంచి 31 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వేషన్ అభ్యర్థులకు నిబంధనల మేరకు సడలింపులు ఉంటాయి.

వేతనం: ఉద్యోగాలకు ఎంపికైన వారు నెలకు రూ. 18 వేల వేతనంతో పాటు అలవెన్సులు పొందుతారు.

దరఖాస్తు తేదీలు: మార్చి 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

వెబ్‌సైట్: http://rrbsecunderabad.nic.in

'23న చలో గుంటూరు'

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్/గుంటూరు/తుళ్లూరు

గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు దళితులపై దాడి కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేసి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ఈనెల 23న నిర్వహించే చలో గుంటూరును జయప్రదం చేయాలని ఎపిసిఎల్‌సి రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. దాడి జరిగి 45 రోజులవుతున్నా.. ప్రధాన నిందితులను అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. దళితులకు సంఘీభావంగా సిపిఐ జిల్లా కార్యదర్శి జె.అజయ్‌కుమార్ మాట్లాడారు. అంతకుముందు డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రమిచ్చారు. అనంతరం తుళ్లూరు మండలం మల్కాపురం కార్మిక కేంద్రంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళిత, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.

ర్యాలీ

నీరవ్ మోడీ రూ.11,500 కుంభకోణంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిపిఎం అనంతపురం ఉత్తర ప్రాంత జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



కుంభకోణాలను ప్రోత్సహిస్తున్న మోడీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మోడీ ప్రభుత్వం కుంభకోణాలను ప్రోత్సహిస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తోందని సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పేర్కొన్నారు. నీరవ్ మోడీ రూ.11,500 కుంభకోణంపు కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక టవర్‌క్లాక్ సర్కిల్ నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా టవర్‌క్లాక్ చేరుకుని పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ప్రభుత్వం లూటి పరులను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ఎగవేతదారులు వేల కోట్ల రూపాయలు కుంభకోణం చేసి విదేశాలకు పారిపోయి తలదాచుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

లలిత్‌మోడీ రూ.6 వేల కోట్లు, విజయ్‌మాల్యా రూ.9 వేల కోట్లు, నీరవ్ మోడీ 11,552 కోట్లు కుంభకోణాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం మాత్రం ప్రేక్షక పాత్ర పోషించడం సిగ్గు చేటన్నారు. దేశభక్తి పేరుతో జరుగుతున్న దేశ లూటీని ప్రజలు అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. కుంభకోణం డబ్బులను తక్షణమే రికవరీ చేసి నిందితులను శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లక్ష్మిదేవి, వి.సావిత్రి, సిపిఎం నాయకులు బిహెచ్.రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

20న విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె

- మద్దతు ప్రకటించిన సిపిఎం
- ఐక్య పోరాటాలతోనే న్యాయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రాక్టు ఉద్యోగుల ఓట్ల కోసమే ఎన్నికల ముందు తెలుగుదేశం హామీలను ఇచ్చిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ విమర్శించారు. రాష్ట్రంలోని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ఈ నెల 20 నుంచి సమ్మె చేపట్టనున్న నేపథ్యంలో ఎపి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యుత్ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఐక్య పోరాటాతోనే న్యాయం జరుగుతుందన్నారు. కాంట్రాక్టు

ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని చెప్పి చంద్రబాబు ఉద్యోగులను మోసం చేశారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాన్ని మండలిలో ప్రస్తావిస్తే 2014లో మంత్రివర్గ ఉపసంఘం వేశారని, ఇప్పటి వరకూ నివేదిక ఇవ్వలేదని, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టలేదని గుర్తు చేశారు. సమాన పనికి సమాన వేతనం, ప్రసూతి సెలవుల వంటి అంశాలన్నింటినీ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వామపక్ష ప్రజాతంత్ర పోరాటాలే రాష్ట్రాభివృద్ధికి పరిష్కారమనే నినాదాన్ని ఇటీవల భీమవరంలో నిర్వహించిన సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలో ప్రజల ముందుంచామని తెలిపారు. అన్ని డిమాండ్లను ప్రభుత్వ నెరవేర్చే వరకూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల వెంటే ఉంటామన్నారు.


విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంవిఎస్ శర్మ

అన్ని పార్టీలు సహకారం అందించాలి

విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టనున్న సమ్మెకు అన్ని పార్టీలు సహాయ సహకారాలు అందించాలని ఎపి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక చైర్మన్ కాశీ మధుబాబు, ప్రధాన కార్యదర్శి ఎం బాలకాశి కోరారు. ఈ నెల 20లోపు ప్రభుత్వ నిర్ణయం రాని పక్షంలో సమ్మెలోకి వెళ్లాలని, డిమాండ్లు సాధించుకునేవరకూ ఉద్యమించాలని నిర్ణయించామన్నారు. కార్మిక చట్టాల ఉల్లంఘన, రాజ్యాంగ ఉల్లంఘన, మానవ హక్కుల ఉల్లంఘనకు కారణమవుతున్న మూడో పార్టీ కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి నేరుగా జీతాలివ్వాలని, సుప్రీం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దశల వారీ క్రమబద్ధీకరణ చేయాలని, పీస్ రేటును రద్దు చేయాలని కోరారు. ఈ నెల 17 నుంచి విజయవాడతో పాటు జెన్‌కో స్టేషన్లలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని, 19న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని అన్ని పార్టీలు ఇందుకు మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వెంకట సుబ్బయ్య, యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నాగ బ్రహ్మచారి, సిఐటియు రాష్ట్ర నాయకులు ముజఫర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే హోదా సాధ్యం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-పెద్దాపురం (తూర్పుగోదావరి)

ఐక్య ఉద్యమాల ద్వారానే రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధ్యమవుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు దడాల సుబ్బారావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలోని యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి, మోడీ నిర్ణయాలకు మద్దతుగా టిడిపి భజన చేయడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని విమర్శించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్ల ప్రత్యేక హోదా అని ప్రకటిస్తే, అధికారంలోకొస్తే పదేళ్ల ప్రత్యేకహోదా అని ప్రకటించిన బిజెపి, 10 కాదు 15 ఏళ్లు ప్రత్యేక హోదా అమలు చేయాలని డిమాండ్ చేసిన టిడిపి అధికారంలోకొచ్చాక రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచాయన్నారు. ప్రత్యేకహోదా వస్తే 90 శాతం నిధులు కేంద్రం భరిస్తుందన్నారు. రాష్ట్రంలో మౌలిక వసతులు కల్పించబడతాయన్నారు. రాష్ట్రంలోని పార్టీలన్నీ జెఎసిగా ఏర్పడి సమైక్యంగా ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. దీనికి సిపిఎం అన్ని విధాలా మద్దతు తెలుపుతూ ఉద్యమాల్లో భాగస్వాములవుతుందన్నారు. పవన్ కల్యాణ్ ఏర్పాటు చేస్తున్న సమావేశాలు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు కాకుండా మరొకరి ప్రయోజనాల కోసమైతే లక్ష్యం నిర్వీర్యమవుతుందన్నారు. ఐక్య ఉద్యమాల్లో పవన్ కల్యాణ్ భాగస్వామి అయితే ప్రత్యేక హోదా సాధ్యమవుతుందని అన్నారు.

రిజర్వేషన్లను చిత్తశుద్ధితో అమలు చేయాలి

కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం (తూర్పుగోదావరి)

కాపులకు చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్లు ఇస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని చిత్తశుద్ధితో నెరవేర్చాలని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా ఉప్పలగుప్తంలో కాపు జెఎసి నాయకుడు ఆకుల సూర్యనారాయణమూర్తి ఇంటి వద్ద శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు రిజర్వేషన్ల చట్టబద్ధతపై పత్రికల్లో వస్తున్న కథనాల వల్ల అనేక అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. రిజర్వేషన్లను గవర్నర్ సంతకంతో రాష్ట్ర పరిధిలో అమలు చేయొచ్చని న్యాయవాదులు చెబుతున్నారని గుర్తు చేశారు. తొలుత రాష్ట్రంలో రిజర్వేషన్లు అమలుచేసిన తరువాత ఆపై కేంద్రానికి 9వ షెడ్యూల్‌లో పొందుపరచడానికి పంపాల్సి ఉంటుందన్నారు. చంద్రబాబు కాపు రిజర్వేషన్లను రాష్ట్ర పరిధిలో అమలుచేయకుండా నేరుగా రాష్ట్రపతి అనుమతికి పంపించారన్నారు. కేంద్రం లేవనెత్తిన అభ్యంతరాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత సిఎంపైనే ఉందన్నారు. ఈ సమావేశంలో కాపు జెఎసి నాయకులు నల్లా విష్ణుమూర్తి, కల్వకొలను తాతాజీ, చీకట్ల అబ్బాయి, శిరంగు బాబు పాల్గొన్నారు.

చెన్నైలో తేలప్రోలు యువతిపై అత్యాచారం

ప్రజాశక్తి- మొగల్రాజపురం(విజయవాడ)

తమిళనాడులో దారుణ సంఘటన చోటు చేసుకుంది. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన ఓ యువతిపై గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి దాడి, అత్యాచారానికి పాల్పడిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. తేలప్రోలు గ్రామానికి చెందిన యువతి తమిళనాడులోని కామచిపు జిల్లా తాలంబూరులోని ఓ ఐటి కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. సోమవారం విధులు ముగించుకుని తన గదికి స్కూటీపై వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆమెపై ఐరన్ రాడ్‌తో దాడి చేశారు. ఆ తర్వాత ఆమెపై అత్యాచారం చేశారు. బాధితురాలి వద్ద ఉన్న ఐఫోన్, బంగారం నగలను దోచుకుని నిందితులు అక్కడ నుండి పరారయ్యారు. ఆమె వాహనాన్ని మాత్రం అక్కడే వదిలేశారు. దుండగులు వెళ్ళిపోయిన తర్వాత రోడ్డు మీదకు వచ్చిన బాధితురాలు స్పృహ తప్పి పడిపోయింది. దారిలో వెళ్తున్న వారు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్కూటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో తమిళనాడు పోలీసులు మంగళవారం విజయవాడ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో విజయవాడ పోలీసులు బాధితురాలి తల్లిదండ్రులను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా వారు అందుబాటులో లేరని తెలిసింది. బాధితురాలి సోదరికి సమాచారం అందించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రాజీనామాల డ్రామాలు ఆపండి : కాంగ్రెస్

ప్రజాశక్తి-నూజివీడు (కృష్ణా)

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు పోతోందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సుంకర పద్మశ్రీ పేర్కొన్నారు. కృష్ణాజిల్లాలోని నూజివీడు కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆమె మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకులను, ఇతర పార్టీ నాయకులను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తేవాలని,నాయకులు రాజీనామా డ్రామాలు మానుకుని, హోదా కోసం డిమాండ్ చేయాలన్నారు.

అంగన్‌వాడీల నెత్తిన బయోమెట్రిక్

- వేలిముద్ర వేస్తేనే వేతనం
- ఆ కేంద్రాల సంఖ్య కుదించే కుట్ర

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అమలు చేసిన బయోమెట్రిక్ విధానాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ అమలు చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. వేలిముద్ర వేస్తేనే వేతనమంటూ మెలిక పెడుతోంది. పాఠశాలకు వచ్చి, వెళ్లేటప్పుడు బయోమెట్రిక్‌లో సంతకం పెట్టాల్సిందేనని ఇటీవలే ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని పనులూ పూర్తయ్యాక మార్చి ఒకటో తేదీ నుంచి దీన్ని అమలు చేయాలని చూస్తోంది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న వర్కర్లు, హెల్పర్లు సమీపంలోని ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి, అక్కడున్న బయోమెట్రిక్ యంత్రంలో హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. సిడిపిఒలు, సూపర్‌వైజర్లు సమీపంలోని ఎంపిడిఒ కేంద్రాల్లో వేయాల్సి ఉంది. ఈ మేరకు అంగన్‌వాడీల సమాచారాన్ని ఈ యంత్రాలకు అనుసంధానం చేయనున్నారు. ఆధార్‌నెంబర్ ఆధారంగా వేలి ముద్రలు వేసే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు. ఇది పూర్తయ్యాక హాజరు నమోదును బట్టి అంగన్‌వాడీలను ఎబిసి గ్రేడులుగా విభజించనున్నారు. 90 శాతం కన్నా ఎక్కువగా వస్తే ఏ-గ్రేడ్‌గాను, 70 శాతం లోపు అయితే బి-గ్రేడ్‌గాను, 50 శాతం కన్నా తక్కువగా సి గ్రేడ్‌గా విభజించనున్నారు. సి గ్రేడ్ వచ్చిన వారికి రెండు, మూడు సార్లు హెచ్చరించి తరువాత వారి జీతాలకు లింకు పెట్టనున్నారు. భవిష్యత్తులో జరిగే వేతనాల పెంపు, ఉద్యోగోన్నతులు వంటి అంశాలన్నిటికీ ఇదే కీలకం కానుంది.



సాధ్యమయ్యేనా..?

అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలకు కిలోమీటర్ల మేర దూరంగా ఉన్నాయి. సగానికి పైగా గ్రామాల్లోనూ ఇదే సమస్యగా మారనుంది. ఉదాహరణకు చిత్తూరు జిల్లాలో 4,500 కేంద్రాలున్నాయి. వీటిల్లో 30 శాతం స్కూళ్లకు మాత్రమే ప్రాథమిక పాఠశాలలకు దగ్గర్లో ఉన్నాయి. మిగిలిన వాటికి వెళ్లాలంటే రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిందే. ఇంటర్‌నెట్ సమస్యలు ఉత్పన్నమైనప్పుడు హాజరునమోదు వరకు వర్కర్లు బయోమెట్రిక్ యంత్రాల వద్దే పడిగాపులు కాయాల్సి ఉంటుంది. ఆ సమయాల్లో అంగన్‌వాడీల్లోని పిల్లల పరిస్థితి ఎలా అని వర్కర్లు ప్రశ్నిస్తున్నారు. సగం పాఠశాలల్లో ఇప్పటికే ఈ యంత్రాలు పని చేయడం లేదు.

అంగన్‌డీలకు నోటీసులను నిరసిస్తూ ధర్నాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొన్నందుకు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యాన ఏలూరు, కొయ్యలగూడెం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం తహశీల్దార్ కార్యాలయాల వద్ద శుక్రవారం ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీలు మాట్లాడుతూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా జనవరి 23న సమ్మె నిర్వహించామని చెప్పారు. దానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈనెల 7న సిడిపిఒలు అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులను జారీ చేశారని చెప్పారు. సమ్మె చేయడానికి రెండు వారాల ముందుగానే ఐసిడిఎస్ రాష్ట్ర కమిషనర్‌కు, రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శికి, కార్మికశాఖ కమిషనర్‌కు సమ్మె నోటీసులు ఇచ్చామని గుర్తు చేశారు. నోటీసు ఇచ్చిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమ్మెను నిషేధించలేదని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో సిడిపిఒలు నోటీసులు ఇవ్వడం చట్టవిరుద్ధమని, అప్రజాస్వామికమన్నారు. అనంతరం తహశీల్దార్లకు వినతిపత్రాలను అందజేశారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

అర్చక ఆత్మావలోకన సదస్సులో ఆత్రేయబాబు

ప్రజాశక్తి - భవానీపురం (విజయవాడ)

రాష్ట్రంలోని హిందూ దేవాలయాల్లో అర్చకులు ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమం చేయక తప్పదని ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి అగ్నిహోత్రం ఆత్రేయబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు విస్మరించిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఎపి అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ గొల్లపూడి అయ్యప్ప కళ్యాణ మండపంలో రాష్ట్ర అర్చకుల 'ఆత్మావలోకన సదస్సు' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఏపి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనందసూర్య, పలువురు దేవాదాయ, ధర్మాదాయ శాఖాధికారులను ఆహ్వానించగా వీరిలో ఒక్కరూ పాల్గొనకపోవడంతో అర్చక సమాఖ్య సభ్యులు మండిపడ్డారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు యడ్లపాటి రఘునాథ్‌బాబు మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆత్రేయబాబు మాట్లాడుతూ 2014 ఏప్రిల్ నెలలో ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య నిర్వహించిన అర్చక శంఖారావం సందర్భంగా టిడిపి, బిజెపి చేసిన ఎన్నికల వాగ్దానాల్లో కొన్ని అంశాలు నేటి వరకూ పరిష్కరించలేదన్నారు. దేవాదాయ సవరణ చట్టం 33/2007ను అనుసరించి 2014 సాధారణ ఎన్నికల్లో చేసిన వాగ్దానాలకనుగుణంగా 2017 ఫిబ్రవరి 16న జారీ అయిన జిఒఎంఎస్.76 నోటిఫికేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్చకులకు కనీసం గౌరవ భృతి నెలకు రూ.15 వేలు చెల్లించాలని, వంశ పారంపర్యంగా అర్చకుల పేర్లు వెంటనే నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్లుగా హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. టిటిడి నుండి కనీసవేతన నిధికి దేవాదాయ శాఖ కోరినట్లుగా రూ.500 కోట్లు జమ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ధూప, దీప, నైవేద్యం పథకం అమలుకు ఎంపిక చేయబడ్డ అన్ని ఆలయాల్లో బకాయిలను వెంటనే చెల్లించాలని, కొత్తగా వెయ్యి ఆలయాలను కూడా ఎంపిక చేసి వాటికి కూడా నెలకు కనీసం రూ.6 వేలు చెల్లించాలని కోరారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు యడ్లపాటి రఘునాథ్‌బాబు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని, దేవాలయాల పరిరక్షణకు పాటుపడుతున్న అర్చకుల న్యాయమైన కోర్కెలను నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలను మంత్రి మాణిక్యాలరావు దృష్టికి తీసుకెళ్ళి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు దీవి కోదండరామశర్మ, కార్యనిర్వాహక అధ్యక్షులు కంఠం నందీశ్వర్, సహాయ కార్యదర్శి నారాయణం బాల లక్ష్మీనరసింహాచార్యులు, కృష్ణా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అగ్నిహోత్రం ఫణిగోపాల్, మామిళ్ళపల్లి నాగేంద్రరావు, ఉత్తరాంధ్ర శాఖ అధ్యక్షులు రొంపిచర్ల సింగరాచార్యులు, టిటిడి దేవస్థానం వ్యాఖ్యత దివి జానకీరామాచార్యులు, భీమవరం కార్యదర్శి ఎం.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


అర్చక ఆత్మావలోకన సదస్సుకు హాజరైన వివిధ జిల్లాలకు చెందిన అర్చకులు

మతోన్మాదాన్ని నిరసిస్తూ ఆందోళన

ప్రజాశక్తి - నెల్లూరు

క్రైస్తవుల పవిత్ర గ్రంథం బైబిల్‌ను తగులబెట్టి, ఆ దుశ్చర్యలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన వారిని అరెస్టు చేసి శిక్షించాలని ఆలిండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు మోసస్ రఘు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మతోన్మాదాన్ని నిరసిస్తూ శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణలోని కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో జనవరి 27న క్రైస్తవులు బైబిల్స్‌ను ఔత్సాహికులకు పంచుతుండగా కొందరు మత ఛాందసవాదులు వారిని అడ్డగించి, చంపుతామని బెదిరించి, వారి చేతుల్లోని బైబిల్స్‌ను తగులబెట్టారన్నారు. ఇటువంటి చర్యల వల్ల క్రైస్తవుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే ఇటువంటి మతోన్మాద చర్యలను ప్రజాస్వామ్య వాదులు తీవ్రంగా ఖండించాలన్నారు. ర్యాలీలో పాల్గొన్న రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ బైబిల్‌ను తగులబెట్టిన మతఛాందసవాదులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఏ మతగ్రంథమైన సర్వ మానవాళి శ్రేయస్సును ఆకాంక్షిస్తుందన్నారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు కలెక్టర్ ముత్యాలరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు రవీంద్ర, సుధీర్‌బాబు, ఆశీర్వాదం, డాక్టర్ దినకర్, సుధాబాబు, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.


గుంటూరులో పకోడీలు, బజ్జీలు ఇస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వాల నాటకాలపై డివైఎఫ్ఐ వినూత్న నిరసన

ప్రజాశక్తి - కార్పొరేషన్ (గుంటూరు)

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల అమలు అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నాటకాలను నిరసిస్తూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బజ్జీలు, పకోడీలు అమ్ముతూ వినూత్న నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన వ్యక్తమైంది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న మోడీ, ఇంటికొక ఉద్యోగమన్న చంద్రబాబు.. వారి హామీలను అమలు చేయలేదని విమర్శించారు. పైగా పకోడి, బజ్జీలు అమ్ముకుని బతకొచ్చని ఉచిత సలహాలు ఇచ్చిన మోడీ, అమిత్‌షా పకోడీలు, బజ్జీలు వేసుకోవాలన్నా నూనె, పిండి, ఖర్చులకు నిరుద్యోగుల వద్ద డబ్బు లేనందున వాటికి నిధులిస్తే మంచిదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి.సురేష్‌బాబు, కె.సుందరయ్య, పి.సుగుణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.భగవాన్‌దాస్, సిఐటియు నాయకులు జె.నవీన్ ప్రకాష్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎంఆర్ దేవి, షకిలా పాల్గొన్నారు.

బహిరంగ సభ

కమ్యూనిస్టులను చట్టసభలకు పంపండి

- భవిష్యత్తులో ప్రజాతంత్ర, లౌకికశక్తుల ఐక్యపోరాటాలు
- బహిరంగ సభలో సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కమ్యూనిస్టులను అసెంబ్లీ, పార్లమెంట్‌కు పంపితేనే ప్రజల వాణి చట్టసభల్లో గట్టిగా వినిపించడం సాధ్యమవుతుందని, ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఐ నాయకులు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సుబ్రహ్మణ్య మైదానంలో శుక్రవారం సాయంత్రం సిపిఐ 24వ జిల్లా మహాసభల సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రావుల వెంకయ్య మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు హోదా విషయంలో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ విషయంలో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.ఓబులేసు మాట్లాడుతూ నీరవ్ మోడీ వంటివారు బ్యాంకులను మోసగించి వేల కోట్లు కొల్లగొట్టి విదేశాలకు పారిపోతుంటే మోడీ ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. సిపిఐ రాష్ట్రకమిటీ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికిప్రత్యేక హోదా వస్తే పారిశ్రామికవేత్తలే రాష్ట్రానికి క్యూ కడతారని, చంద్రబాబు కాళ్లరిగేలా తిరిగే పరిస్థితి ఉండదన్నారు. అంతకుముందు మున్సిపల్ స్టేడియం నుంచి సుబ్రహ్మణ్య మైదానం వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. మోడీ, చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి టి.మధు తదితరులు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరం సభలో అభివాదం చేస్తున్న సిపిఐ నేతలు

నేపాల్‌తో సంబంధాలున్నాయి.. సమస్యలూ ఉన్నాయి..

'ప్రజాశక్తి' కథనంపై స్పందించిన పోర్టు చైర్మన్ కృష్ణబాబు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

నేపాల్ దేశంతో విశాఖ పోర్టు మంచి సంబంధాలను నెలకొల్పుకొని కార్గో హేండ్లింగ్ వ్యాపారాన్ని చేపడుతోందని, అదే సందర్భంలో సర్టిఫికేషన్, డాక్యుమెంటేషన్ వంటి సమస్యలున్నాయని వైజాగ్ పోర్టు ట్రస్టు చైర్మన్ ఎమ్‌టి.కృష్ణబాబు వెల్లడించారు. శుక్రవారం ప్రజాశక్తి మెయిన్ ఎడిషన్‌లో 'నేపాల్‌తో వైజాగ్ పోర్టునుంచి నిలిచిన కార్గో' కథనంపై ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజు తప్పించి రోజు ఒక రేకు నేపాల్‌కు వెళ్తోందన్నారు. అయితే నేపాల్ కాన్సులేట్ ఇక్కడ ఏర్పాటు కావాలని డిమాండ్ ఉందని, దీనివల్ల డాక్యుమెంటేషన్ సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన అంగీకరించారు. ఖాట్మండ్‌లోని రాయబార కార్యాలయం ఎల్‌సి విడుదలలో కొంత జాప్యం చోటుచేసుకుంటున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కౌన్సిల్ కార్యాలయం విశాఖలో పెట్టాలని నేపాల్ ప్రభుత్వం కోరినప్పటికీ ఈ విషయాన్ని ప్రభుత్వం వద్ద ఉంచామని, అనుమతులు వస్తే ఏర్పాటు చేస్తామని చెప్పారు. కస్టమ్స్ అధికారులు ఫిజికల్ డాక్యుమెంట్ కావాలని అడగడం ఒక సమస్యగా మారినందున కార్గోకు కొంత సమస్య ఏర్పడిన విషయాన్ని ఒప్పుకున్నారు.అనంతరం పోర్టు ప్రగతిపై చైర్మన్ మాట్లాడుతూ 2017లో 61 మెట్రిక్ టన్నులు కార్గో చేయగా, 2018లో 64 మెట్రిక్ టన్నులవ్వనుందన్నారు. పిపిపి ప్రాజెక్టులో కొన్ని సమస్యలున్నాయని, కేబినెట్ ముందు వీటిని ప్రతిపాదన పెట్టామని, ఇవి పరిష్కారమైతే వైజాగ్ పోర్టు మరింత ప్రగతి సాధించగలదని ఆయన చెప్పారు.

అభ్యర్థులు ఆదాయ వనరులు వెల్లడించాలి : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఆదాయ వనరులను వెల్లడించాలని, తమతో పాటు తమ కుటుంబ సభ్యుల, తమపై ఆధారపడిన వారి ఆదాయ వివరాలు కూడా వెల్లడించాలని సుప్రీంకోర్టు శుక్రవారం పేర్కొంది. ఇప్పటివరకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలో తమ ఆస్తుల వివరాలతో మాత్రమే అఫిడవిట్లు సమర్పించేవారు. ఆదాయ వనరుల వివరాలు ఇచ్చేవారు కాదు. ఇకపై అలా కుదరదు. పదవిలోకొచ్చిన తరువాత ఐదేళ్ళలో రాజకీయ నేతల ఆస్తులు అసాధారణంగా పెరిగిపోవడాన్ని ప్రముఖంగా పేర్కొంటూ లోక్ ప్రహరి అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన సుప్రీం బెంచ్ పై రూలింగ్ ఇచ్చింది.

పరీక్షా పే చర్చా



న్యూఢిల్లీలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

విద్యార్థులతో మోడీ ముఖాముఖి

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోడీ వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో భేటీ అయ్యేందుకు 'పరీక్షాపే చర్చా..' అన్న కార్యక్రమాన్ని ఎంచుకున్నారు. శుక్రవారం ఇక్కడి తల్కటోరా స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయే దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో వున్న విద్యార్థులతో పరీక్షలకు సంబంధించిన అంశాలపై ముఖాముఖి భేటీ అయ్యారు. ఈ భేటీలో ఆయన మాట్లాడుతూ 'మీరు భారత ప్రధానితో కాక మీ స్నేహితుల్లో ఒకరితో మాట్లాడుతున్నట్లు భావించండి' అని సూచించారు. తాను వారి ముందుకు విద్యార్థిగా వచ్చానని, తనకు ఎన్ని మార్కులు వేస్తారో చూస్తానని ఆయన చెప్పారు. తాను ఇప్పటికీ విద్యార్థిగా కొనసాగేందుకు స్ఫూర్తినిచ్చిన తన అధ్యాపకులకు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. తనలోని విద్యార్థిని సజీవంగా వుంచేందుకు వారే తనకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. 'ఎగ్జామ్‌కి బాత్' పేరుతో ఈ ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రధాని తన 'పరీక్షాయోధులు' పుస్తకాన్ని ఆవిష్కరించిన కొద్దిరోజులకే ఏర్పాటు చేయటం విశేషం. సంప్రదాయక మార్గంలో ప్రయాణిస్తూ ఎవరో ఒకరిగా మిగిలిపోయేందుకు ప్రయత్నించకుండా విద్యార్థులు తమ ప్రత్యేకతను నిలుపుకోవాలన్నారు. విద్యార్థులు 'వర్రీయర్లు'(ఆందోళన చెందేవారు)గా కాక వారియర్లు (పోరాట యోధులు)గా మారాలని ఆయన సూచించారు. పరీక్షలను పండుగలా భావించాలని, మనస్సు సంతోషంగా వుంటే పరీక్షల్లో మంచి మార్కులు సాధించటం అసాధ్యమేమీ కాదని ఆయన సూచించారు. కార్యక్రమం ప్రారంభంలోనే ఆయన 'ఇది ప్రధాని నరేంద్రమోడీ కార్యక్రమం కాదు.. దేశవ్యాప్తంగా వున్న కోట్లాది మంది విద్యార్థుల కార్యక్రమం' అని ప్రకటించారు.

నీరవ్, చోక్సీలపై ఎఫ్ఐఆర్ నమోదు

గీతాంజలి సంస్థలలో సోదాలు

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకును వేల కోట్ల రూపాయల మేరకు మోసం చేసిన కుంభకోణంలో గీతాంజలి గ్రూప్ అధినేత మెహుల్ ఛోక్సీ, బిలియనీర్ నీరవ్ మోడీలపై కేంద్ర విచారణ సంస్థ (సిబిఐ) ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. వీరు మోసానికి పాల్పడిన కారణంగా పంజాబ్ నేషనల్ బ్యాంకుకి రూ. 4,887 కోట్లు నష్టం వాటిల్లినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. చోక్సీ, అతని మూడు కంపెనీలైన గీతాంజలి జెమ్స్, గిలి ఇండియా, నక్షత్ర బ్రాండ్‌లిమిటెడ్ కంపెనీలపై సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ముంబైలోని బ్రాడీహౌస్ సబ్ కార్పోరేట్ బ్రాంచిలో డిప్యూటీ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టి, ఆయన సహాయకుల ద్వారా గీతాంజలి కంపెనీలు ఫారిన్ లెటర్స్‌తో విదేశాల నుండి రుణాలు పొందాయని ఏజన్సీ ఆరోపించింది. భారత్‌లోని ఓవర్సీస్ బ్రాంచి నుండి పెద్ద మొత్తాలలో నగదును జారీ చేసినట్లు, కంపెనీల రుణాలను చెల్లించినట్లు తెలిపింది. అయితే ఈ కుంభకోణం వెలుగులోకి రాకముందే చోక్సీ జనవరి 4న, నీరవ్ భార్య, ఆమె సోదరుడు జనవరి 6న విదేశాలకు పలాయనం చిత్తగించారు. సిబిఐ ఇంటర్‌పోల్ ద్వారా విదేశాలలో ఎక్కడ వున్నారో గుర్తించడానికి ప్రయత్నిస్తోంది. దీంతో సిబిఐ గీతాంజలి సంస్థల డైరెక్టర్లకు నోటీసులను జారీ చేశారు. బ్యాంకుల ద్వారా మోసపూరిత లావాదేవీలతో రూ. 11,500 కోట్లు కాజేసినట్లు నమోదైంది. జనవరి 31న చోక్సీ రూ. 280 కోట్లు పొందినట్లు సిబిఐ కేసు నమోదుచేసింది. చోక్సీ, నీరవ్‌కు సంబంధించి ఐదు రాష్ట్రాలలోని ఆరు నగరాలలో 20 ప్రాంతాలలో సిబిఐ సోదాలు నిర్వహిస్తున్నట్లుగా ఏజన్సీ తెలిపింది. గీతాంజలి గ్రూప్ సంస్థలకు చెందిన కంపెనీలలో, వాటి డైరెక్టర్లయిన ముంబయి, పూనె, సూరత్, రాజస్తాన్, తమిళనాడులోని కొయంబత్తూర్‌లలోని వారి ఇళ్లలో కూడా సోదాలు నిర్వహిస్తున్నట్లు సిబిఐ అధికారి తెలిపారు. అంతేకాక ఆ గీతాంజలి కంపెనీలు నిర్వహిస్తున్న పలు ఫ్యాక్టరీలలో కూడా సోదాలు చేస్తున్నట్లు తెలిపారు.

రంగారెడ్డిలో రూ.3 వేల కోట్ల వజ్రాలు సీజ్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, రావిరాలలోని రాజీవ్ జెమ్స్ పార్కులోని గీతాంజలి గ్రూప్ డైమండ్ జ్యువెలరీ యూనిట్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు సోదాలు నిర్వహించారు. సుమారు రూ.3 వేల కోట్ల విలువ చేసే వజ్రాలు, వజ్రాభరణాలు సీజ్ చేశారు. వజ్రాల వ్యాపారంలో భాగంగా నీరవ్ మోడీ హైదరాబాద్ జెమ్స్ సెజ్‌లో 2007 నుంచి గీతాంజలి గ్రూప్ పేరుతో వజ్రాభరణాల తయారీ యూనిట్‌ను అతని అల్లుడిని పెట్టి నిర్వహిస్తున్నాడు. బ్యాంక్‌కు రుణం ఎగ్గొట్టిన నేపథ్యంలో ఇడి అధికారులు సోదాలు చేసి లాకర్లను సీజ్ చేశారు. దీంతో ఈ యూనిట్‌లో పని చేస్తున్న 900 మంది కార్మికుల ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది. మహేశ్వరం మండలం రావిరాల రెవెన్యూ పరిధిలోని 1/1 సర్వే నెంబర్‌లో 170 ఎకరాల్లో రాజీవ్ జెమ్స్ కంపెనీని (సెజ్) స్పెషల్ ఎకనామికల్ జోన్ కింద 2005 నవంబర్ 26న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఇక్కడ వజ్రాలను శుభ్రం చేసి, పాలిషింగ్ నాణ్యతతో కూడిన కటింగ్‌లతో దేశ విదేశాలకు ఎగుమతి చేసేవారు. నీరవ్ మోడీ నిర్వాకంతో ప్రస్తుతం ఈ సెజ్‌లో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడనున్నాయి.

ప్రధానిపై రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ : కళంకిత వ్యాపార వేత్త నిరవ్ మోడీ దేశం వదిలి పారిపోవడంపై కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'స్కామ్ దారులు తప్పించుకునే ఫార్ములా అంటూ మోడి రాబ్స్ ఇండియా అనే హ్యాష్ ట్యాగ్‌తో ఒక ఫార్ములాను ట్వీట్ చేశారు. నిరవ్ మోడీ ప్రధాని మోడీతో తనకున్న పరిచయాన్ని ఉపయోగించుకుని రూ.12 వేల కోట్ల రూపాయలను దొంగిలించి దేశం వదిలి పారిపోతుంటే ఎన్డీయే ప్రభుత్వం దిక్కుకు చూస్తున్నదని గురువారం ఆయన ధ్వజమెత్తారు. నిరవ్ మోడీ కేసును విజయమాల్యా కేసుతో పోల్చి చెప్పారు.

త్రిపురలో రేపు పోలింగ్

ప్రజాశక్తి ప్రతినిధి – అగర్తల

ఈశాన్య రాష్ట్రం త్రిపురలో ఆదివారం జరిగే అసెంబ్లీ ఎన్నికలకుగాను సర్వం సిద్ధమైంది. మేఘాలయ, నాగాలాండ్‌లో ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లో బిజెపి మొదటిసారి అధికార, ధన బలంతో పోటీకి దిగింది. అందువల్ల ఈ రాష్ట్రాల్లోని పాలక పార్టీలు బిజెపి నుంచి నేరుగా సవాలును ఎదుర్కొంటున్నాయి.

సర్వశక్తులూ ఒడ్డిన బిజెపి

త్రిపురలో గెలవడానికి బిజెపి తొక్కని అడ్డదార్లంటూ లేవని లెఫ్ట్ నాయకత్వం ఆరోపిస్తున్నది. వేర్పాటువాద పార్టీతో అనైతిక పొత్తుపై విపక్షాలు మండిపడుతున్నాయి. 25 ఏళ్లుగా అసెంబ్లీలో సింగిల్ డిజిట్ లేని బిజెపి సర్వశక్తులూ ఉపయోగించి ప్రచారం చేసింది. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సహ కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, సీనియర్ నాయకులు 25 మంది, 100 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆ రాష్ట్రంలో పాగావేశారు.

బిజెపి –ఐపిఎఫ్‌టి పొత్తు

వేర్పాటువాద ప్రాంతీయ పార్టీ ఐపిఎఫ్‌టితో బిజెపి పొత్తు పెట్టుకుంది. మొత్తం అసెంబ్లీ 60 అసెంబ్లీ స్థానాలకుగాను బిజెపి 51, ఐపిఎఫ్‌టి 9 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నాయి. గిరిజన ప్రాబల్యం ఉన్న ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలని ఐపిఎఫ్‌టి దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నది. అందుకోసం హింసాత్మక చర్యలకు సైతం పాల్పడుతున్నది.

మాణిక్ సర్కార్ క్లీన్ ఇమేజ్

రాష్ట్రంలో 25 ఏళ్లుగా సిపిఎం అధికారంలో ఉంది. ఎర్ర కోటలో ప్రజాదరణ ప్రభుత్వానికి ఎలాంటి డోకా లేదన్న పూర్తి విశ్వాసంతో ఉంది. మాణిక్ సర్కార్ క్లీన్ ఇమేజ్, ఆయన వ్యక్తిత్వం ముందు బిజెపి ఎత్తులు పారవని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బిజెపి ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికల్లో ముందుకు సాగుతున్నది. గత అయిదు అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్‌ను సిపిఎం ఎదుర్కోగా..ఎన్నికలకు ముందు ఆరుగురు తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిజెపిలో చేరడం గమనార్హం.

బలమైన కార్యకర్తలే..సిపిఎం ఆస్తి

ఈశాన్యంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. త్రిపుర రాజకీయాలు భిన్నమైనవి. మాణిక్ సర్కార్ స్వచ్ఛమైన పాలనతో ప్రభుత్వ పథకాలు అన్ని పంచాయితీలకు చేరాయి. అలాగే సిపిఎం క్యాడర్ ప్రతీ గ్రామానికీ విస్తరించి ఉన్నది. పంచాయితీ స్థాయి అధికారులు ప్రభుత్వ పథకాల నాణ్యతను తనిఖీ చేస్తారు. ప్రతీ నెలా ప్రణాళికలను సమీక్షిస్తారు. పేదల జాబితా కూడా ఇక్కడే సిద్ధమవుతుంది.

ఇండియా టుడే ఎడిటర్ తొలగింపునకు డియుజె ఖండన

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ – న్యూఢిల్లీ

ఇండియా టుడే గ్రూప్ సంస్థలో ఎడిటర్‌గా పనిచేస్తున్న అంగ్సుకాంత చక్రవర్తిని ఏక పక్షంగా ఉద్యోగం నుంచి తొలగించడాన్ని ఢిల్లీ జర్నలిస్ట్స్ యూనియన్(డియుజె) ఒక ప్రకటనలో ఖండించింది. అభ్యంతరకరమైన, నకిలీ వార్తలను వ్యతిరేకిస్తూ వ్యక్తిగతంగా ట్వీట్ చేయడమే కాకుండా ఆ వార్తలను అందిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినందుకు ఆమెను ఉద్యోగం నుంచి తొలగించారని పేర్కొంది. యాంకర్లు, ఎడిటర్లు, రిపోర్టర్లు, రైటర్లు నకిలీ వార్తలను, అభ్యంతరకర వార్తలను అందిస్తున్నారని, వారి పట్ల యాజమాన్యాలు గుడ్డిగా వ్యవహరిస్తున్నాయని ఆమె తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అసభ్యకరమైన ప్రసంగాలు, వార్తలు అందిస్తున్న వారిపై, వారి నుంచి లబ్ధి పొందుతున్న వారిపై కోర్టులో చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. లౌకిక రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు అటువంటి వారిని సామాజిక బహిష్కరణకు గురి చేయాలని ఆమె తన ట్వీట్‌లో కోరారు.

నీరవ్ గుట్టు వీడిందిలా!

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో వెలుగు చూసిన రు.11,500 కోట్ల కుంభకోణానికి ఏడేళ్ల క్రితమే పునాది పడినట్లు తెలుస్తోంది. బ్యాంకుముంబయి బ్రాంచిలోనూ, ఇతర బ్యాంకుల శాఖలలోనూ సరైన పర్యవేక్షణ, ఆడిటింగ్ యంత్రాంగం లేకపోవటం వల్లే ఈ కుంభకోణం చోటు చేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తు ద్వారా తెలుస్తోంది. బ్యాంకు ఏటా వార్షిక ఆడిట్‌లు క్రమపద్ధతిలో నిర్వహిస్తున్నప్పటికీ ఈ కుంభకోణానికి ఏడేళ్ల క్రితమే తెరలేచింది. దిగుమతి బిల్లుల పరిష్కారం కోసం అందిన విజ్ఞప్తుల మేరకు చెల్లింపులు చేసిన ఇతర బ్యాంకులకు చెందిన విదేశీ శాఖలు ఇందులోని లోపాలను దీర్ఘకాలం పాటు ఎత్తి చూపలేకపోయాయి. దీనితో ఈ కుంభకోణంలో ఆయా బ్యాంకుల అధికారుల పాత్రను తోసిపుచ్చలేమని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)లోని ఒక సీనియర్ అధికారి చెప్పారు.



నీరవ్ మోడీ

అవగాహనా పత్రాలు

నీరవ్‌మోడీ కుటుంబ సభ్యులకు చెందిన మూడు సంస్థల తరపున అవగాహనా పత్రాలను (ఎల్ఓయు) మోసపూరితంగా జారీ చేయటంలో అప్పటి బ్యాంకు డిప్యూటీ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టి, మరో అధికారి బాధ్యులని పిఎన్‌బి ఆరోపిస్తోంది. గోకుల్‌నాథ్ శెట్టి లబ్దిదారులకు అవసరమైన రుణ పరిమితి మంజూరయిందా? లేక వారు అవసరమైన నగదును బ్యాంకులో కొలేటరల్‌గా డిపాజిట్ చేశారా అన్న విషయాన్ని పట్టించుకోకుండానే ఎల్ఓయులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ ఎల్ఓయుల విషయాన్ని బ్యాంకు అధికారులు ఎక్కడా బ్యాంకు డేటాబేస్‌లో అధికారికంగా నమోదు చేయలేదు. కాగా విదేశాలలోని బ్యాంకు శాఖల అధికారులు లబ్దిదారుల తరపున దిగుమతి బిల్లులకు చెల్లింపులు చేసేందుకు ఈ నకిలీ ఎల్ఓయులను పంపేశారు. ఎల్ఓయుల చెల్లుబాటు వ్యవధి మూడు నెలలే. ఒక కేసు విషయంలో మాత్రం చెల్లుబాటు వ్యవధిని ఒక ఏడాదికి పెంచుతూ ఎల్ఓయు జారీ చేశారు. ఇది కూడా వెలుగు చూడలేదు. అలహాబాద్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంకులకు చెందిన హాంకాంగ్‌ల్లోని ఇద్దరు అధికారులకు ఇందులో ప్రమేయం వున్నట్లు గుర్తించారు. దీనితో పాటు విదేశీ మారకద్రవ్య వ్యవహారాలు నిర్వహించే ఇతర బ్యాంకు శాఖల్లోని పంజాబ్ నేషనల్ బ్యాంకు నోస్ట్రో ఖాతాల ద్వారా ఈ బిల్లులకు చెల్లింపులు కూడా జరిగిపోయినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ఎల్ఓయు జారీ అయిన 90 రోజుల లోపే లబ్దిదారులు తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించాల్సి వుంటుంది. అయితే తీసుకున్న రుణం సొమ్ము పెండింగ్‌లో వున్నపుడే అదే వ్యవధికి నిందితులు మరో ఎల్ఓయు పొందినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడయింది.

ఎవ్వరికి ప్రమేయముంది?

పంజాబ్ నేషనల్ బ్యాంకు ముంబయి ప్రాతీయ కార్యాలయానికి చెందిన డిజిఎం ఒకరు మూడు సంస్థలు – ఎం/ఎస్ డైమండ్స్ ఆర్ యుఎస్, ఎం/ఎస్ సోలార్ ఎక్స్‌పోర్ట్స్, ఎం/ఎస్ స్టేలర్ డైమండ్స్‌పైనా, నలుగురు వ్యక్తులు – నీరవ్ మోడీ, నిశాల్ మోడీ, అమి నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీపైనా కేంద్ర దర్యాప్తు సంస్థకు ఫిర్యాదు చేశారు. వీరంతా మోసం చేసి బ్యాంకు రూ.280 కోట్లు నష్టం కలిగించారని ఫిర్యాదులో ఆరోపించారు. ఎటువంటి రుణ పరిమితి లేకుండా లేదా నగదు మార్జిన్ లేకుండానే 'లెటర్స్ ఆఫ్ అండర్ టేకింగ్' (ఎల్ఓయు) పొందేందుకు గోకుల్ నాథ్ శెట్టి, మనోజ్ హనుమంత్ ఖారత్ అనే ఇద్దరు బ్యాంకు అధికారులతో (వీరిలో ఒకరు రిటైర్డ్) కలిసి నిందితులు కుట్రకు పాల్పడ్డారని ఫిర్యాదులో ఆరోపించారు.



మెహుల్ చోక్సీ

చెల్లింపులు ఎవరి బాధ్యత?

వాస్తవ అంశాల ప్రకారం చూస్తే తుది బాధ్యత పిఎన్‌బినే బాధ్యత వహించాలి. ఆ గ్యారంటీ ఆధారంగానే రుణం జారీ చేయడం జరిగింది. విదేశీ బ్యాంకు శాఖలు ఆర్‌బిఐ మార్గదర్శకాలను సరిగా పట్టించుకోలేదని, నిబంధనల ప్రకారం ఇచ్చిన రుణాన్ని తిరిగి 90 రోజుల్లోనే వసూలు చేసుకోవాల్సి ఉంటుందని పిఎన్‌బి వాదిస్తోంది. పిఎన్‌బి ఇచ్చిన ఎల్ఓయు ఆధారంగా అలహాబాద్ బ్యాంకు అధిక చెల్లింపులు చేసింది.

కుంభకోణం సారాంశం ఏమిటి?

ఈ మూడు కంపెనీలతోపాటు నీరవ్ మోడీ, గీతాంజలి జెమ్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మెహుల్ చోక్సీ, మరో నలుగురు వ్యక్తులు బ్యాంకును మోసం చేసి దాదాపు రు.280 కోట్ల మేర నష్టం కలిగించారంటూ కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐకి ఫిర్యాదు చేసేందుకు గత నెల 29న పంజాబ్ నేషనల్ బ్యాంక్ అధికారి ఒకరు ముంబయికి వెళ్లారు. ఈ కంపెనీలు, వాటి నిర్వాహకులకు ఎటువంటి రుణపరిమితి మంజూరు కానీ, మార్జిన్ నిధుల లభ్యత కానీ లేకుండానే ఎల్ఓయులు పొందే విషయంలో ముంబయి బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఇద్దరు జూనియర్ ఉద్యోగులు సహకరించారని బ్యాంకు యాజమాన్యం చెబుతోంది. ఈ ఎల్ఓయులతో విదేశాలలోని భారతీయ బ్యాంకు శాఖల నుండి స్వల్పకాలిక రుణ పరిమితి పొందేం దుకు నిందితులు ప్రయత్నించారని పంజాబ్ నేషనల్ బ్యాంక్ తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదు ఆధారంగా ఈ కంపెనీలు, సంబంధిత వ్యక్తులపై సిబిఐ జనవరి 31న ప్రాథమిక కేసును నమోదు చేసిందని, దీనిపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని బ్యాంకు చెబుతోంది.

స్విఫ్టు విస్మరణ..

సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్‌బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్స్ (స్విఫ్ట్) అనే మాధ్యమం ద్వారా ఎల్ఓయు వివరాలు ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు చేరుతుంటాయి.. స్విఫ్ట్ ఆదేశాలను బ్యాంకులు బేఖాతర్ చేసిన ఉదంతం ఇప్పటి వరకు లేదు. కాని కొన్ని ఏళ్లుగా ఈ లావాదేవీల్లో ప్రధానమైన స్విఫ్టును పిఎన్‌బి, ఇతర బ్యాంకు శాఖలు విస్మరించాయి.



తాము పిఎన్‌బి లేఖల మేరకే చెల్లింపులు చేశాము. ఖాతాదారుడికి కాదు. దాదాపుగా రూ.2000–2200 కోట్ల మేర చెల్లింపులు జరిగాయి.

ఉషా అనంత సుబ్రమణ్యన్
అలహాబాద్ బ్యాంకు సిఇఒ

తమిళనాడుకు కావేరీ జలాల్లో 'కోత'

- 177.25 టిఎంసీలు కేటాయిస్తూ సుప్రీం తీర్పు
- కర్ణాటకకు అదనపు మిగులు జలాలు
- పుదుచ్చేరికి 7, కేరళకు 30 టిఎంసిల కేటాయింపు



న్యూఢిల్లీ: కావేరి నదీ జలాల పంపిణీ కేసులో సుప్రీం కోర్టు శుక్రవారం సంచలన తీర్పునిచ్చింది. తమిళనాడుకు కర్ణాటక విడుదల చేయాల్సిన నీటి కేటాయింపులను తగ్గిస్తూ తీర్పు చెప్పింది. ప్రస్తుతం విడుదల చేస్తున్న 192 టిఎంసిల నీటికి బదులు 177.25 టిఎంసిల నీటిని మాత్రమే తమిళనాడుకు సరఫరా చేస్తుంది. అంటే 14.75 టిఎంసిల నీటిని తక్కువగా సరఫరా చేస్తుంది. దీంతో కర్ణాటకకు ఆ మొత్తంలో అదనంగా నీటి మిగులుఏర్పడుతుంది. తమిళనాడులోని మెట్టూరు డామ్‌కు కర్ణాటకలోని బిల్లిగుండ్లు నుంచి ఈ నీరు సరఫరా అవుతుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పునిస్తూ కావేరి నదిని జాతి సంపదగా పేర్కొంది. కావేరి జల వివాదాల పరిష్కార ట్రిబ్యునల్ (సిడబ్ల్యుడిటి) 2007, ఫిబ్రవరి 5న రెండు రాష్ట్రాల మధ్య ఖరారు చేసిన నీటి పంపిణి ఏర్పాట్లను సుప్రీం కోర్టు సమర్థించింది. తమిళనాడు లోని 20 టిఎంసిల భూగర్భ జలాలను సిడబ్ల్యుడిటి పరిగణనలోకి తీసుకోలేదని, ఇందులో 10 టిఎంసిల నీటిని పరిణనలోకి తీసుకుంటూ ఆమేరకు కర్ణాటక తమిళనాడుకు సరఫరా చేయాల్సిన 192 టిఎంసిల నీటి నుండి తగ్గించినట్లు సుప్రీం తన తీర్పులో పేర్కొంది.

బెంగళూరుకు తాగునీటి అవసరం

కర్ణాటకలోని అంతర్జాతీయ నగరమైన బెంగళూరు తాగునీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరముందని ధర్మాసనం పేర్కొంది. కావేరి బేసిన్‌కు వెలుపల బెంగళూరు ఉన్నప్పటికీ 4.75 టిఎంసిలను సుప్రీంకోర్టు కేటాయించింది.

కేంద్రం వాదనలను తిరస్కరించిన సుప్రీం

1956 నాటి అంతర్రాష్ట్ర జల వివాదాల పరిష్కార చట్టంలోని సెక్షన్ 6ఎకు అనుగుణంగా కావేరి జల పంపిణీ పథకాన్ని రూపొందించడంలో వివక్షతను ప్రదర్శించినట్లు కేంద్రం చేసిన వాదనను సుప్రీం కోర్టు నిరాకరించింది. కేంద్రం చేసిన వాదన హేతుబద్ధం కాదని సుప్రీం పేర్కొంది. అంతేకాకుండా సిడబ్ల్యుడిటి తీర్పు మేరకు సెక్షన్ 6ఎ కింద పథకాన్ని రూపొందించిందని తెలిపింది.

15 ఏళ్ళపాటు మార్పు లేదు

పథకం రూపకల్పన మేరకు 15 ఏళ్ల పాటు నీటి కేటాయింపుల ఏర్పాటులో మార్పు ఉండదని తెలిపింది. కాగా కేరళకు 30 టిఎంసిల నీటిని, పుదుచ్చేరికి 7 టిఎంసిల నీటిని కేటాయించడంలో ఎలాంటి మార్పు చేయలేదు. సిడబ్ల్యుడిటి 2007లో ఇచ్చిన తీర్పులో కూడా కేరళకు 30, పుదుచ్చేరికి 7 టిఎంసిల నీటిని కేటాయించింది. దానినే సుప్రీం కోర్టు కొనసాగించింది.

తీర్పును అతిక్రమించొద్దు : హెచ్చరించిన సుప్రీం

కాగా ఈ తీర్పును అతిక్రమించొద్దని సుప్రీం కోర్టు రాష్ట్రాలను హెచ్చరించింది. ఏ ఉద్దేశంతోనైతే నీటి కేటాయింపులు జరిపిందో దానిని పక్కదోవ పట్టించొద్దని పేర్కొంది. నదీ జలాలను సమానంగా ఉపయోగించుకునే ప్రాతిపదికన నీటిని పంపిణీ చేసే విషయంలో ట్రిబ్యునల్ సక్రమంగానే వ్యవహరించిందని సుప్రీం పేర్కొంది.

కర్ణాటక – తమిళనాడు మధ్య నిలిచిన బస్సు సర్వీసులు

సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో కర్ణాటక నుంచి తమిళనాడుకు బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన సర్వీసులను తమిళనాడు సరిహద్దులోనే నిలిపివేసినట్లు జనరల్‌మేనేజర్ (ట్రాఫిక్) కెఎస్ విశ్వనాథన్ తెలిపారు. పోలీసు అధికారుల సలహా మేరకు రెండు రాష్ట్రాలకు చెందిన బస్సులు సరిహద్దుల వరకే నడిచాయని ఆయన చెప్పారు.

కనీస మద్దతు ధరపై సమగ్ర చర్చ : కిసాన్‌సభ

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ – న్యూఢిల్లీ

2018–19 సంవత్సరానికి ఖరీఫ్ ధరల పాలసీని ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) శుక్రవారం ఆగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైస్ కమిషన్‌కు (సిఎసిపి)కి సమర్పిస్తూ చైర్మన్‌కు ఒక లేఖ రాసింది. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉండి, రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయిన తరుణంలో.. సి2+50 శాతం దామాషాలో కనీస మద్దతు ధరను నిర్ణయించాలన్న రైతుల జాతీయ కమిషన్ సిఫార్సులకనుగుణంగా గిట్టుబాటు ధరను డిమాండ్‌చేస్తూ రైతాంగం పెద్ద ఎత్తున సంఘటిత పోరాటాలు జరుపుతున్న నేపథ్యంలో, ఖరీఫ్ పంట ధరలపై నివేదికను రూపొందించేందుకు సిఎసిపి సమావేశమవుతున్న సమయంలో ఎఐకెఎస్ తన నివేదికను సమర్పించింది. దాదాపు 190 రైతు సంఘాలు ఆల్ ఇండియా కిసాన్ సంఘర్ష్ కోఆర్డినేషన్ కమిటీగా ఏర్పడి 2017 నవంబరు 20, 21 తేదీలలో కిసాన్ సంసద్‌ను నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా ఎఐకెఎస్ తన లేఖలో గుర్తు చేసింది. సి2+50 శాతం కన్నా తక్కువ కాకుండా కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ కోరుతూ కిసాన్ సంసద్ ముసాయిదా బిల్లును ఆమోదించిన సంగతిని లేఖలో పేర్కొంది. రైతులు తాము పండించి పంటకు ఉత్పత్తి వ్యయాన్ని 50 పైగా పొందుతున్నారని పేర్కొనడాన్ని లేఖలో ప్రస్తావించింది.

ప్రత్యేకం

భారత్‌తో పెట్రో సహకారం

హైదరాబాద్‌లో ఇరాన్ అధ్యక్షుడు



ప్రజాశక్తి – హైదరాబాద్ :

తమ దేశంలోని అన్ని రకాల పెట్రో ఉత్పత్తులను భారత్‌తో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ హసన్ రౌహాని అన్నారు. హైదరాబాద్‌లోని చారిత్రాత్మక మక్కా మసీదులో ఆయన శుక్రవారం ప్రార్థనలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ 'ఇరాన్ పెట్రో ఉత్పత్తులకు పెట్టింది పేరు. ఆయిల్, గ్యాస్, ఇంధనం పెద్దఎత్తున లభ్యమవుతాయి. వీటిని భారత్‌తో పంచుకోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని ఆయన అన్నారు. ఒమన్‌లో భారత ప్రభుత్వ సహకారంతో నిర్మాణమవుతున్న ఛబహార్ నౌకా కేంద్రాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. హిందూ మహాసముద్రానికి అత్యంత సమీపంలో ఉన్న ఈ పోర్టు నిర్మాణం పూర్తయితే భారత్, ఇరాన్‌ల మధ్య సంబంధాలు మరింత ధృడమౌతాయన్న విశ్వాసాన్ని ఈ సందర్భంగా ఆయన వ్యక్తం చేశారు. ఆఫ్ఘనిస్తాన్‌తో పాటు, మధ్య ఆసియా ప్రాంతం కూడా ఈ పోర్టు నిర్మాణం వల్ల లబ్ధి పొందుతాయని చెప్పారు. పరిశ్రమలు, వ్యవసాయం, నూతన సాంకేతిక ఆవిష్కరణల్లోనూ రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత విస్తృతం కావాలని తాము కోరుకుంటున్నట్టు చెప్పారు. భారత్ ప్రజలతో సంబంధాలను మెరుగు పరచడంలో భాగంగా వీసా నిబంధనలను సరళీకృతం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. 'కొన్ని దేశాలు ముస్లింలకు వీసాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి. ఇరాన్ ప్రభుత్వం దీనికి భిన్నంగా వ్యవహరిస్తోంది. మతాలతో సంబంధం లేకుండా అందరికి వీసాలు ఇవ్వాలని మేం నిర్ణయించి, ఆచరిస్తున్నాం' అని అన్నారు. ముస్లిం దేశాల మధ్య ఐక్యత లేనందువల్లే అమెరికా అధ్యక్షుడు జెరుసలెంను ఇజ్రాయిల్ రాజధానిగా ప్రకటించగలిగారని చెప్పారు. పాలస్తీనాలో నెలకొన్న పరిస్థితికి కూడా ఇదే కారణమని ఆయన అన్నారు. విభేదాలను విస్మరించి ముస్లిం దేశాలన్నీ ఐక్యంగా నిలవడమే ఈ సమస్యకు పరిష్కారమని చెప్పారు. ఇస్లాం శాంతిని ప్రబోధించిందని తెలిపారు. భారత లౌకిక విధానాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. భారతదేశంలో అనేక మతాలకు చెందిన వారు కలిసి, మెలిసి నివసించడాన్ని ఇరాన్ అభినందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డిప్యూటీ ముఖ్యమంత్రి మొహమ్మద్ ఆలీచ మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎకె ఖాన్, ఎంపి అసదుద్దీన్ ఓవైసి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

చత్తీస్‌గడ్‌లో ఎన్‌కౌంటర్ ఇద్దరు నక్సలైట్ల మృతి

రాయ్‌పూర్ : చత్తీస్‌గడ్‌లోని సుక్మా జిల్లాలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సలైట్లు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. కాగా వీరిలో ఒక మహిళ కూడా ఉందని, వీరిని గండుల్వా ప్రాంతపు కమిటి మెంబరైన నందా, స్థానిక మావోయిస్టు దళ సభ్యురాలు సన్ని అలియాస్ కుంజమ్ లక్కెలలుగా పోలీసులు గుర్తించారు. గురువారం అర్ధరాత్రి సమయంలో చింతాగుఫా పోలీస్ స్టేషన్ పరిధిలో గల టోకన్‌పల్లి గ్రామంలోని అడవులలో జిల్లా రిజర్వ్ గార్డు, స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు కలిసి చేపట్టిన నక్సలైట్ల గాలింపు చర్యల్లో భాగంగా ఈ కాల్పులు జరిగినట్లు డిప్యూటి ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ తెలిపారు.

శ్రీనగర్‌లో మరో ఎన్‌కౌంటర్

శ్రీనగర్ : ఉత్తర కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని పట్టాన్ ప్రాంతంలో ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య శుక్రవారం ఎన్‌కౌంటర్ జరిగిందని, అయితే ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని ఉన్నతాధికారులు తెలిపారు. పట్టాన్‌లోని తాంత్రే మొహల్లా ప్రాంతంలో భద్రతా బలగాలు తెల్లవారుజామున కూంబింగ్ నిర్వహిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుందని పేర్కొన్నారు..

కెన్యాలో ముగ్గురు టీచర్లను హత్యచేసిన ఉగ్రవాదులు

నైరోబి : కెన్యాలో రాత్రికిరాత్రి జరిపిన దాడిలో అల్ షబాబ్ ఉగ్రవాదులు ముగ్గురు టీచర్లను హత్య చేసినట్లు కెన్యా అధికారులు తెలిపారు. ఇక్కడి ఖార్సా ప్రైమరి స్కూల్‌పై గుర్తు తెలియని సాయుధులు ముస్లిమేతర ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని దాడి చేశారని ఈశాన్య ప్రాంత కోఆర్డినేటర్ మహ్మద్ సలేహ్ తెలిపారు. తమపై ఉగ్రవాద దాడులు జరుగుతున్న నేపథ్యంలో ముస్లిమేతర ఉపాధ్యాయులెవ్వరూ ఆ ప్రాంతంలో పనిచేయడానికి సిద్ధపడటం లేదు. దీంతో సోమాలియాతో కలిసి ఉన్న కెన్యా సరిహద్దుల్లో విద్య బాగా వెనుకపడిపోయింది. ఈ ప్రాంతంలో ముస్లిమేతర ఉపాధ్యాయులపై దాడులు జరగడం 2014 నుంచి ప్రారంభమైంది. 2014లో తొలిసారిగా జరిగిన దాడిలో 12 మంది దాకా టీచర్లు మరణించారు.

ప్రేమికుల దినోత్సవం ఇస్లాంకు విరుద్ధం కాదు : సౌదీ షేక్

రియాద్ : ప్రేమికుల దినోత్సవ (వలంటైన్స్‌డే) కార్యక్రమాలు నిర్వహించుకోవటం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధమేమీ కాదని సౌదీకి చెందిన ప్రముఖుడు షేక్ అహ్మద్ అల్ ఘమ్‌డి అభిప్రాయపడ్డారు. మక్కా ప్రాంత కమిషన్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ వర్చ్యూ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ వైస్‌కు గతంలో ఘమ్‌డి నేతృత్వం వహించారు. ప్రేమికుల దినోత్సవం ఇస్లామిక్ బోధనలకు ఏ మాత్రం విరుద్ధమైనది కాదని, ఇది కూడా ప్రపంచ వ్యాప్తంగా అన్ని సమాజాలు జరుపుకుంటున్న ఇతర సామాజిక పండుగల వంటిదేనని అన్నారు. సౌదీ యువరాజు సల్మాన్ పలు మతపర నిర్బంధాలను సడలిస్తున్న నేపథ్యంలో షేక్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

కొత్త సంవత్సర సంబరం

చైనా నూతన సంవత్సరం శునక నామ సంవత్సరం సందర్భంగా బీజింగ్‌లో నిర్వహించిన వేడుకల్లో విశేషంగా ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు



ఇమ్మిగ్రేషన్ బిల్లులను తిరస్కరించిన అమెరికా సెనెట్

వాషింగ్టన్ : డ్రీమర్ ఇమ్మిగ్రెంట్లను కాపాడేందుకు ఉద్దేశించిన పలు బిల్లులను అమెరికా సెనెట్ గురువారం తిరస్కరించింది. దీంతో దాదాపు 18లక్షల మంది యువత భవిష్యత్ ఆందోళనలో పడింది. సెనెట్‌లో ప్రవేశపెట్టిన నాలుగు ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్ళేందుకు అవసరమైన 60ఓట్లు రాకపోవడంతో ఈ బిల్లులు వీగిపోయాయి. ఇందులో ఒక బిల్లుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు వుంది. విడిగా పెట్టిన ద్వైపాక్షిక బిల్లు సెనెట్‌లో ఆమోదం పొందుతుందని భావించారు. ద్వైపాక్షిక బిల్లుకు 54-45 ఓట్లు లభించాయి. ఆ బిల్లును ఓటింగ్‌కు పెట్టడానికి కొద్ది గంటల ముందు 'పూర్తి విధ్వంసకర బిల్లు' అని వ్యాఖ్యానించడం ద్వారా ఆ బిల్లు ఓటమికి ట్రంప్ దోహదపడ్డారు. డ్రీమర్లకు పౌరసత్వం కల్పించాలన్న, మెక్సికోతో సరిహద్దు గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలన్న రిపబ్లికన్ల ప్రతిపాదనకు ట్రంప్ మద్దతునిచ్చారు. అయితే ఆయన సొంతపార్టీకే చెందిన 14మంది సెనెటర్లు బిల్లును వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఆ బిల్లు వీగిపోయింది. ఇటీవలి కాలంలో కాంగ్రెస్‌లో వరుస వైఫల్యాల్లో సెనెట్ ఓటింగ్ తాజాది. దీంతో యువ డ్రీమర్లకు ప్రయోజనాలు కల్పించగల మార్గం కోసం అన్వేషణ మొదలైంది.

సౌదీలో పాక్ సైనిక బలగాలు

ఇస్లామాబాద్ : సౌదీతో ద్వైపాక్షిక భద్రతా సహకారం కింద ఆ దేశంలో బలగాలను మోహరించాలని పాకిస్తాన్ నిర్ణయించింది. ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న ద్వైపాక్షిక సహకారంలో భాగంగా పాక్ సైనిక బృందాన్ని సౌదీ అరేబియాకు పంపుతామని పాక్ సైన్యం ప్రకటించింది. కేవలం సౌదీతోనే కాకుండా పలు గల్ఫ్ దేశాలతో పాక్ ఈ విధమైన సహకారాన్ని కొనసాగిస్తోందని పేర్కొంది. రావల్పిండిలోని సైనిక ప్రధాన కార్యాలయంలో పాకిస్తాన్‌లో సౌదీ రాయబారి నవాఫ్ సయీద్ అల్ మలికి, పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఖమర్ జావేద్ బజ్వాల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రాంతీయ భద్రతా సహకారంతో సహా పరస్పర ప్రయోజనం కలిగిన పలు అంశాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చాయి. ఇప్పటికే వివిధ రూపాల్లో వెయ్యిమంది పాక్ సైనికులు సౌదీ అరేబియాలో మోహరించి వున్నారు. ఇప్పుడు అదనంగా ఎంతమందిని పంపేది ఇంకా అధికారిక సమాచారమేదీ లేదని డాన్ వార్తాపత్రిక పేర్కొంది. బహుశా ఒక బ్రిగేడ్‌ను పంపే అవకాశం వుందని భావిస్తున్నారు.

నిత్య శ్రామికులు కండి..

కుటుంబ విలువలు కాపాడుకోండి..!

- చైనీయులకు సీ జిన్‌పింగ్ పండుగ సందేశం


బీజింగ్ : చైనా కొత్త సంవత్సర ఆరంభం సందర్భంగా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ చైనీయులకు శుభాకాంక్షలు తెలియచేశారు. నిత్య శ్రామికులుగా కొనసాగుతూ, కుటుంబ విలువలనుకాపాడుకోవాలని ఆయన తన సందేశంలో పిలుపునిచ్చారు. చైనాలో ఈ సంవత్సరం చాంద్రమాన సంవత్సరం ఈ నెల 16 నుండి ప్రారంభమవుతోంది. దీనితోపాటే వసంతోత్సవాలు (స్ప్రింగ్ ఫెస్టివల్స్) కూడా ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఇక్కడి గ్రేట్‌హాల్ ఆఫ్‌ది పీపుల్‌లో జరిగిన రిసెప్షన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చైనా ప్రధాన భూభాగంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో జీవిస్తున్న చైనీయులకు, పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. చైనా ప్రజలు నిత్య శ్రామికులని, వారు తమ శ్రమను కొనసాగిస్తూ కుటుంబ విలువలను కాపాడుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు. గత



ఏడాది అక్టోబర్‌లో జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ మహాసభలలో ఆమోదించిన 'కొత్త యుగం' అన్న మాటను ఆయన ప్రస్తావించారు. గత ఏడాది వివిధ రంగాలలో చైనీయులు ఘన విజయాలను సాధించారని ఆయన కొనియాడారు. కుటుంబాల కలయిక అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ప్రస్తుత సమయంలో కుటుంబ విలువలను కాపాడుకునేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక వ్యక్తి తన ప్రయత్నాలు సఫలీకృతం చేసుకోవటం ద్వారా మాత్రమే సంతోషం పొందగలడని సీ తన ప్రసంగంలో చెప్పిన మాటలను గుర్తు చేసిన బ్రెజిల్ చైనీస్ అసోసియేషన్ సీనియర్ సభ్యుడు లియుహావో 'ఈ మాటలతో సీ తన హృదయాన్ని కదిలించార'న్నారు. విదేశాల్లో నివశించే తమ వంటి వారు నిత్య శ్రామిక స్ఫూర్తిని కొనసాగించటం ద్వారా విదేశీ భూభాగంపై గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్నామన్నారు. మెరుగైన జీవనం కోసం ప్రజల ఆకాంక్షలను సాకారం చేయటంపై దృష్టి పెట్టాలన్న సీ పిలుపును రోమ్‌కు చెందిన చైనా కమ్యూనిటీ ఫెడరేషన్ అధ్యక్షుడు ఝూంగ్ గువాన్ ప్రస్తావిస్తూ చైనాలో సంస్కరణలకు చేయూతనివ్వటం ద్వారా ప్రవాస చైనీయులకు మెరుగైన జీవనాన్ని అందించటానికి ఇది మంచి సమయమన్నారు. ఇది చైనా-ఇటలీ ఆర్థిక వాణిజ్య సంబంధాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రవాస చైనీయులు మాతృదేశం పట్ల తమ ప్రేమను కొనసాగిస్తూ, చైనా జాతీయ పునరుత్తేజానికి సహకరించాలని బ్రిటన్‌కు చెందిన లీలీ అనే మహిళ ఆకాంక్షించారు.

ట్రంప్‌కు మరోసారి చుక్కెదురు

పర్యాటక నిషేధపుటుత్తర్వులను కొట్టివేసిన అప్పీళ్ల కోర్టు



రిచ్‌మండ్ : ఆరు ముస్లిం దేశాల నుండి అమెరికాకు పర్యాటకుల రాకపోకలపై నిషేధం విధిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమైనవంటూ రిచ్‌మండ్‌లోని నాల్గవ సర్క్యూట్ అప్పీళ్ల కోర్టు తీర్పు వెలువరించింది. ఇటువంటి వ్యాఖ్యలు, ఆదేశాలు దేశంలో వున్న మత స్వేచ్ఛను, సహనాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. విదేశీ పర్యాటకుల రాకపోకలపై నిషేధం విధిస్తూ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేసిన కోర్టుల్లో ఇది రెండవది కావటం విశేషం. గత డిసెంబర్‌లో 9వ సర్క్యూట్ కోర్టాఫ్ అప్పీల్స్ ట్రంప్ ఉత్తర్వులను కొట్టివేసిన విషయం తెలిసిందే. ఆరు ముస్లిం దేశాల పర్యాటకుల రాకపోకలపై నిషేధం విధిస్తూ జారీ చేసిన ఆదేశాలపై మేరీలాండ్ ఫెడరల్ జడ్జ్ విధించిన స్టేను 4వ సర్క్యూట్ కోర్టు గట్టిగా సమర్థించింది. పర్యాటక నిషేధపుటుత్తర్వుల కేసు విచారణను ఏప్రిల్‌లో చేపట్టేందుకు అమెరికా సుప్రీంకోర్టు ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. కోర్టుల ద్వారా అప్పీళ్లు చేసుకుంటున్నప్పటికీ నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు పర్చాలని సర్వోన్నత న్యాయస్థానం గత డిసెంబర్‌లో వెలువరించిన తీర్పులో ఆదేశించింది. కొన్ని ఎంపిక చేసిన దేశాలకు చెందిన పర్యాటకుల రాకపోకలపై విధించిన నిషేధం అంతర్జాతీయ సంబంధాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని నాల్గవ సర్క్యూట్ కోర్టు తన తీర్పులో వ్యాఖ్యానించింది. ఈ నిషేధం లక్షలాది అమెరికన్‌ల కుటుంబాలకు వున్న హక్కులను, అవకాశాలను కాలరాస్తోందని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ప్రాథమిక స్థాయిలో ఈ నిషేధం దేశంలో కొనసాగుతున్న మతస్వేచ్ఛ, సహనాలను ప్రశ్నార్థకంగా మారుస్తోందని ప్రధాన న్యాయమూర్తి రోగర్ గ్రెగరీ ఈ 9-4 మెజార్టీ తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో పిటిషనర్ల తరపున కోర్టులో వాదించిన అమెరికా పౌరహక్కుల సంఘం డిప్యూటీ లీగల్ డైరెక్టర్ సిసిలియా వాంగ్ మీడియాతో మాట్లాడుతూ కోర్టు తీర్పు తనకు ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించలేదన్నారు. ఒక మతానికి వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రాజ్యాంగం నిషేధించిందని ఆమె గుర్తు చేశారు. ట్రంప్ ఆదేశాలను సవాలు చేసిన ఇంటర్నేషనల్ రిఫ్యూజీ అసిస్టెన్స్ ప్రాజెక్టు ప్రతినిధి ఒకరు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ సర్కారు అనుసరిస్తున్న ఈ విధానం విదేశాలలో వుంటున్న తమ కుటుంబ సభ్యులను కలుసుకోవాలనుకుంటున్న వారికి, అమెరికాలో విద్యావకాశాల కోసం వస్తున్న విదేశీ విద్యార్థులకు శరాఘాతం వంటిదని పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వం ఈ వర్గాలను అన్యాయంగా టార్గెట్ చేసిందన్న విషయాన్ని తాజా తీర్పు మరోసారి రుజువు చేసిందని ఆయన అన్నారు. కాగా ప్రభుత్వం మాత్రం తన నిషేధపుటుత్తర్వులను గట్టిగా సమర్థించుకుంటూ జాతీయ భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ ఆదేశాలు జారీ చేసినట్లు వివరించింది.

వెనిజులా శరణార్థులకు మానవతా సాయం

సరిహద్దుల్లో సామాజిక ఎమర్జన్సీ ప్రకటించిన బ్రెజిల్ సర్కార్

బ్రసీలియా : వెనిజులాతో గల సరిహద్దుల్లో సామాజిక అత్యవసర పరిస్థితి విధిస్తామని, బలగాలను పెంచుతామని బ్రెజిల్ గురువారం ప్రకటించింది. వెనిజులాలో సంక్షోభం నెలకొన్న పరిస్థితుల్లో అక్కడ నుండి వచ్చే ప్రజల సంఖ్య పెరుగుతోంది. ఈ నేప థ్యంలో అవసరమైతే మౌలిక సదుపాయాల నిధులను వారి అవసరాల కోసం కేటాయించే అధికారం అధికారు లకు కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. వెనిజులా సరిహ ద్దుల్లో అవసరమైన చోట మానవతాసాయం చేపట్టడా నికి కూడా వీలు కల్పించినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. దీనికి తోడు సరిహద్దుల్లో అదనంగా సైనికులను మోహరించడం వంటి చర్యలు కూడా తీసుకుంటామని కొద్ది రోజుల్లో దీనిపై డిక్రీ జారీ చేయబడుతుందని ఆ ప్రకటన తెలిపింది. వెనిజులాలో నెలకొన్న ఆర్థిక మాంద్యం, రాజకీయ అశాంతి నేపథ్యంలో అక్కడ నుండి దాదాపు 40వేల మంది వెనిజులన్లు బ్రెజిల్ సరిహద్దు రాష్ట్రమైన రొరాయిమాలో ఆశ్రయం పొందారని బ్రెజిల్ ప్రభుత్వం తెలిపింది. శరణార్థుల కోసం సరిహద్దుల్లో ఒక ఆస్పత్రిని నెలకొల్పాలని, రాష్ట్రంలో మరిన్ని చెక్‌పాయింట్లను ఏర్పాటు చేయాలని భావిస్తోంది.

ముందస్తు ప్రణాళికతోనే ఫ్లోరిడా కాల్పులు

పార్క్‌లాండ్ (ఫ్లోరిడా) : సెమీ ఆటోమేటిక్ రైఫిల్‌తో ఫ్లోరిడా స్కూల్లో 17 మంది విద్యార్థులను కాల్చి చంపిన మాజీ విద్యార్థి నికొలస్ క్రజ్ వద్ద అదనపు మందుగుండు సామాగ్రి వుందని, దాదాపు మూడు నిముషాల పాటు కాల్పులు జరిపాడని పోలీసులు రూపొందించిన నివేదిక వెల్లడించింది. కాల్పులకు ఉపయోగించిన ఆయుధాన్ని చట్టబద్ధంగానే కొనుగోలు చేసిన క్రజ్ ఈ దాడికి ముందుగానే ప్రణాళిక వేసుకుని వుంటాడని భావిస్తున్నారు. కాగా, గత సెప్టెంబరులోనే నికొలస్ క్రజ్ పేరుతో యూ ట్యూబ్ వీడియోలో కాల్పుల సందేశాన్ని ఎవరో పోస్ట్ చేశారని బహుశా ఆ క్రజ్, ఈ క్రజ్ ఒకరే అయివుంటారని అనుమానిస్తున్నట్లు ఎఫ్‌బిఐ తెలిపింది. కాల్పులు జరిపిన తర్వాత ఆయుధాన్ని, బ్యాగ్‌ను అక్కడే పడవేసి, పారిపోతున్న విద్యార్థులతో కలిసి బయటకు వచ్చేసిన క్రజ్ మెక్‌డోనాల్డ్స్‌లోకి వెళ్ళాడని, దానికి ముందుగా ఒక రెస్టారెంట్‌లో డ్రింక్ కొనుగోలు చేశాడని, మెక్‌డొనాల్డ్స్ నుండి బయటకు వచ్చిన 40నిముషాల్లోపే అతడిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. దాడి జరిగిన 24గంటల్లోగా క్రజ్ గురించి పూర్తి సమాచారం బయటకు వచ్చింది. ఒంటరిగా వుండే క్రజ్ డాలర్ స్టోర్‌లో పనిచేసేవాడు. ఆయుధాల ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పెడుతుండేవాడు. క్రజ్ ఎప్పుడో ఒకప్పుడు స్కూలునే పేల్చివేస్తాడని తోటి విద్యార్థులు జోక్స్ వేస్తూండేవారని ఒకవిద్యార్థి వెల్లడించాడు. తల్లిదండ్రులను పోగొట్టుకుని అనాథగా మారిన క్రజ్‌పై హత్యా అభియోగాలు నమోదయ్యాయి. 'ప్రొఫెషనల్ స్కూల్ షూటర్‌గా మారతా అని నికొలస్ క్రజ్ పేరుతో ఒక అజ్ఞాత ఆన్‌లైన్ సందేశం గత సెప్టెంబరులోనే తమకు అందిందని ఎఫ్‌బిఐ వెల్లడించింది.

హత్య కేసులో కెఇ కుమారుడికి అరెస్టు వారెంట్

ప్రజాశక్తి - డోన్ (కర్నూలు)

కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో ఉపముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి కుమారుడు కెఇ శ్యాంబాబుకు డోన్ కోర్టు శుక్రవారం అరెస్టు వారెంట్ జారీ చేసింది. గతేడాది మే 22న చెరుకులపాడు నారాయణరెడ్డి హత్యకు సంబంధించిన కేసులో కెఇ కుటుంబంపై మొదటి నుంచే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే కెఇ శ్యాంబాబుతో పాటు ఆస్పరి జెడ్‌పిటిసి బొజ్జెమ్మ అప్పటి వెల్దుర్తి ఎస్ఐ తులసి నాగప్రసాద్‌ల పేర్లను ఉద్దేశపూర్వకంగానే పోలీసులు చార్జిషీట్ నుంచి తొలగించారని, తిరిగి వారిని హత్య కేసులో నిందితులుగా చేర్చాలని నారాయణరెడ్డి భార్య శ్రీదేవి హైకోర్టు న్యాయవాదితో కలిసి గత నెల డోన్ కోర్టులో ప్రయివేట్ ఫిర్యాదును దాఖలు చేశారు. ఉపముఖ్యమంత్రి కెఇ క్రిష్ణమూర్తి పోలీసులపై ఒత్తిడి తెచ్చి చార్జిషీట్ నుంచి పేర్లను తొలగించారని ఆరోపణలు చేశారు.

విభజన చట్టం అమలులో కేంద్రం విఫలం

మేధావుల ఫోరం అధ్యక్షులు చలసాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎపి విభజన చట్టం అమలులో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని ఆంధ్రా మేధావుల ఫోరం అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ విమర్శించారు. చట్టం తయారీలో సరైన పదజాలం ఉపయోగించకుండా నిర్దిష్ట ప్రతిపాదనలు చేయకుండా కేంద్రం అన్యాయం చేసిందని ఆయన విమర్శించారు. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని పేర్కొన్నారు. 13వ షెడ్యూల్‌లో పేర్కొన సంస్థలపై 5 బడ్జెట్ల తర్వాత కూడా స్పష్టత రాలేదని ఎపి, తెలంగాణల మధ్య సమస్యలు అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఎపిసిఎస్ఎ నిర్వహించిన విభజన చట్టం హామీలు - అమలు రౌండ్‌టేబుల్‌లో చలసాని మాట్లాడారు. ఎపిసిఎల్ఎ రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి సురేశ్, సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

బాబుకు ఢిల్లీ పిలుపు?

తెలుసుకున్నారని తెలిసింది. రానున్న ఒకటి, రెండు రోజుల్లో మరింత విస్తృత స్థాయిలో చర్చించి ఒక నిర్ణయానికి వచ్చే అవకాశముందని సమాచారం. కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరువాత తెలుగుదేశం, బిజెపి నేతలు పరస్పర విమర్శలు చేసుకుంటున్న విషయం తెలిసిందే. విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని, అంతంతమాత్రంగానే నిధులు ఇచ్చిందని టిడిపి నాయకులు విమర్శిస్తుండగా, దానిని బిజెపి తోసిపుచ్చుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రత్యేకహోదా, విభజన హామీల అమలుకోసం వామపక్షాలు ఇచ్చిన బంద్ పిలుపునకు విస్తృత స్పందన లభించింది. బంద్ విజయవంతం కావడంతో బిజెపితో తెగతెంపులు చేసుకోవడమే మేలన్న ఒత్తిడి టిడిపి శ్రేణుల నుండి చంద్రబాబుపై వస్తోంది. కొందరు మంత్రులు కూడా ఇదే అభిప్రాయాన్ని ఇప్పటికే వ్యక్తం చేసినట్లు సమాచారం. తాజాగా ఢిల్లీ నండి పిలుపురావడంతో చంద్రబాబు తన కసరత్తును ముమ్మరం చేసినట్టు సమాచారం, శుక్రవారం ఆయన్ను కలిసిన కొంతమంది మంత్రులు మైత్రిపైనే మాట్లాడినట్లు తెలిసింది. ఇప్పటికే మోడీ ప్రసంగ సమయంలో వెనుకకు తగ్గడం వల్ల వచ్చిన అపవాదును పోగొట్టుకోవాలంటే కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఒకరిద్దరు మంత్రులు బాబుకు చెప్పినట్లు తెలిసింది. రాష్ట్రానికి ఏం చేయాలన్న దానిపై ముందుగా ప్రకటన చేయించుకోవాలని, లేనిపక్షంలో వచ్చే నెల్లో పున్షప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో గట్టిగా ఉద్యమించాలని మరికొందరు సూచించినట్లు సమాచారం. విడిపోతే కలిగే లాభాలు, కలిసి ఉంటే నెలకొనే నష్టాలపైనా చంద్రబాబు సన్నిహితుల వద్ద ప్రస్తావిస్తూ, సలహాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

వాస్తవాలు మాట్లాడితే మీకే ఇబ్బంది

ప్రయత్నాలు చేస్తున్నాయి. ఏపికి కేంద్రం ఇచ్చిన నిధులపై బిజెపి నిజాలు బయట పెట్టేకొద్దీ మీకు ఇబ్బందులు తప్పవు. కేంద్ర, రాష్ట్రాలు పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలి. అప్పుడే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడం, తిట్టుకోవడం సరికాదు. పవన్ కళ్యాణ్ వేసిన నిజనిర్ధారణ కమిటీపై నమ్మకం లేదు. ఆ కమిటీలో కాంగ్రెస్, విశ్వసనీయత లేనివాళ్లే ఉన్నారంటే అర్థం చేసుకోవచ్చు" అని అన్నారు. అమరావతి నిర్మాణానికి 40 వేల కోట్లకు పైగా అడుగుతున్నారని, అక్కడ చట్ట సభలు కడుతున్నారా? లేక మయసభను కడుతున్నారా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు.

సజీవ సమాధి

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించాయి. శ్రీ వేంకటేశ్వర హేచరీస్‌లో గుడ్లు పగిలిపోయి నపుడు వాటిని శుభ్రం చేసేందుకు యాసిడ్‌లను ఉపయోగిస్తారు. వీటితోపాటు కోడిపిల్లల నుంచి వచ్చే వ్యర్థాలను మొత్తం పరిశ్రమలో కుడివైపున ఓ పెద్ద భూగర్భ గుంతలోకి వదులుతారు. అది నిండిపోయి పొర్లిపోయే నీటిని పక్కనున్న పొలాలకు వదులుతారు. ప్రతినెలా ఈ వ్యర్థాల ట్యాంక్‌ను శుభ్రంచేస్తారు. ఈ పని యంత్రాల ద్వారా చేయించాల్సి ఉంది. అయితే యాజమాన్యం కూలీలనే ఉపయోగిస్తోంది. సాధారణంగా ఇందులోని నీళ్లను పైపు ద్వారా బయటకు తీస్తారు. అయితే ఆరు నెలల క్రితం నీళ్లను పీల్చే పైపు వద్ద వ్యర్థాలు ఇరుక్కున్నాయి. అవి బయటకు రాలేదు. దీంతో వాటిని తొలగించేందుకు యాజమాన్యం మేనేజర్‌ను, సూపర్‌వైజర్లను పురమాయించింది. ఈ పరిశ్రమలో పనిచేస్తున్న కూలీలు తొమ్మిది మందిని ఈ గుంత వద్దకు శుక్రవారం ఉదయం పంపించారు. తొలుత కేశవ్ అనే కార్మికుడు మొదట ఈ గుంతపైన ఒక పక్కన ఉన్న మ్యాన్‌హోల్‌లోకి నిచ్చెన సాయంతో దిగాడు. ఐదు నిమిషాలవుతున్నా పైనున్న వారికి ఇతని వద్ద నుంచి ఏ సమాచారం రాలేదు. గుంత మొత్తం కాంక్రీటు దిమ్మెతో కట్టి ఉండడం, లోపల ఏమి జరుగుతోందో తెలీకుండా పోవడం, లోపల చిమ్మచీకటి ఆవరించి ఉండడం వంటి కారణాలతో బయటున్న వారికి లోపల ఏమైందో తెలీని పరిస్థితి. దీంతో మరొకతను దిగాడు, ఆయనా రాకపోయేసరికి మరొకరు దిగారు. ఇలా ఒకరు రాలేదని మరొకరు దిగుతూనే ఉన్నారు. వెళ్లిన వారు వెళ్లినట్లే స్వల్ప వ్యవధిలోనే ఆ గుంతలో ఊపిరాడక పడిపోతున్నారు. చివరిలో ఎనిమిదో కార్మికుడు శివకుమార్‌రెడ్డి కూడా అందులోకి దిగేందుకు ప్రయత్నించాడు. మెట్లదగ్గరికి వెళ్లగానే అతడికి ఊపిరాడలేదు. వెంటనే పైకి వచ్చేశాడు. ఈ విషయం పక్కనే ఉన్న గ్రామస్తులకు తెలిసింది. వారంతా కలసి ఆ గుంతను పగలగొట్టేందుకు ప్రయత్నించారు. అయితే కాంక్రీటు వేసి ఉండటంతో వారి వల్ల కాలేదు. దీంతో జెసిబిని తీసుకొచ్చి కాంక్రీటు కప్పును తొలగించారు. అంబులెన్సు ద్వారా తొలుత ఇద్దరిని, మిగిలిన ఏడుగురిని హేచరీకి సంబంధించిన టెంపోలో ఆసుపత్రికి తరలించారు. వీరిని పరిక్షించిన వైద్యులు ఏడుగురు గుంతలోనే మృత్యువాత పడ్డారని తేల్చారు.

చనిపోయిన వారు వీరే..

ఈ ఘటనలో మృత్యువాత పడిన వారిలో పలమనేరు రూరల్‌లోని మొరం గ్రామానికి చెందిన రెడ్డెప్ప (42), రమేష్ (33), కొలమాసనపల్లి శ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన రామచంద్ర (20), ఐఎం రెడ్డి పల్లికి చెందిన కేశవ (18), ఎగువ కూర్మాయికి చెందిన గోవిందస్వామి (45), కర్ణాటకకు చెందిన బాబు (40), చంద్రగిరి మండలంలోని అరిగేపల్లికి చెందిన వెంకటరాజు (23) మృత్యువాత పడ్డారు. అస్వస్థతకు గురైన శివకుమార్‌రెడ్డిని సిఎంసికి తరలించారు. మహేష్‌కు పలమనేరులోనే వైద్యం అందించారు.

రోదనలతో అట్టుడికిన ఆసుపత్రి

ఏడుగురు కూలీలు ఒకే సారి మృత్యువాత పడటంతో పలమనేరులోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వారి బంధువుల రోదనలతో అట్టుడుకిపోయింది. మృతుల కుటుంబీకులు గుండెలు బాదుకుంటూ, తలలు కొట్టుకుంటూ రోదించడం చుట్టుపక్కల వారిని సైతం కన్నీరు పెట్టించింది. తట్టుకోలేని కొందరు బంధువులు ఆసుపత్రి ప్రాంగణంలోనే కుమిలి కుమిలి ఏడవడం హృదయవిదారకంగా మారింది.

కార్బన్ మోనాక్సైడ్, విషవాయువుల వల్లే ఘోరం

గుంతలోకి వెళ్లిన వారు వెళ్లినట్టే చనిపోవడానికి ముఖ్య కారణం అక్కడ కార్బన్‌మోనాక్సైడ్, టాక్సిజన్ వంటి విషవాయువుల వల్లే చనిపోయారని పలమనేరులోని ప్రభుత్వ వైద్యులు నిర్ధారించారు. కోళ్ల వ్యర్థాల గుంతలోనుంచి మృతదేహాలను వెలికి తీయడంతో విపరీతమైన దుర్వాసన ఆసుపత్రి ప్రాంగణం మొత్తం వ్యాపించింది. ఈ కుళ్లు కంపును తట్టుకోవడం ఎవరి వల్లా కాలేదు. కడుపులో దేవేసెటట్టు వచ్చే వాసనను చూసి ఇంత గబ్బును చనిపోయిన వారు ఎలా భరించారు..? అని అందరూ అనుకున్నారు.

సిఐటియు కృషితో రూ.25 లక్షల చొప్పున పరిహారం

సంఘటన జరిగిన వెంటనే సిఐటియు నాయకులు ఓబుల్‌రాజు, భువనేశ్వరి, గిరిధర్‌గుప్తాలు హుటాహుటిన హేచరీస్ వద్దకు చేరుకుని అస్వస్థతకు గురైనవారిని పలమనేరు ఆసుపత్రికి తరలించారు. ఏడుగురు చనిపోయారని తెలియగానే ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. దీనికి తలొగ్గిన ప్రభుత్వం వెంటనే దిగొచ్చింది. చంద్రన్న బీమా పథకం కింద సాధారణంగా రూ.5 లక్షలు ఇస్తారు. ఇది ప్రత్యేక ప్రమాదంగా గుర్తించి మరో రూ. ఐదు లక్షలు చేర్చి మొత్తం రూ.10 లక్షలు చంద్రన్న బీమా పథకం కింద, యాజమాన్యం తరపున మరో 15 లక్షలు మొత్తం రూ.25 లక్షలు ఇవ్వనున్నట్లు కలెక్టర్ ప్రద్యుమ్న ప్రకటించారు.

మృతుల్లో ఒకరు బాలసుబ్రమణ్యం కర్ణాటక కావడంతో ఆయనకు చంద్రన్న బీమా పథకం వర్తించబోదని, యాజమాన్యం నుంచి వచ్చే రూ. 15 లక్షలు ఇప్పిస్తామని చెప్పారు. అంతే కాకుండా యాజమాన్యం తరపున కుటుంబ సభ్యుల్లో ఒకరికి జీవితాంతం ప్రతి నెలా 90 శాతం వేతనాన్ని ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వారి పిల్లల చదవుల బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని తెలిపారు.

ఒక్కొక్కరిది ఒక్కో దీనగాథ..!

వేంకటేశ్వరా హేచరీస్‌లో మృత్యువాత పడిన కార్మిక కుటుంబాల దీనగాథలు వింటే ఎవరికైనా కన్నీళ్లు తెప్పిస్తుంది. ప్రతి రోజూ ఫ్యాక్టరీకి వెళితేనే వారి కుటుంబం గడుస్తుంది. లేకుంటే పస్తులుండాల్సిందే. కుటుంబ పెద్ద మృతిచెందడంతో ఆయా కుటుంబాలు రోడ్డునపడ్డాయి.

ముగ్గురూ ఆడపిల్లలే

ఈ సంఘటనలో మృత్యువాత పడిన గోవిందస్వామి (40)కి ముగ్గురు ఆడపిల్లలున్నారు. ఇతను హేచరీస్‌లో పదేళ్లుగా పని చేస్తున్నాడు. బెంగుళూరులో పని చేస్తూ పలమనేరులో పరిశ్రమ పెట్టడంతో ఇక్కడికొచ్చారు. ఆయనకు రూ.12వేలు వేతనం వస్తోంది. ఈయనకు భార్య ముగ్గురు ఆడపిల్లలున్నారు. ఈయన జీతమే ఆ కుటుంబానికి ఆదరవు. ఇప్పుడు వీరి పరిస్థితి దయనీయంగా మారనుంది.

రోజూ కలసి పనికి వచ్చే వాళ్లం

'మాది కర్నాటక రాష్ట్రం ముల్‌బాగల్ ప్రాంతం ఇద్దరం ఇదే హేచరీస్‌లో పని చేస్తున్నాం. ఆరేళ్లుగా కలసి పరిశ్రమకు వచ్చి పని చూసుకుని వెళ్లే వాళ్లం. వద్దు వద్దు అంటున్నా వెళ్లాడు. కళ్లముందే ప్రాణాలు పోయాయి. వారి పెద్ద దిక్కుపోయింది. ఒకే కొడుకు ఉన్నాడు. ఎలా బతకాలో అర్థం కాలేదు.' బాబు భార్య వాపోయింది.

18 ఏళ్లకే నూరేళ్లూ..

ఈ ప్రమాదంలో చనిపోయిన కేశవ కుటుంబ పరిస్థితి మరింత దయనీయం. ఇతనికి 18 ఏళ్లకే నూరేళ్లూ నిండిపోయాయి. ఇతని కుటుంబానికి ఇతనే ఆదరవు. తండ్రి, ముగ్గురు చెల్లెళ్లున్నారు. వచ్చే సంపాదనతోనే కుటుంబం మొత్తం ఆధారపడుంది. ఇప్పుడు వీరి పరిస్థితి ఏటూ తెలీని పరిస్థితి.

ఇష్టపడి పెళ్లి చేసుకున్నాం

మాది మొరం గ్రామం. మేము ఇష్టపడి ఈ మధ్యనే పెళ్లి చేసుకున్నాం. మాకు పిల్లలు కూడా లేరు. ఇప్పుడు నా బతుకు ఇట్టా అయిపోయింది. ఎలా బతకాలో అర్థం కావడం లేదు. అని రమేష్ భార్య వాపోయింది.

అండగా ఉంటాడని చదివించాం

నా పేరు జయమ్మ. మాకు ముగ్గురు కొడుకులు. చిన్నవాడు రామచంద్రయ్యను చదివించుకున్నాను. మిగిలిన ఇద్దరికి చదువు రాలేదు. వీడు డిగ్రీ వరకు చదివాడు. కుటుంబానికి అండగా ఉంటాడని అనుకున్నా. ఇంతలోనే ఇలాగ అయిపోయింది.

నో క్యాష్.. నాట్ వర్కింగ్..

(మొదటిపేజీ తరువాయి)

ప్రయివేటు బ్యాంకులను ప్రోత్సహించేందుకు జాతీయ బ్యాంకులను ఈ విధంగా నిర్వీర్యం చేసే కుట్రలో భాగమే ఇదని కూడా వినవస్తోంది. ఏమైనా సామాన్యుల పరిస్థితి మళ్లీ పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లయింది. అనంతపురం జిల్లాలోని బ్యాంకుల్లో దాచుకున్న రూ.17 వేల కోట్ల డిపాజిట్లలో ఎఫ్ఆర్‌డిఐ బిల్లు భయంతో దాదాపు రూ.వెయ్యి కోట్లు వెనక్కు తీసుకున్నట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. సాధారణ రోజుల్లో రూ.కోటి నుంచి రూ.రెండు కోట్ల వరకు లావాదేవీలు జరిగేవి. ప్రస్తుతం రూ.పది లక్షలు పెట్టడానికి కష్టంగా ఉందని ఓ బ్యాంకు ఉన్నతాధికారి చెప్పారు. బ్యాంకుల సేవలపై సర్వీసు టాక్సు, కనీస నిల్వ లేకుండటంపై జరిమానాలతో ప్రజలు బెంబేలెత్తున్నారని, అందువల్ల కూడా కొత్త డిపాజిట్లు రావడం లేదని గుంటూరులో పేరు చెప్పడానికి ఇష్టపడని బ్యాంక్ అధికారి ఒకరు తెలిపారు. కృష్ణాజిల్లాలో ఒక్కో ప్రధాన బ్యాంకుకు రోజువారీ చెల్లింపులకు రూ.80 లక్షల నగదు అవసరం. దీనికి సరిపడా నగదు బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ అయ్యేది. కానీ ప్రస్తుతం ఒక్కో దానిలో రూ.50 లక్షలు మాత్రమే డిపాజిట్ అవుతోంది. రోజు వారీ చెల్లింపుల్లో రూ.30 లక్షలకుపైగా వ్యత్యాసం ఉంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో రోజువారీ నిర్వహణకు కనీసం రూ.10 లక్షలు, నగరంలోని బ్రాంచీ కార్యాలయాల నిర్వహణకు రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు నగదు అవసరం ఉంటుంది. అయితే బ్యాంకులకు 40 శాతం వరకు డిపాజిట్లు తక్కువగా వస్తున్నాయి. దీంతో జిల్లాలో గణనీయంగా ఎటిఎంలు మూతపడ్డాయి. విశాఖపట్నం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటురంగ బ్యాంకులకు సంబంధించి 1100కిపైగా ఏటిఎం కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 700 వరకూ నగర పరిధిలోనే ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 632 ఎటిఎంలు పనిచేయడం లేదని ప్రాథమిక లెక్కలు చెబుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లాకు రూ.500 కోట్లు అవసరం ఉందని, రిజర్వు బ్యాంకు నుంచి జిల్లాకు రెండు మూడు రోజుల్లో రూ.200 కోట్లు రావచ్చని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సుబ్రహ్మణ్యం చెబుతున్నారు.

డబ్బులందక నానా అగచాట్లు

అనంతపురానికి చెందిన టైలర్ ఎ.రమేష్.. వృత్తిరీత్యా తాను టైలర్‌నని, రోజూ పనిచేస్తే తప్ప జీవనం సాగదని, తన దుకాణంలో మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నానని, వారికి దినకూలి చెల్లించడానికి ఎంతో ఇబ్బంది పడుతున్నాని అన్నారు. ఆంధ్రా బ్యాంకులో రూ. 5 లక్షల అప్పు ఇచ్చారని, నగదును తీసుకోవడానికి వెళ్తే మూడు సార్లు వాయిదా పద్ధతిలో ఇచ్చారని కర్నూలుకు చెందిన పొదుపు మహిళ మద్దమ్మ అన్నారు. తనకు పెన్షన్ వస్తోందని, ఎటిఎంల వద్దకు వెళ్తే డబ్బులు రావడం లేదని, పాస్‌బుక్ తీసుకొని బ్యాంకుకు వెళ్తే రూ. 4 వేలు తీసుకోండని చెబుతున్నారని ఇదే జిల్లాకు చెందిన రిటైర్డ్ తహశీలుదారు చంద్రశేఖర్ అన్నారు. నగదు తీసుకోవడానికి కష్టపడాల్సి వస్తోందని, ప్రభుత్వం జోక్యం చేసుకుని ఎటిఎంలో డబ్బులు ఉండే విధంగా చూడాలని తిరుపతికి చెందిన కాంట్రాక్టరు జోగయ్య అన్నారు. ఏటిఎంలో రోజుకు 45వేలు తీసుకునే సదుపాయం ఉందని, గంటల తరబడి నిలబడితే రూ.పదివేలు మించి రావడం లేదని తిరుపతికే చెందిన జ్యూయలరీ వ్యాపారి కృష్ణ అన్నారు. తన తల్లి ఆరోగ్యం క్షీణించిందని, తిరుపతిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్చాల్సి వచ్చిందని, అడ్వాన్స్ చెల్లించేందుకు ఏ ఎటిఎం దగ్గరకు వెళ్లినా డబ్బు రావడం లేదని వెంకటేష్ అన్నారు. అయితే డబ్బు చెల్లించేందుకు డాక్టర్లు మరుసటిరోజుకు అవకాశమిచ్చారని, వైద్యులు సకాలంలో వైద్యం చేయకపోతే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అవసరమైనప్పుడు డ్రా చేసుకునే అవకాశం, భద్రత ఉంటాయనే నగదును బ్యాంక్‌లో జమ చేశామని, కొద్ది రోజుల్లో తన మేనకోడలు వివాహ పెళ్లి ఖర్చులున్నాయని గుంటూరుకు చెందిన విశ్రాంతి ఉద్యోగి మోహన కృష్ణ అన్నారు. పెళ్లికి అవసరమైనవి కొనాలంటే చేతిలో నగదు లేక ఇబ్బంది పడుతున్నామని అన్నారు. ఎటిఎంల్లో నగదు ఉండడం లేదని, బ్యాంకులకు వెళ్తే చాలా తక్కువ ఇస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం చిన్నరావుపల్లికి చెందిన మొదలవలస సాగర్ చెప్పారు.

బ్యాంకు అధికారులు చెప్పే కారణాలివీ...

- రిజర్వు బ్యాంకు నుంచి రావలసిన నగదులో సగమే వస్తోంది.
- ఖాతాదారుల నుంచి బ్యాంకులకు నగదు చేరిక తగ్గింది
- ఎఫ్ఆర్‌డిఐ బిల్లు భయంతో బ్యాంకుల్లో డిపాజిట్లు వెనక్కి తీసుకుంటున్నారు
- కొద్దికాలం కిందటి వరకూ ఒక్కో బ్యాంకులో రోజుకు రూ.కోటి నుంచి రెండు కోట్లు లావాదేవీలుండేవి.
- ప్రస్తుతం పది లక్షలు కూడా పెట్టడానికి కూడా కష్టంగా ఉంది.
- ప్రస్తుత పరిస్థితిని అధిగమించడానికి ఆర్‌బిఐ నుంచి నిర్దిష్ట ఆదేశాలేమీ లేవు.
- బ్యాంకుల సేవలపై సర్వీసు టాక్సు, కనీస నిల్వపై జరిమానాలతో ప్రజలు బెంబేలు చెందుతున్నారు.

జిల్లా	మొత్తంఎటిఎంలు	మూతపడినవి
అనంతపురం	575	500
కర్నూలు	1000	900
గుంటూరు	824	700
కృష్ణా	960	750
తూర్పుగోదావరి	931	450
విశాఖపట్నం	1100	632

మా కుటుంబం గర్వపడుతోంది

చిరంజీవి


వరుణ్ తేజ్, చిరంజీవి

'తొలిప్రేమ' సినిమాలో వరుణ్ తేజ్ చాలా పరిణితిగా నటించాడు. సినిమాలో తనని చూస్తున్నంత సేపు ఎవరో యంగ్ బాయ్ నటిస్తున్నట్లు అనిపించింది. ప్రేమ సన్నివేశాలు...ఇగో క్లాషెస్ సన్నివేశాల్లో వరుణ్, రాశీఖన్నా చాలా ఇన్వాల్వ్ అయి చేశారు. వరుణ్ పెర్ఫార్మెన్స్ చూసి మా ఫ్యామిలీ అంతా గర్వపడుతోంది" అని చిరంజీవి అన్నారు. వరుణ్ తేజ్, రాశీ ఖన్నా చేసిన సినిమా ఇది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ నిర్మించారు. ప్రస్తుతం విజయవంతంగా నడుస్తోంది. ఈ సందర్భంగా ఈ సినిమా బృందాన్ని చిరంజీవి తన ఇంటికి ఆహ్వానించి సన్మానించారు.

చిరంజీవి మాట్లాడుతూ, "తొలిప్రేమ' పెద్ద విజయం అయిన సందర్భంగా టీమ్ అందరికీ అభినందనలు. సినిమా ఆలస్యంగా చూశాను. చూసి చాలా స్ఫూర్తిని పొందాను. నా తమ్ముడు పవన్ 'తొలిప్రేమ' టైటిల్‌తో వచ్చిన సినిమా అని చాలా ఆసక్తి కలిగింది. ఇదొక సమకాలీన ప్రేమకథ. కథ కన్నా సందర్భానుసారంగానే సినిమా అంతా ఉంటుంది. ఇలా సినిమా చేయడం డైరెక్టర్‌కి చాలా పెద్ద ఛాలెంజిగ్. సినిమా ఇంత నూతనంగా ఉందంటే కారణం ఆలోచనే. ఓ కొత్త కోణంలో సినిమా చూపించారు. ఇలాంటి డైరెక్టర్స్ ఇండస్ట్రీకి రావాలి. ఇలాంటి సినిమా వల్ల మన పక్క సినీ పరిశ్రమలు మన గురించి మాట్లాడుకుంటున్నాయి. తెలుగు పరిశ్రమ గర్వపడే సినిమా ఇది. నటీనటులంతా పాతవాళ్లే. కానీ అన్ని పాత్రలు చాలా కొత్తగా కనిపించాయి. వరుణ్ ఎత్తుకు డాన్సులు ఎంత వరకు కుదురుతాయని లోలోపల అనుమానం ఉండేది. కానీ ప్రతీ స్టెప్‌ను బాగా అడాప్ట్ చేసుకుని చేశాడు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే కమర్శియల్ సినిమా ఇది. థమన్ సంగీతం చాలా బాగుంది. కోరియోగ్రాఫర్ సతీష్, శేఖర్ మాస్టర్ డ్యాన్సులన్నింటినీ సందర్భానుసారం కంపోజ్ చేశారు. కెమెరామెన్ జార్జ్ పనితనం ప్రశంసనీయం. వరుణ్‌ను మరింత అందంగా, రాశీ ఖన్నాను గ్లామర్ డాళ్‌గా చూపించారు. నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్, చరణ్ అభిమానించే నిర్మాత. ఈ సినిమా కోసం ఆయన ఖర్చుకు ఏ మాత్రం వెనుకడుగు వేయలేదు. 60 రోజుల్లోనే సినిమా పూర్తిచేయడం చాలా గొప్ప విషయం. ఈ సక్సెస్ నాగబాబుకి ప్రైడ్ మూమ్ మెంట్. వరుణ్ వాళ్ల నాన్నకి మంచి బహుమతి ఇచ్చాడు' అని అన్నారు.

అనంతరం చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'చిన్నప్పుడు 'స్టువర్ట్ పురం పోలీస్ స్టేషన్' సినిమా సమయంలో చిరంజీని చూశాను. మళ్లీ ఇన్నాళ్లకు చిరంజీవి పక్కన కూర్చుని మాట్లాడే అవకాశం కలిగింది. ఈ అనుభూతి ఎప్పటికీ మర్చిపోలేను. చిరంజీవి సినిమా చూసి నచ్చి మమ్మల్ని ఇలా పిలిపించి మాట్లాడటం చాలా సంతోషంగా..గర్వంగా ఉంది' అని పేర్కొన్నారు.

నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ మాట్లాడుతూ '33 ఏళ్ల క్రితం సినిమాలు చేద్దామని మద్రాస్ వెళ్లాను. ఆ సమయంలో పసుపులేటి రామారావు ద్వారా చిరంజీవి ఇంటికి వెళ్లాను. నిర్మాత కన్నా అక్కడ ఓ అభిమానిగానే చిరంజీవితో పరిచయం జరిగింది' అని అన్నారు.

వరుణ్ తేజ్ మాట్లాడుతూ 'నాకు యాక్టర్ అవ్వాలన్న ఆలోచన పెదనాన్నని చూసే వచ్చింది. ఈ రోజు డాడి వచ్చి మంచి మాటలు చెబుతుంటే చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు.

'ఛలో' డైరెక్టర్‌కు కారు బహుమతి

ఐరా క్రియేషన్స్ బ్యానర్లో శంకర్ ప్రసాద్, ఉషా నిర్మాతలుగా నాగశౌర్య, రష్మిక జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'ఛలో'. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్‌తో దూసుకెళ్తోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ఉష ముల్పూరి ఈ చిత్రానికి పనిచేసి 24 క్రాఫ్ట్ వాళ్ళని సత్కరించారు. దర్శకుడు వెంకి కుడుములకి కారు గిఫ్ట్‌గా ఇచ్చారు.

ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'గతంలో మేము మా ఫ్యామిలీతో సినిమాలు చూసేవాళ్ళం. సినిమా తీయాలంటే హీరో, హీరోయిన్, దర్శకుడు ఉంటే చాలు అనుకునేవాళ్ళం కానీ.. ఐరా క్రియేషన్స్ ప్రారంభించాక తెలిసింది తెర మీద కనిపించే వారి వెనుక వందలాది శ్రామికుల కష్టం ఉంటుందని. ఐరా క్రియేషన్స్‌లో ఛలో చిత్రం ప్రారంభమైన రోజునే ఈ చిత్ర విజయం సాధిస్తే తప్పకుండా 24 క్రాఫ్ట్‌లోని ప్రతి ఒక్కరినీ సత్కరించాలని నిర్ణయించాం. దర్శకుడు వెంకి కుడుముల మాకు కథ చెప్పటం అది మాకు నచ్చటం వెంటనే ప్రారంభించటం జరిగిపోయాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ సంస్థ మొదలు పెట్టడానికి మా దర్శకుడే కారణం. అందులోనూ మంచి చిత్రమిచ్చినందుకు కారును బహుమతిగా ఇచ్చాం' అని అన్నారు.



నాగ శౌర్య, ఉష ముల్పూరి, వెంకీ కుడుముల తదితరులు

వెంకి కుడుముల మాట్లాడుతూ ' నా తల్లిదండ్రులు సినిమాకి వెళతానంటే డబ్బులిచ్చారు. నాగసౌర్య తల్లిదండ్రులు డబ్బులిచ్చి సినిమా తీశారు. వారి రుణం ఏ నాటికీ మర్చిపోలేను. ఈ చిత్రం చేసే అవకాశం ఇవ్వటమే నాకు గిఫ్ట్, ప్రేక్షకులు బ్లాక్‌బస్టర్ హిట్ చేయటం డబుల్ గిఫ్ట్ అయితే ఇప్పుడు నాకు కారు గిఫ్ట్ ఇవ్వటం అనేది నేను జీవితంలో మర్చిపోలేని గిఫ్ట్‌గా ఫీలవుతున్నాను. నాగసౌర్య అనే వ్యక్తి నాకు పరిచయం కాకపోతే నాకు ఈ జీవితం లేదు. ఎప్పటికీ నేను గుర్తుపెట్టుకునే నా హీరోకి నా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

'చెన్నై చిన్నోడు' గీతావిష్కరణ

జి.వి ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తూ సంగీతాన్ని సమకూర్చిన ఓ తమిళ చిత్రాన్ని 'చెన్నై చిన్నోడు'గా తెలుగులో విడుదల చేస్తున్నారు. వీడి లవ్‌లో అన్నీ చిక్కులే అనేది ట్యాగ్‌లైన్. శూలిని దుర్గా ప్రొడక్షన్స్ పతాకంపై తెలుగులోకి అనువదిస్తున్నారు వి.జయంత్ కుమార్. నిక్కీ గల్రానీ , రక్షిత హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి ఎం.రాజేష్ దర్శకుడు. ఈ చిత్రంలోని పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ సీడీలను ఆవిష్కరించారు.

నిర్మాత వి.జయంత్ కుమార్ మాట్లాడుతూ 'ఎక్కడా రాజీ పడకుండా తెలుగు స్ట్రెయిట్ సినిమాలా డబ్బింగ్ కార్యక్రమాలు చేయించాం. పూర్ణచారి పాటలన్నింటికీ అర్ధవంతమైన సాహిత్యాన్ని సమకూర్చారు. ఆద్యంతం కడుపుబ్బా నవ్వించే చక్కని కామెడీ ఎంటర్ టైనర్. ప్రకాష్ రాజు పోలీస్ పాత్ర సినిమాకు హైలైట్. అలాగే హీరో జీవా గెస్ట్ రోల్‌లో కనిపిస్తారు. అతి త్వరలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు.


నిక్కీ గల్రాని, జి.వి. ప్రకాష్, రక్షిత


రాధ, రమేష్

నీ ప్రేమ కోసం

సరోవర్ ఫిలిమ్స్ పతాకంపై కవి, కార్టూనిస్ట్, రచయిత ఉలి దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా 'నీ ప్రేమ కోసం'. ఉప్పుల గంగాధర్ నిర్మిస్తున్నారు. క్రైమ్ బేసిడ్ లవ్‌స్టోరీ. ఈ చిత్రంలో ప్రేమ, కుటుంబం, కులం, మతం, ఉగ్రవాదం, మావోయిజం వంటి సమస్యలపై చర్చించారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తయి నిర్మాణాంతర పనులు ముగింపు దశలో ఉన్నాయి. త్వరలో చిత్రాన్ని విడుదల చేయనున్నారు. జొన్న పరమేశ్, రాధ బంగారు, మచ్చ రవిందర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా : వేమూరి చంద్రశేఖర్.

మనసుకు నచ్చుతుంది

కొన్ని సినిమాలు జీవితాన్ని ఆవిష్కరిస్తాయి...అవి దైనందిన జీవితంలో సమస్యలకు పరిష్కారాలు చూపిస్తుంటాయి. మరికొన్ని వినోదాన్ని పండిస్తాయి. ఇంకొన్ని చిత్రాల్లో సన్నివేశాలు, సందర్భాలు చక్కటి అనుభూతిని కలిగిస్తాయి. అలాంటి కోవలోకి 'మనసుకు నచ్చింది' సినిమా వస్తుంది. కృష్ణ కుమార్తె మంజుల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి, నాజర్ తదితరులు నటించారు. ఆనంది ఆర్ట్స్‌తో కలిసి స్వరూప్ నిర్మించారు.



చిత్ర సమీక్ష

చిత్రం: మనసుకు నచ్చింది
నటీనటులు : సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి, అదిత్ అరుణ్, ప్రియదర్శి తదితరులు
సాంకేతికత : సంగీతం: రధన్, ఛాయాగ్రహణం : నిరియాదవ్, ఎడిటింగ్ : సతీష్ సూర్య, నిర్మాత : పి.కిరణ్.. సంజయ్ స్వరూప్, రచన, దర్శకత్వం : మంజుల ఘట్టమనేని

కథ : చిన్నప్పటి నుంచీ స్నేహం, సరదా, పెంకితనం...ఇలా అన్నీ కలబోసి పెరిగిన ఇద్దరు స్నేహితులకు వారి పెద్దలు వివాహం చేయాలని నిర్ణయించుకుంటారు. సరిగ్గా పెళ్లి రోజే ఇద్దరూ పారిపోతారు. తమ మనసుకు నచ్చినట్లు జీవించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతారు. అలా గోవా వెళ్ళిన వారి ఇద్దరి జీవితాల్లోకి మరో ఇద్దరు ప్రవేశిస్తారు. సరిగ్గా ఎవరికివారు పెళ్లి చేసుకొనే సమయానికి తాము ఏం కోల్పోయామో తెలుసుకుంటారు. ఆ తర్వాత వారు తీసుకున్న నిర్ణయం ఏమిటి? అనేది సినిమా.

విశ్లేషణ : ఫీల్‌గుడ్ సినిమా అనేది కొన్ని కథలకు సరిపోతుంది. ప్రకృతి ప్రేమికురాలిగా నటించిన అమైరా.. అందులో అందాన్ని ఆహ్లాదాన్ని చూసి ప్రకృతితో పరవశించి పోతుంది. దానికి విరుద్ధంగా ప్రవర్తించే కుర్రాడిగా సందీప్. కానీ పరిస్థితుల ప్రభావం వల్ల తన మనసు కూడా ప్రకృతిని ప్రేమించమని చెబుతుందని తెలుసుకుంటాడు. ఈ క్రమంలో సాగే సన్నివేశాలు అన్నీ చాలా ఆహ్లాదకరంగా ఉంటాయి. దర్శకత్వంలో కొత్త అయినా తన మనసులోతుల్లోంచి ఆవిష్కరించిన కథ, కథనం చిత్రానికి ప్రధాన ఆకర్షణ. మనిషి జీవితంలో ఏదైనా సాధించాలంటే మనసుకు నచ్చింది చేయాలి. అది ఉద్యోగమైనా, పెళ్లయినా. ఇది మన ముందున్న జనరేషన్స్ చేయలేకపోయాయి. అందువల్ల తాము ఎంతో కోల్పోయమని నాజర్ తరాన్ని ఉద్దేశించి చెప్పినట్లే.. ఇప్పటి తరం ఫాస్ట్ యుగంలో ఏదో సంపాదించాలనీ, అదే అసలైన జీవితం అనుకుని చిన్నచిన్న ఆనందాలు కోల్పోతున్నారు. ఒక్కసారి మనసుపెట్టి నీ హృదయం ఏం చెబుతుందో చూస్తే మన గురించి మనం తెలుసుకుంటాం. మనసుపెట్టి జీవితాన్ని అర్థం చేసుకోవాలి. సూర్యోదయం, సూర్యాస్తమయం... పక్షుల హొయలు, ఎన్నెన్నో ప్రకృతి అందాలు ఈ లోకంలో ఉన్నాయి. ఇక్కడ ప్రతిదీ మనతో ఏదో చెప్పాలని చూస్తుంది. దాన్ని గుండెతో ఆస్వాదిస్తే మనిషికి అంతకన్నా ఆరోగ్యం ...ఆనందం లేదు. ఈ విషయాన్ని తనదైన శైలిలో చక్కగా దర్శకురాలు చెప్పింది. పాత్రల పరంగా అందరూ బాగా నటించారు. ముఖ్యంగా. సందీప్, అమైరా సన్నివేశపరంగా అలరించారు.

సాంకేతికపరంగా రవి యాదవ్ సినిమాటోగ్రఫీ సినిమాకి కలిసొచ్చే అంశం. ప్రతి ఫ్రేమ్ ఒక పెయింటింగ్‌లా ఉంది. కొన్ని అనవసర గ్రాఫిక్ షాట్స్‌ను పక్కనపెట్టేస్తే ఈ సినిమాలో ఆయన కెమెరా పనితనం బాగుంది. రధన్ సంగీతం, సాయిమాధవ్ మాటలు... పాటలు బాగున్నాయి. గ్యాప్ లేకుండా వెంటవెంటనే వచ్చేయడంతో ఆ పాటలని ఎంజాయ్ చేయలేం. నిర్మాణ విలువలు బాగున్నాయి.

ఇక దర్శకురాలు మంజుల ఘట్టమనేని చేసిన ఈ సినిమా చూస్తే 'నువ్వే కావాలి', 'ఆనందం', 'సొంతం' లాంటివి చిత్రాలు స్ఫురిస్తాయి. ప్రకృతి అందాల్ని మనిషికి అన్వయించే వ్యక్తితో జోడించిన తీసిన ఈ సినిమా ఆ ప్రకృతిని ప్రేమించే వారికి నచ్చుతుంది.

'గోలీ సోడ' సందేశాత్మకమే కానీ..!

బాలనటుడిగా పలు చిత్రాలు చేసిన మానస్.. కథానాయకుడిగా చేసిన సినిమా 'సోడ గోలీ సోడ'. నటుడిగా తనేంటో నిరూపించుకున్నా... కథానాయకుడిగా నిలబడడానికి పలు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈసారి మాస్ అంశాన్ని తీసుకుని చేశాడు. డాక్టర్ అయిన భువనగిరి సత్య నిర్మాతగా మారారు. ఈ చిత్రంతో మల్లూరి హరిబాబు దర్శకుడిగా పరిచయమయ్యాడు. శుక్రవారం ఈ సినిమా విడుదలైంది.



నటీనటులు : మానస్, నిత్యా నరేష్, కారుణ్య, బ్రహ్మానందం, కృష్ణభగవాన్, అలి, గౌతంరాజు తదితరులు
సంగీతం : భరత్, నిర్మాత : భువనగిరి సత్య సింధూజ, దర్శకత్వం : మల్లూరి హరిబాబు

కథ : ఇండస్ట్రీలో పెద్ద డైరెక్టర్ కావాలని కొరటాల వినాయక్ (అలీ) తాపత్రయం. అందుకు జువ్వా ప్రొడక్షన్స్ అనే బ్యానర్‌ని స్థాపించి సినిమా తీయాలని చూస్తాడు. దాని కోసం అప్పుల పాలవుతాడు. అయితే అతడి నిరీక్షణ ఫలించి కోటి రూపాయలు పెట్టే నిర్మాత దొరుకుతాడు. కానీ ఆ మొత్తం సరిపోదని ఇంకా ఎవరైనా భాగస్వామిని కలిస్తే బాగుంటుందనే వెదుకుతున్న సమయంలో దొంగ శ్రీను (మానస్) వారితో చేతులు కలుపుతాడు. ఊర్లో దొంగతనాలు చేసి దొంగ శ్రీనుగా ముద్రపడిన అతను ఊరి ప్రెసిడెంట్ కూతురు ప్రేమను పొందాలని..దాని కోసం హీరో అవ్వాలని హైదరాబాద్ వస్తాడు. ఆ విషయాన్ని పక్కనపెట్టి పెద్ద కోటీశ్వరుడినని నమ్మించి సినిమా ప్రారంభం అయ్యేలా చేస్తాడు. ఆ తర్వాత శ్రీను గురించి తెలుసిపోడంతో మళ్ళీ సినిమాకు బ్రేక్ పడుతుంది. మరి ఆ సినిమాని కంప్లీట్ చేయడానికి శ్రీను, కొరటాల వినాయక్ ఎలాంటి కష్టాలు పడ్డారు? చివరకు ఆ సినిమా పూర్తయ్యిందా? ఊరిలో తన ప్రేయసి దృష్టిలో హీరో అయ్యాడా? లేదా? అన్నది మిగిలిన సినిమా.

విశ్లేషణ : ఇది చాలా సింపుల్ కథ. దాన్ని ప్రెజెంట్ చేసే విధానం కీలకం. కొత్త దర్శకుడు కావడంతో కొంచెం తడబడ్డాడు. నటుడిగా మానస్ శ్రీను పాత్రలో ఒదిగిపోయాడు. డ్యాన్స్, నటనలోనూ మంచి పరిణతి కనబరిచాడు. తను ప్రేమించిన అమ్మాయి అడిగే ప్రశ్నలకు అతను పలికించిన హావభావాలు బాగున్నాయి. ప్రేయసిగా నిత్య నరేస్ ఫర్వాలేదు. దర్శకుడు కొరటాల వినాయక్ పాత్రలో అలీ కూడా మెప్పించాడు. నిరుద్యోగులను మలేషియా పంపిస్తూ పబ్బం గడుపుకునే బ్రోకర్‌గా బ్రహ్మానందం సరిపోయాడు. చమ్మక్ చంద్ర, జబర్దస్ ఆది, కృష్ణభగవాన్, ఫిష్ వెంకట్, గబ్బర్ సింగ్ బ్యాచ్ ఇలా అందరూ తమ తమ పాత్రలకు న్యాయం చేశారు. నవ్వించడానికి ప్రయత్నం చేశారు. కారుణ్య తన మేరకు నటించింది.

ముజీర్ మాలిక్ అందించిన ఛాయాగ్రహణం సినిమాకు మరింత ఆకర్షణగా మారింది. భరత్ అందించిన సంగీతం కూడా ఫరవాలేదు. భువనగిరి సత్య నిర్మాణ విలువలు బాగున్నాయి. ఇందులో యువతకు చక్కటి సందేశాన్ని ఇస్తూ దర్శకుడు చేసిన ప్రయత్నం అభినందనీయమే. దాన్ని సినిమాటిక్‌గా చూపించే ప్రయత్నాన్ని అర్ధాంతరంగా ముగించేశాడు. చివరిలో వాయిస్ వోవర్‌ను ఆర్.పి. పట్నాయక్ ఇచ్చాడు. స్వశక్తితో ఎదగాలని యువతకు సందేశం ఇస్తూ వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మించాడు. కానీ స్క్రీన్ ప్లే పరంగా మరిన్ని జాగ్రత్తలు తీసుకొని ఉంటే మరింతగా బాగుండేది. తొలి ప్రయత్నం అయినా సందేశంతో తీశాడు.

'47 డేస్'లో మొదటి గీతం

ప్రదీప్ మద్దాలిని దర్శకుడిగా పరిచయం చేస్తూ టైటిల్ కార్డ్ ఎంటర్ టైన్మెంట్ సంస్థ నిర్మిస్తున్న సినిమా '47 డేస్'. 'ది మిస్టరీ అన్ ఫోల్డ్స్' అనేది ట్యాగ్ లైన్. సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఈ మూవీ నుండి క్యా కరూన్...అంటూ అని సాగే మొదటి పాటను పూరి జగన్నాథ్ విడుదల చేశారు. రఘు కుంచె స్వరపరచిన ఈ గీతానికి సాహిత్యం లక్ష్మీ భూపాల్ అందించారు. నీహా కడివేటి పాడారు. సత్య దేవ్, పూజా ఝావేరి, రోషిని ప్రకాష్ ప్రధాన పాత్రలలో నటిస్తున్న ఈ మూవీకి దబ్బార శశిభూషన్ నాయుడు, రఘుకుంచే, శ్రీధర్ మక్కువ, విజయ్ శంకర్ డొంకాడ నిర్మాతలు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి.


మొదటి గీతం ఆవిష్కరించిన అనంతరం '47 డేస్' చిత్రబృందంతో పూరి జగన్నాథ్


అతుల్య, కేజీ

ప్రేమ పావురాలు

గత ఏడాది తమిళంలో విడుదలై విజయవంతమైన చిత్రం 'కాదల్ కన్ కట్టుదే'. ఇప్పుడు ఈ చిత్రాన్ని తెలుగులో 'ప్రేమపావురాలు' పేరుతో విడుదల చేయబోతున్నారు. ఆర్.శివరాజ్ దర్శకత్వం వహించారు. శ్రీరామ్ సినిమా బ్యానర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ ఇది. కేజీ, అతుల్య హీరో హీరోయిన్లు. ప్రస్తుతం పోస్టు ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శకుడు శివరాజ్ అందించిన కథ, కథనాలతో పాటు నటీనటుల ప్రధాన ఆకర్షణగా నిలుస్తారని నిర్మాత తెలిపారు. వేసవిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చెప్పారు.

జర్నీ



డార్జిలింగ్‌లో సేదతీరుదాం!

ప్రకృతి అందాలతో బౌద్ధులకు చిరునామాగా నిలిచే డార్జిలింగ్‌లో ఎన్నో వింతలు, విశేషాలు ఉన్నాయి. పశ్చిమబంగాకు ఉత్తర భాగాన 7004 అడుగుల ఎత్తున తూర్పు హిమలయాల్లో నేపాల్, భూటాన్‌కు చేరువలో డార్జిలింగ్ ఉంది. డార్జిలింగ్ బ్రిటిష్‌కాలం నుంచే పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దబడింది. ఇక్కడి పర్వతాలపైనుంచి కొండ శిఖరాలను చూస్తుంటే ఎన్నో రమణీయ దృశ్యాలు కనిపిస్తుంటాయి. పొగమంచు, ప్రకాశవంతమైన సూర్యాస్తమయం ఆకట్టుకుంటాయి. సాల్, ఓక్ చెట్లతో సమశీతోష్ణ అడవులు, ఎత్తయిన శిఖరాలతో ప్రకృతి ప్రేమికులను ఆనంద పారవశ్యంలో తేలియాడిస్తూ, అలసట మచ్చుకైనా దరిచేరనీయవు. అంతేకాదు, సహజమైన పార్కులకు, గార్డెన్‌లకు ఇది నిలయం.

మంచుతో కప్పబడిన కాంచన్‌జంగ పర్వత శిఖరాలతో అలరారుతున్న ప్రదేశం డార్జిలింగ్. అందుకే డార్జిలింగ్‌ను 'ప్రిన్సెస్ ఆఫ్ హిల్‌స్టేషన్' అంటారు. డార్జిలింగ్ అంటే పిడుగుల ప్రదేశమని అర్థం. తేయాకుకు ప్రసిద్ధిగాంచిన డార్జిలింగ్ దీని ఎగుమతులలో ప్రథమ స్థానంలో ఉంది. ఈ ప్రదేశమంతా చిన్న చిన్న జలపాతాల హోయలతో ఎటుచూసినా కనువిందుచేసే లోయలతో సందర్శకులను ఆకట్టుకుంటాయి. అలాంటి ఎన్నో రమణీయ దృశ్యాలకు నెలవైన డార్జిలింగ్ ప్రయాణమే ఈ వారం జర్నీ..!

గార్డెన్స్ స్పెషల్!


ఇక్కడి టాయిడ్ బొటానికల్ గార్డెన్ హిమాలయ పర్వత వృక్షజాతులకు ప్రసిద్ధి. డార్జిలింగ్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రాక్ గార్డెన్ చూడదగ్గ ప్రదేశాలలో ఒకటి. ఇక్కడ వివిధ రకాలుగా మలిచిన రాళ్ళపై పారుతున్న జలపాతాల తీరు సందర్శకులను మంత్రముగ్ధుల్ని చేస్తుంది. కూర్చొని చూసే విధంగా అక్కడ ప్రత్యేక ఏర్పాటు చేశారు. డార్జిలింగ్‌కు 13 కిలోమీటర్ల దూరంలో గంగమయ ఉంది. ఇక్కడ వాలుగా ఉండే కొండచరియల మీద రకరకాల పుష్పాలు దర్శనమిస్తాయి. అంతేకాదు, డార్జిలింగ్ సందర్శనీయ ప్రదేశాలలో చంచల్ లేక్ ముఖ్యమైంది. అది డార్జిలింగ్ పట్టణానికి కావలసిన నీటిని సరఫరా చేస్తుంది. ఇది డార్జిలింగ్‌కు 8032 అడుగుల ఎత్తున ఉంది. ఇలాంటి ఎన్నో ప్రకృతి దృశ్యాలకు పెట్టింది పేరు డార్జిలింగ్.

హిమలయన్ మౌంటనీరింగ్ ఇనిస్టిట్యూట్

ఎవరెస్టు శిఖర పర్వతారోహణకు సంబంధించిన శిక్షణా సంస్థ డార్జిలింగ్‌లోనే ఉంది. ఇక్కడే శిఖరారోహణ మ్యూజియం కూడా ఉంది. ఇందులో పర్వతారోహకులు తీసుకెళ్లే సామాగ్రి విశేషాలను చూడవచ్చు. అలాగే పర్వతారోహణకు వచ్చే విద్యార్థులకు, ట్రైనర్‌లకు హాస్టల్ వసతి, షాపింగ్‌లు చేసేందుకు అన్ని సౌకర్యాలు ఇక్కడ కల్పించబడ్డాయి.

వన్యప్రాణులకు నెలవు

హిమాలయన్ మౌంటనీరింగ్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలోనే పద్మజానాయుడు హిమాలయన్ జులాజికల్ పార్క్ ఉంది. హిమాలయాలకు సంబంధించిన అరుదైన వన్యప్రాణులకు ఈ జంతు ప్రదర్శనశాల నిలయం. రెడ్‌పాండా, మంచు చిరుతలు, టిబెటన్ నక్కలతో పాటు, వలస వచ్చే అరుదైన పక్షులు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తాయి. అంతేకాక, కొమ్ము ఖడ్గమృగాలు, ఏనుగులు, పులులు, మచ్చల జింకలు ఎన్నో డార్జిలింగ్‌లో కనువిందు చేస్తాయి. ఈ పార్క్‌లో సైబీరియన్ టైగర్స్ స్నో లిపర్ట్ బ్రీడింగ్ సెంటర్ ఉంది. డార్జిలింగ్‌లోని ఎత్తయిన ప్రదేశం టైగర్ హిల్. ఇది డార్జిలింగ్‌కు పదకొండు కిలోమీటర్ల దూరంలో ఉంది. మంచుతో కప్పబడిన తూర్పు హిమాలయాలలోని కాంచనగంగ పర్వత శిఖరాల మధ్య నుంచి సూర్యోదయాన్ని చూడటానికి ఉత్తమమైన చోటు ఇదే!



టాయ్ ట్రెయిన్

డార్జిలింగ్ పర్యటనలో తప్పకుండా చూడాల్సింది టాయ్ ట్రెయిన్ ప్రయాణం. ఇది పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. 1881లో బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన టాయ్ ట్రెయిన్ నేరోగేజ్ రైల్వేలైన్ మీద నడుస్తుంది. ఇక్కడి బటాసియా లూప్‌లో వలయాకారంలో ఉండే అంచులు చూడముచ్చటగా ఉంటాయి. ఇక్కడి నుంచి చూస్తే టీ తోటలు, నీటి ప్రవాహాలు ఎంతో అద్భుతంగా కనబడతాయి.



డార్జిలింగ్ భూభాగం, కాంచనగంగ తూర్పు హిమాలయ పర్వతశిఖరాలు చూపరులను ఇట్టే ఆకర్షిస్తాయి. అలాగే, ఒకేచోట కూర్చొని డార్జిలింగ్ అందాలను తనివితీరా చూడటానికి రోప్‌వే అనువైనది. రోప్ వేలో నుంచి డార్జిలింగ్ లోయ దృశ్యాలు, తేయాకు తోటలు, దట్టమైన అడవులు, పర్వత ప్రవాహాలు, జలపాతాలు, మంచు శిఖరాల్లాంటివి మనస్సును కట్టిపడేస్తాయి. కిందికి వచ్చిన తర్వాత తేయాకు తోటలలో తిరుగుతుంటే ఎంతో ప్రశాంతంగా, ఆనందంగా ఉంటుంది. అంతేకాదు, ట్రెక్కింగ్ వంటి సాహసక్రీడలకు ఇది అనువైన ప్రాంతం.

బెంగాల్ నేచురల్ హిస్టరీ మ్యూజియం

డార్జిలింగ్ పట్టణం మధ్యలో ఉండే ప్రాంతాన్ని చౌరస్తా అంటారు. ఇది మనోహరమైన, చదునైన, నాలుగు రోడ్ల కూడలి. అనేకమంది సందర్శకులు, నివాసితులు మండుటెండల్లో విశ్రాంతి తీసుకోవడానికి ఈ ప్రదేశం అనువుగా ఉంటుంది. ఇక్కడ ఒక పక్క పైన్ చెట్ల మధ్యలో నుంచి అందమైన పర్వత శిఖరాల దృశ్యం కనువిందు చేస్తుంటే, మరోపక్క బోటిక్ షాపులు అలరిస్తాయి.
ప్రశాంతంగా కూర్చోవడానికి వీలుగా బెంచీలూ ఏర్పాటు చేశారు. ఇక్కడికి దగ్గరలో 1903లో ప్రారంభించబడిన బెంగాల్ నేచురల్ హిస్టరీ మ్యూజియం ఉంది. ఈ మ్యూజియంలో రకరకాల సీతాకోకచిలుకలు, పక్షులు, వాటి గూళ్ల, గుడ్లు, క్షీరదాలు, సరీసృపాలు, చేపలు, కీటకాల్లాంటి రకరకాల వన్యప్రాణులను చూడవచ్చు. ఇవన్నీ సజీవంగా ఉన్నాయా అన్నట్లు ఉంటాయి. వీటిని రసాయనాలలో భద్రపరచి, ప్రదర్శనలో ఉంచారు.



టిబెటిన్ శరణార్థులు ఉండటానికి వీలుగా టిబెటిన్ రెఫ్యూజీ సెంటర్ ఉంది. డార్జిలింగ్ చరిత్రకు సంబంధించిన యుద్ధస్మారకం కూడా చూడదగ్గది. అంతేగాక, డార్జిలింగ్ హస్తకళలకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఊలు, సిల్కు, టంగ్‌కా, కంచు, రాగి, బంగారు ఆభరణాలను సందర్శకులు కొనుక్కోవచ్చు.

జపనీస్ ఆలయం

డార్జిలింగ్ నుంచి కారులో పది నిమిషాలు ప్రయాణిస్తే ఒక అందమైన ప్రదేశానికి చేరుకుంటాం. ఇది ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అదే జలపహార్ హిల్. ఇక్కడ జపనీయుల సంప్రదాయాలకు అనుగుణంగా నిర్మించబడిన ఆలయం ఉంది. బుద్ధుని నాలుగు అవతారాలుగా భావించే పెద్ద విగ్రహాలూ ఇక్కడికి దగ్గరలోనే ఉన్నాయి. వీటినే పీస్ పగోడా అంటారు. దివ్యమైన తేజస్సుతో విరాజిల్లే బుద్ధుని విగ్రహాలను చూడటానికి ఎంతోమంది బౌద్ధ సందర్శకులు ఇక్కడకు వస్తూ ఉంటారు. అంతేకాక, డార్జిలింగ్‌లోని కాళీమాత ఆలయం హిందువులకు, బౌద్ధులకూ సందర్శనీయ ప్రదేశంగా గుర్తింపు పొందింది. ఇక్కడే బౌద్ధుల గ్రంథాలయం కూడా ఉంది. అందుకే అంటారు డార్జిలింగ్ ప్రయాణం అంటే జీవితంలో మర్చిపోలేని ఓ మధుర అనుభూతి అని! ఇంకెందుకు ఆలస్యం మీరూ ప్రయాణానికి సిద్ధంకండి!!

సేకరణ : **చందు**

ఆ అడవి.. ఓ కళాఖండం



జపాన్‌లోని అరషియామాలో పర్యాటకులను మైమరిపించేలా చేసే ప్రాంతం 'బాంబూ ఫారెస్ట్'. అది ఒక అడవిలా కాకుండా కళాఖండంలా కనిపిస్తుంది. ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన ఇక్కడి దారుల డిజైన్ చూస్తే కచ్చితంగా ఎవరో కట్టిన..మానవ నిర్మితాలానే?. అనే అనుమానం కలగకమానదు. అచ్చం స్కేలు పెట్టి గీచినట్టు ఉండే వెదురుచెట్లు.. ఏపుగా, పచ్చగా పెరిగి ఉంటాయి. వెదురు చెట్లలో కాలిబాటకు అటూ ఇటూ చిన్న వెదురు కట్టెలతో రెయిలింగ్ చూడటానికి ముచ్చటేస్తుంది. వాటి మధ్యలో కొలిచి నిర్మించినట్టు ఉండే వెదురు బొంగుల మెట్ల దారి అలా కట్టిపడేస్తుంది. ఇంకో రూట్లో వెళితే వెదురు పలకలతో నిర్మించిన రోడ్డు. దానిమీద నడుస్తుంటే ఆ ఫీలింగే గొప్పగా ఉంటుంది.



మనోహరంగా పచ్చగా ఉండే ఆ వెదురు చెట్లలో ఒక్కోచోట ఒక్కోరకమైన కాలిబాటలు వేశారు. ఒకచోట విశాలంగా వెదురు రోడ్లు, మరోచోట చిన్న కాలిబాట మెట్లతో కూడిన దారి... ఇంకోచోట రాలిన ఆకుల మామూలు కాలిబాట.. ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన రాళ్లతో కూడిన కాలిబాట... అబ్బో ఒకటేమిటి ఎన్నో అందాలు. వీటిని కనులారా చూస్తే ఆ రోజంతా ఉదయం-సాయంత్రం వాకింగ్ చేస్తూ ఉండిపోవాలనిపిస్తుంది. ఇక్కడకు వచ్చి ఫొటో దిగని పర్యాటకుడు ఉండరంటే నమ్మండి! జపాన్ టూర్లన్నీ మార్చి-నవంబరు మధ్య వెళ్లడం మంచిది. క్యోటో టూర్ అయితే మే నుంచి వెళ్లడంవల్ల దేశంలో జరిగే ప్రముఖ ఫెస్టివల్స్‌ను చూసే అవకాశం వస్తుంది. ★

'జర్నీ'కి ఆహ్వానం



మన జీవితంలో కుటుంబ సమేతంగానో, స్నేహితులతోనో ఎన్నో ప్రయాణాలు చేస్తూ ఉంటాం. ఆ అనుభవాలు, విశేషాలు మాతో పంచుకునేందుకు 'జర్నీ' మీకు ఆహ్వానం పలుకుతోంది. మీ పర్యాటక అనుభూతులను మాకు రాసి పంపండి. లేదా మెయిల్ చేయొచ్చు. ఫొటోలు జత చేయడం మర్చిపోవద్దు.

మా చిరునామా

జర్నీ, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



చిన్నారి

పొడుపు కథ

సుతిమెత్తని లోహం
అలంకారంతో అందం
దండిగ ఉంటే ధనికం
ఇది ఖరీదైన తూకం?


జవాబు : బంగారం

జోక్ :

రాధ : మహీ! విమానం అంత పెద్దగా ఉంటుంది కదా! దానికి పెయింట్ ఎలా వేస్తారబ్బా?!


మహీ: విమానం గాలిలోకి ఎగిరినప్పుడు చిన్నగా అవుతుంది కదా?! అప్పుడు వేస్తారు.

చుక్కలు కలపండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని చుక్కలను కలిపి రంగులు వేయండి!

అరుదైన.. ఒకాపి



పిల్లలూ! మీరు ఎప్పుడైనా ఒకాపి అనే పేరు విన్నారా? వినలేదు కదా?! మరి ఈరోజు ఒకాపి గురించి తెలుసుకుందాం. ఒకాపి అనేది ఒక జంతువు. ఇది చూడటానికి మెడభాగం జిరాఫీలా, మధ్యభాగం గుర్రంలా, వెనుక భాగం చారలతో జీబ్రాలా ఉంటుంది. అందుకే దీనిని గుర్తించడం చాలా కష్టం. ఇవి ఎక్కువగా మధ్య ఆఫ్రికాలోని దట్టమైన అడవుల్లో సంచరిస్తుంటాయి. ఇవీ జిరాఫీ జాతికి చెందినవేనట! అయితే వీటిని గుర్తించడానికి చాలా సమయం పట్టింది. ఇవి ఎక్కువగా ఆకులు, పండ్లు తింటాయి. జంతువులు ఎక్కువగా ఆకులను తింటాయి. ఇది మనకు తెలిసిన విషయమే. అయితే ఇవి దాదాపు వంద రకాల ఆకులను తింటాయి. వాటిలో కొన్ని ఆకులు ఎలాంటివో తెలుసా? అవి తింటే మనుషులుగానీ, జంతువులుగానీ ప్రాణాపాయ పరిస్థితిలో పడిపోతారు. కానీ ఒకాపీలకు ఏమీకాదట.



ఇవి సుమారు 250-300 కిలోల బరువుంటాయి. పెద్ద చెవులు కలిగి ఉండే ఒకాపీలు చిన్న చిన్న శబ్దాలనూ ఇట్టే పసిగట్టేస్తాయి. వీటిలో చాలా విభిన్న లక్షణాలు ఉన్నాయి. అందువల్ల శత్రువులను బురిడీ కొట్టించి, వాటి నుంచి తేలికగా తప్పించుకోగలవు. అతి తక్కువ ప్రాంతాల్లో కనిపించే ఒకాపీలు అంతరించిపోతున్న జంతువుల జాబితాలో చేరిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం వీటి సంఖ్య 25,000 కంటే తక్కువగా ఉందట! ఆహారం కోసం చిరుతపులులు, మనుషులు వీటిని వేటాడితే ప్రస్తుతం ఆఫ్రికాలో వీటి చర్మంకోసం ఎక్కువగా వేటాడుతున్నారు. అడవులను ఎక్కువగా నరికి వేయడం, వీటిని ఎక్కువగా వేటాడుతున్నందువల్ల ఒకాపీలు కనుమరుగవుతున్నాయి. ఇలానే కొనసాగితే, రానున్న రోజుల్లో భవిష్యత్తు తరాల వారికి ఈ బొమ్మలను చూపించి.. ఒకాపీ అంటే ఇలా ఉంటుంది అని చెప్పాలేమో! ★



సంతోషాన్నిచ్చిన 'బాలోత్సవం!'

కొన్ని రోజుల క్రితం ఒక ఆదివారం విజయవాడలోని ఎం.బి.వి.కె. భవనంలోని చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో 'అమరావతి బాలోత్సవం' విజయోత్సవ వేడుకలు జరిగాయి. అక్కడకు మేం కొందరం స్నేహితులతో కలిసి వెళ్లాం. ఆ ఉత్సవాల్లో పాల్గొనడానికి వివిధ పాఠశాలల నుంచి ఎంతోమంది విద్యార్థులు వచ్చారు. ఆ రోజంతా ఆడిటోరియం కోలాహలంగా ఉంది. విద్యార్థులు నృత్యాలు, ఏకపాత్రాభినయం, నాటకాలను చాలానే ప్రదర్శించారు. విద్యార్థులు అలా ప్రదర్శనలు ఇస్తుంటే ఆడిటోరియం చప్పట్లు, ఈలలతో మారుమోగిపోయింది. ఆ ఉత్సవాలకు పత్తిపాక మోహన్‌గారు ముఖ్యఅతిథిగా వచ్చారు. సోషల్ యాక్టివిస్ట్ రమాదేవిగారు, ఆమె చేసిన వివిధ సేవా కార్యక్రమాల గురించి బాగా చెప్పారు. సభ ముగిసే సమయానికి మాకు చాలా ఆకలి వేసింది. అక్కడే నిర్వహకులు ఏర్పాటుచేసిన భోజనాలను కడుపునిండా తిన్నాం. కాసేపు బ్రేక్ తర్వాత 'మన స్కూల్' నాటకాన్ని ప్రదర్శించాం. అక్కడ అక్కడ డైలాగ్స్ చెప్పడంలో తడబడినా బాగానే నటించాం. పర్యావరణంపై మంచి సందేశమివ్వడమే ఆ నాటిక సారాంశం. ఇలా అమరావతి బాలోత్సవాలకు మేం వెళ్లడం నాకు చాలా సంతోషం అనిపించింది. సెలవురోజును ఇలా ఆడుతూ.. పాడుతూ గడపడం ఎంతో సంతోషం కలిగించింది.



పి. మిత్రారెడ్డి
10వ తరగతి, అరవింద హైస్కూల్, కుంచనపల్లి

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



చివరిదీ వదల్లేదు..

కోహ్లి అజేయ సెంచరీ • శార్దూల్ ఠాకూర్‌కు 4 వికెట్లు

సెంచూరియన్: భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న ఆరో వన్డేలోనూ టీమిండియా ఘనవిజయం సాధించింది. శుక్రవారం టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన సఫారీ జట్టును 204 పరుగులకే కట్టడి చేసింది. అనంతరం ఆ లక్ష్యాన్ని ఛేదించేక్రమంలో టీమిండియా 32.1 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా సారథి విరాట్ కోహ్లి అజేయ సెంచరీతో జట్టును ముందుండి గెలిపించాడు. దీంతో ఆరు వన్డేల సిరీస్‌ను టీమిండియా 5-1 గెలుచుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ విరాట్ కోహ్లికి లభించాయి. కోహ్లి అజేయం 129, రహానే 34 పరుగులు చేశారు. ఆ మ్యాచ్‌లోనూ రిజర్వ్ బెంచ్‌కు అస్సలు అవకాశమివ్వలేదు. పూర్తిస్థాయి జట్టుతోనూ ఆఖరివన్డేలోనూ బరిలోకి దిగింది.

మ్యాచ్ ప్రారంభం నుంచే భారత బౌలర్లు సఫారీ జట్టును కట్టడి చేయడానికే ప్రాధాన్యతనిచ్చారు. ఎక్కడా అత్యుత్సాహం ప్రదర్శించకుండా నిలకడగా బౌలింగ్ చేసి వరుసగా వికెట్లను పడగొట్టారు. అయితే భువనేశ్వర్ స్థానంలో జట్టులో చోటు దక్కించుకున్న శార్దూల్ ఆరంభంలోనే సఫారీలకు షాక్ ఇచ్చాడు. ఇన్నింగ్స్‌లో 74 బంతులు ఆడిన జోండో 3 ఫోర్లు, 2 సిక్సులతో 54 పరుగులు చేశాడు. కానీ మిగతా ఆటగాళ్లు జోండోకు సరైన సహకారం అందివ్వలేకపోయారు. ఆఖర్లో ఫెల్యూక్వియో (34), మోర్కెల్(20) రాణించడంతో దక్షిణాఫ్రికా 46.5 ఓవర్లలో 204 పరుగులు చేసి ఆలౌట్ అయింది. భారత బౌలింగ్‌లో శార్దూల్ 4, బుమ్రా, చాహల్‌లకు రెండేసి వికెట్లు, పాండ్యా, కుల్దీప్ తలా ఒక వికెట్ పడగొట్టారు. టీమిండియా సారథి విరాట్ కోహ్లి భువనేశ్వర్‌పై ఒత్తిడి తగ్గించాలనే ఉద్దేశ్యంతో అతనికి విశ్రాంతి నిచ్చి మరో పేసర్ శార్దూల్ ఠాకూర్‌ను తుది జట్టులోకి తీసుకున్నట్లు విరాట్ వెల్లడించాడు. మరోవైపు చివరి వన్డేలో సఫారీ జట్టులో నాలుగు మార్పులు చోటు చేసుకున్నాయి. గత మ్యాచ్‌కు దూరంగా ఉన్న క్రిస్ మోరిస్, బెహార్డీన్, తాహిర్, జోండోలను సఫారీల తుదిజట్టులో అవకాశం కల్పిస్తున్నట్లు ఆ జట్టు సారథి మార్క్రమ్ తెలిపాడు.

ఠాకూర్ మెరుపులు...

సిరీస్ ఆరంభం నుంచి నిలకడగా బౌలింగ్ చేస్తూ వచ్చిన బౌలర్లు ఈ మ్యాచ్‌లోనూ అదే ప్రదర్శన కొనసాగించారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు పిలిచిన సౌతాఫ్రికాను ఫాస్ట్ బౌలర్ శార్దూల్ ఠాకూర్ మొదటి నుంచే కట్టడి చేశాడు. నాలుగో అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న శార్దూల్ ఠాకూర్ ఈ మ్యాచ్‌లో ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. ముందుగా ఓపెనర్ బ్యాట్స్‌మెన్ మర్క్రమ్ 24, ఆమ్లా (10)ను తొలి పది ఓవర్లకే పెవిలియన్ బాట పట్టించాడు.

కోహ్లి మరో రికార్డు..

ఆరో వన్డేలో భారత సారథి విరాట్ కోహ్లి మరో రికార్డును సొంతం చేసుకున్నాడు. వన్డేలలో 208 వన్డేల్లో 100 క్యాచ్‌లు పట్టిన తొలి క్రీడాకారుడిగా కోహ్లి రికార్డు సృష్టించాడు.



15 కిలోమీటర్ల క్రాస్‌కంట్రీ స్కీయింగ్‌లో భారత్ తరుపున పాల్గొన్న జగదీష్ సింగ్ (103వ స్థానం)

సౌకర్యాల కల్పనలో భారత ప్రభుత్వ వైఫల్యం

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా) : వింటర్ ఒలింపిక్స్‌కు క్రీడాకారులను పంపే విషయంలో... వారికి సరైన సౌకర్యాలు కల్పించడంలో భారత ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. మన దేశం తరపునుండి కేవలం ముగ్గురు మాత్రమే ఈ ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు. 'లూజ్' విభాగంలో కేశవన్ 31వ స్థానంలో నిలిచాడు. నేడు జరిగిన 15 కిలోమీటర్ల క్రాస్‌కంట్రీ స్కీయింగ్‌లో జగదీష్ సింగ్ 103వ స్థానం పొందాడు. మరో అథ్లెట్ రంగంలోకి దిగాల్సివుంది. ఈ అథ్లెట్లకు భారత ప్రభుత్వం సౌకర్యాలు కల్పించకపోవడంతో సొంత ఖర్చులతో కొరియా చేరుకోవాల్సిన పరిస్థితి మన అథ్లెట్లకు వచ్చింది. కొరియా, స్లోవేనియా, స్లోవేకియా, బెలారస్ వంటి చిన్నదేశాలు సైతం తమ అథ్లెట్లకు సౌకర్యాలను కల్పించి పతకాల సాధనకు ప్రోత్సహిస్తున్నాయి. శుక్రవారం జరిగిన 15 కిలోమీటర్ల క్రాస్‌కంట్రీ స్కీయింగ్‌లో మొత్తం 119 అథ్లెట్లు పాల్గొన్న ఈవెంట్‌లో 103వ స్థానంలో నిలిచాడు. అతడు ఫినిషింగ్ లైన్‌ను 43 నిమిషాల 0.3 సెకన్లలో చేరుకున్నాడు. బంగారు పతకం సాధించిన స్విట్జర్లాండ్‌కు చెందిన డారియో కొలగ్నా (33:43.9 టైమింగ్) కంటే 9:16.4 సెకన్ల దూరంలో నిలిచాడు. ఈ విభాగంలో నార్వేకు చెందిన సిమెన్ క్రూజర్‌కు రజిత, ఒలిపింక్ అథ్లేట్ ఫ్రం రష్యాకు చెందిన డానేష్ స్పిట్స్‌సోవ్‌కు కాంస్యపతకాలు లభించాయి.

క్రాస్‌కంట్రీ స్కీయింగ్ తరఫున మన దేశం తరపున పాల్గొన్న ఏకైక అథ్లెట్ జగదీష్ మాత్రమే. 29 ఏళ్ళ జగదీష్ సింగ్ వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి చాలా కష్టపడి ఇక్కడికి వచ్చాడు. మన ప్రభుత్వం సింగ్‌కు సరైన సౌకర్యాలు కల్పించడంలో ఘోరంగా విఫలమైంది. కనీసం అతడు ఈ పోటీలో పాల్గొనేందుకు అవసరమైన సూట్, కిట్‌లను ఇవ్వకపోవడంతో... తన సొంత ఖర్చులు రూ.72 వేలు పెట్టి కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. గుల్‌మార్గ్‌లోని ఆర్మీ వార్‌ఫేర్ స్కూల్‌లో స్కీయింగ్ నేర్చుకున్న సింగ్ ఇటీవల స్కాండియన్ కప్‌లో పాల్గొని వింటర్ ఒలింపిక్ అర్హత ప్రమాణాన్ని సాధించాడు. అనంతరం ఇతనికి కోచ్‌గా ఎవరిని పంపాలా అనే విషయంపై సమాఖ్యకు సింగ్‌కు శిక్షణ ఇచ్చిన ఆర్మీ స్కూల్‌కు మధ్య సయోధ్య కుదరలేదు. దీంతో చివరి నిమిషంలో అతను పోటీలకు వెళ్ళే విమానాన్ని ఎక్కలేకపోయాడు. అతడు రెండురోజుల ఆలస్యంగా ఇక్కడికి చేరుకోగా... కోచ్‌గా నదీమ్ ఇక్బాల్‌ను సమాఖ్య పంపింది. ఇన్ని అడ్డంకులను అధిగమించి... భారత ప్రభుత్వం కల్పించిన నామమాత్రపు సౌకర్యాలతో ఈ రేస్‌లో పాల్గొన్న సింగ్‌ను నిజంగా అభినందించాల్సిందే.

ఉత్కంఠభరితంగా జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం (తూర్పుగోదావరి)

ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న నిమ్మకాయల వెంకట రంగయ్య జాతీయ మెన్ అండ్ ఉమన్, డే అండ్ నైట్ వాలీబాల్ పోటీలు శుక్రవారం 4వ రోజు కూడా హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో అంతర్జాతీయస్థాయిలో ఆడిన క్రీడాకారులు పాల్గొనడంతో ప్రతి మ్యాచ్ ఆద్యంతం, ఉత్కంఠభరితంగా సాగుతోంది. దీంతో జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది క్రీడాభిమానులు తరలిరావడంతో గ్యాలరీలు కిక్కిరిసిపోయాయి.

వాలీబాల్ పోటీలు సజావుగా సాగేందుకు ఎన్‌విఆర్ టోర్నమెంట్ అధ్యక్షులు నిమ్మకాయల జగ్గయ్య నాయుడు, కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 4వ రోజు పోటీల్లో పురుషుల విభాగం నుంచి కర్ణాటక - కెఎస్‌ఇబి కేరళ, ఆంధ్రా - కేరళ పోలీస్, తమిళనాడు పోలీస్ - చెన్నై స్పైకర్స్, మహిళా విభాగంలో కర్ణాటక - సెయింట్‌జోసెఫ్ కేరళ జట్ల మధ్య పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మహిళా విభాగంలో కేరళకు చెందిన సెయింట్‌జోసెఫ్ జట్టుపై కర్ణాటక జట్టు విజయఢంకా మోగించింది. పురుషుల విభాగంలో కేరళకు చెందిన కెఎస్‌ఇబి జటుపై కర్ణాటక జట్టు విజయం సాధించింది.

అట్టహాసంగా జాతీయ కరాటే పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో 16వ అఖిలభారత బుడోకాన్ కరాటే ఛాంపియన్‌షిప్ సుమన్‌కప్-2018 పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విశాఖ బుడోకాన్ కరాటే అసోసియేషన్ అధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 13 రాష్ట్రాల నుంచి 850 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదహారేళ్లుగా నగరంలో బుడోకాన్ కరాటే పోటీలు నిర్వహిస్తూ కరాటే క్రీడలో నగరానికి గుర్తింపు తెస్తున్నారన్నారు. నిత్యం ఏదో ఒక క్రీడా పోటీలు జరుగుతూ నగరం క్రీడా హబ్‌గా రూపొందుతుందన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేసి ఒలింపిక్ పతకాలు సాధించి భారతదేశం ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మళ్ళ విజయప్రసాద్ అధ్యక్షత వహించారు. ముందుగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

టీ20ల్లో ఆసీస్ రికార్డ్ ఛేదన



ఆక్లాండ్ : ఆస్ట్రేలియా-న్యూజిలాండ్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న ట్రయాంగులర్ టీ20 సిరీస్‌లో ఆస్ట్రేలియా సరికొత్త రికార్డు ఛేదన చేసింది. శుక్రవారం కివీస్‌జట్టుపై అత్యధిక పరుగుల లక్ష్యం (245 పరుగులను) ఆస్ట్రేలియా ఛేదించి చరిత్ర సృష్టించింది. ఆక్లాండ్‌లో న్యూజిలాండ్-ఆస్ట్రేలియాల మధ్య జరిగిన టీ20 మ్యాచ్‌లో మొదట టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 6 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఆసీస్ 5 వికెట్లు మాత్రమే నష్టపోయి ఇంకా ఏడు బంతులు మిగిలి ఉండగానే 245 పరుగులు చేసి లక్ష్యాన్ని చేరుకుంది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో షార్ట్ 76, వార్నర్ 59, ఫించ్ 36, మాక్స్‌వెల్ 31, లిన్ 18 పరుగులతో రాణించారు. ఈ విజయంతో ఆసీస్ అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించి టీ20ల్లో రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకూ ఈ రికార్డు వెస్టిండీస్ పేరుమీద ఉంది. 2015 జనవరిలో జోహానెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20లో విండీస్.. ప్రత్యర్థి జట్టు నిర్దేశించిన 231 పరుగుల లక్ష్యాన్ని 19.2 ఓవర్లలో ఛేదించింది. విండీస్ ఈ మ్యాచ్‌లో 6 వికెట్లు నష్టపోయి 236 పరుగులు చేసింది. ఇప్పుడు ఈ రిక్డారును ఆసీస్ అధిగమించింది.

చంద్రబాబువన్నీ అబద్ధాలే

ఎమ్మెల్సీ వెన్నపూస గోపాలరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండారని వైసిపి ఎమ్మెల్సీ వెన్నపూస గోపాలరెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంటికో ఉద్యోగం, డ్వాక్రా, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి వంటి ఆరు వందల అబద్ధాలు ఆడి ప్రజలను మోసం చేశారని తెలిపారు. అధికారం చేపట్టిన తరువాత ముఖ్యమంత్రి అందరికీ తీవ్ర అన్యాయం చేశారని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు 15 సంవత్సరాలు కావాలన్న చంద్రబాబు ఇప్పుడు ఏ ప్రయోజనాలు ఆశించి ప్యాకేజీకి ఒప్పుకున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విభజన హామీలు అమలు చేయించడంలోనూ పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులనూ ఆయన వదలలేదన్నారు. 10వ పిఆర్‌సి బకాయిలు, కరువుభత్యం ఇవ్వకుండా ఇబ్బందుల పాలుజేస్తున్నారని తెలిపారు. 11వ పిఆర్‌సి గురించి ఇంత వరకు ఎటువంటి ప్రకటనా చేయలేదన్నారు.



బౌద్ధ సద్ధర్మ ఉపోస్త క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియ, బౌద్ధ గురువు ధమ్మధజ భంతేజీ, గోళ్ళ నారాయణరావు తదితరులు

విజయవాడలో బౌద్ధ విహారానికి కృషి

మంత్రి అఖిల ప్రియ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలో బౌద్ధ విహారానికి పర్యాటక శాఖ కృషి చేస్తుందని మంత్రి భూమా అఖిల ప్రియ తెలిపారు. సచివాలయంలో మంత్రి భూమా అఖిల ప్రియతో బౌద్ధ గురువు ధమ్మధజ భంతేజీ, విజయవాడ బుద్ధ విహార ప్రతినిధి గోళ్ళ నారాయణరావు తదితరులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విజయవాడతో పాటు అమరావతి, భట్టిప్రోలు, ఘంటసాల వంటి క్షేత్రాలకు బౌద్ధుల రాక పెరుగుతోందని పేర్కొన్నారు. ధమ్మధజ భంతేజీ మాట్లాడుతూ దుష్ట శిక్షణ, సంహారం కన్నా, దుష్టుల్లో పరివర్తన తేవడం మిన్న అని, అదే బౌద్ధ ధర్మం వివరించారు. విజయవాడలో బుద్ధ విహారం ఏర్పాటుకు స్థలాన్ని పర్యాటకశాఖ తరపున కేటాయించాలని ధమ్మధజ భంతేజీ, గోళ్ల నారాయణరావు మంత్రిని కోరారు. బుద్ధుడి బోధనలతో ముద్రించిన సద్ధర్మ ఉపోస్త క్యాలండర్ ను మంత్రి అఖిల ప్రియ ఆవిష్కరించారు. బుద్ధ ధర్మ సంఘం తరపున నరేంద్ర నాథ్ మంత్రికి కాలమ సూక్తం, ధర్మావరణం, సమ్మావాచ పుస్తకాలను బహూకరించారు.

తెలంగాణ పర్యాటక సదస్సుకు ఆహ్వానం

ఎపి పర్యాటక శాఖ మంత్రి అఖిలప్రియను ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పర్యాటక సదస్సు-2018కు అతిథిగా హాజరుకావాలని ఫ్యాప్సీ డైరెక్టర్ వైదేహి, పర్యాటక సదస్సు చైర్మన్ వాల్మీకి హరికృష్ణ శుక్రవారం సచివాలయంలో మంత్రిని కలిసి ఆహ్వానించారు. హైదరాబాద్‌లో హోటల్ మారియట్‌లో జూన్ 28 నుంచి 30 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య పర్యాటకం అభివృద్ధికి పరస్పర సహకారాన్ని కోరుతున్నా మని డైరెక్టర్ వైదేహి తెలిపారు. పర్యాటక అభివృద్ధికి రెండు రాష్ట్రాల సమైక్య ప్రాజెక్టులపై అధ్యయనం చేస్తున్నామని మంత్రి అఖిలప్రియ పేర్కొన్నారు.

ఆర్థిక నేరస్థునితోనా పనిచేసేది?

మంత్రి కాలువ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరు పోరాడినా స్వాగతిస్తామని, అయితే జగన్ వంటి ఆర్థిక నేరగాడితో పనిచేసే అగత్యం టిడిపికి లేదని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కాలువ శ్రీనివాసులు అన్నారు. సచివాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన సహాయాన్ని అందించడంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. న్యాయం జరగలేదని ఎప్పుడు అనిపించినా తాము బహిరంగంగానే చెప్పామన్నారు. న్యాయం జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు.

జగన్ రాజకీయాలను ప్రజలు నమ్మరన్నారు. హోదా పేరు మినహా విభజన చట్టంలోని హామీలన్నీ అమలు చేస్తామని జైట్లీ గతంలో ప్రకటించారని, వాటినే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి అందిన సాయం, రావాల్సిన వాటిపై ఎటువంటి సమాచారం కావాలన్నా అందిస్తామన్నారు. కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలను పవన్‌కు అందించామని, ఇంకా ఏం సమాచారం కావాలన్నా అందిస్తామని తెలిపారు. ఏప్రిల్‌లో చేసే రాజీనామాలను ఇప్పుడే జగన్ ఎందుకు ప్రకటించాలన్నారు. పల్లె నుంచి పార్లమెంట్ దాకా తాము ఎక్కడ అవసరమైతే అక్కడ పోరాటం చేస్తామని తెలిపారు.

మహిళాజట్టుకు మరో విజయం



మిథాలీ రాజ్ (76) నాటౌట్

ఈస్ట్‌లండన్ : టీ20 మహిళా క్రికెట్‌లో భారతజట్టు మరో భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. శుక్రవారం దక్షిణాఫ్రికాతో రెండో టీ20లో తలపడి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన సఫారీ మహిళాజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. ఆ జట్టులో అత్యధిక పరుగులు సున్‌లూస్ 33, క్లెర్క్ 26 సాధించారు. అనూజాపాటిల్, పూనమ్ యాదవ్‌లకు రెండేసి వికెట్లు చొప్పున లభించాయి.

143 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళా జట్టు 19.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి విజయలక్ష్యాన్ని ఛేదించింది. స్మృతి మందాన 57 పరుగులు చేసి డానియేల్ బౌలింగ్‌లో ఎల్బీ రూపంలో పెవిలీయన్‌కు చేరగా... అజేయంగా మిథాలీ రాజ్ 76, హర్మన్‌ప్రీత్ కౌర్ 7 పరుగులు చేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు మిథాలీరాజ్‌కు లభించింది. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో 2-0 ఆధిక్యతలో టీమిండియా మహిళాజట్టు నిలిచింది.

జగన్ @ 1200 కిలోమీటర్లు

ప్రకాశం జిల్లాలోకి ప్రవేశించిన పాదయాత్ర

ప్రజాశక్తి-ఒంగోలుప్రతినిధి, లింగసముద్రం

వైసిపి అధినేత వైఎస్ జగన్ చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర 89వ రోజున 1200 కిలోమీటర్లు పూర్తయింది. శుక్రవారం ప్రకాశం జిల్లాలోకి ఆయన యాత్ర ప్రవేశించింది. నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన ఆయనకు సరిహద్దుల్లోని లింగసముద్రం మండలం రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద జిల్లా నేతలు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికారు. ప్రాజెక్టు వద్ద నుంచే ఆయన పాదయాత్ర ప్రారంభమైంది. పార్టీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. పెంట్రాల, వాకమల్లపాలెం, బలిజపాలెం, తిమ్మారెడ్డిపాలెం, బంగారక్కపాలెం, అమ్మపాలెం గ్రామాల మీదుగా లింగసముద్రం చేరుకున్నారు. రామకృష్ణాపురం వద్దకు 1200 కిలోమీటర్లకు పూర్తి కావడంతో అక్కడే ఒక మొక్కను నాటారు.

మహిళలకు వడ్డీలేని రుణాలు..

వెంగళాపురంలో మహిళలనుద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు పాలనవల్లే అందరికీ కష్టాలు వచ్చాయన్నారు. తాము అధికారంలోకొస్తే మహిళలకు వడ్డీలేని రుణాలను అందిస్తామన్నారు. డ్వాక్రా మహిళల రుణాలను దశలవారీగా చెల్లిస్తామన్నారు. బాలికలను బడికి పంపే తల్లులకు ప్రోత్సాహకంగా రూ.15 వేలు ఇస్తామన్నారు. అనంతరం లింగసముద్రంలో మసీదులోకి వెళ్లారు. అక్కడ ముస్లిములు ఆయన్ను స్వాగతించారు. వైద్యం అందక ఇబ్బందిపడే రోగులను ఆయన పరామర్శించారు. రాళ్లపాడు ప్రాజెక్టు కింద సాగుచేసిన వరికి నీరు లేక ఎండిపోయిన విషయాన్ని రైతులు చెప్పారు. వరి ఓదెలను జగన్‌కు చూపించారు. కొండయ్య అనే గొర్రెలకాపరి జగన్‌ను కలిసి తమ కష్టాలు చెప్పుకున్నారు. గతంలో రూ.100 ఇన్సూరెన్సు కడితే చనిపోయినపుడు గొర్రెలకు రూ.3 వేలు వచ్చేవన్నారు. ఇపుడు రావడం లేదన్నారు. జగన్ స్పందిస్తూ వైసిపి అధికారంలోకి రాగానే గొర్రెల కాపరుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కల్లుగీత కార్మికులూ తమ సమస్యలను చెప్పుకున్నారు. కార్యక్రమంలో ఎంపిలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవి.సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు జంకెవెంకటరెడ్డి, ఆదిమూలం సురేష్, కందుకూరు ఇన్‌చార్జి తూమాటి మాదవరావు, ఇతర నియోజకవర్గాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



ప్రకాశం జిల్లా రామకృష్ణాపురం వద్ద మొక్కనాటుతున్న జగన్

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governerpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68